భాషాపోషక గ్రంథమండలి - 80

పాపిత్తి

సత్యనారాయణ చౌదరి

C



894.8274
SAT

సర్వస్వామ్యసంకలితము

వెల - రూ. 3-00

C.12

ప్ర స్తా వ న

సాహిత్యము ఆలోచనామృతమని ప్రాచీనులు పలికిరి. సాహితీగంధ మంటని బ్రదుకు నిర్గంధకుసుమమువంటిదే యగుట నిశ్చయము.

సాహిత్యాంగములలో 'వ్యాసరచన' ఒక విశిష్టమైన యంగముగా నేఁడు విద్యారంగములో ఎన్నిక కెక్కినది. ఆ రచనకు విమర్శనము జీవగట్ట. ప్రాచీనవాఙ్మయములో మృగ్యమై కొంగ్రొత్తగా మనకు దక్కిన 'సాహిత్యప్రక్రియల'లో వ్యాసరచన ఒకటి యని నవ్యులు వచింతురు. ఆ రూపురేకలలో ఆది ఆ తీరుగఁగన్పింపకపోయినను అలంకారశాస్త్రఘట్టములో దాని బీజములు దండిగా నుండుట మనము గుర్తింపవలెను.

ఏది యెట్లున్నను- నేఁటి కుట్టికారునకు ప్రాచీనసాహిత్యమును రంగరించి నూతిపోయవలెనన్న-వ్యాసరచన వ్యాసుని రచనవోలె గౌరవభాజనమై యున్నది. కాని, భౌతికశాస్త్రాదికము వోలె విషయప్రధానముగా భావించి అందలిశైలిని పేలవముగాఁ జేయుట శ్రేయము కాదు. విషయము - శైలి - అర్థగాంభీర్యము చక్కఁగా ఉన్ననాఁడే ఆ వ్యాసరచన సాహిత్యకళకు సహకారమిచ్చి అందచందములు కూర్చును.

ఈ దృష్టితో, ఈ 'దశాబ్ది'లో అప్పుడప్పుడు 'సాహిత్య సంచికల'కు 'మాసాశనము'గ నేను వ్రాసిపంపిన వ్యాసములలో

కొన్ని- రేడియోలో నేను వినిపించినవి కొన్ని - సాహిత్యసభలలో చదివినవి కొన్ని- ఏర్చికూర్చి మార్పులు కూర్పులు కావించి ఈ స్వరూప మిచ్చితిని. ఈ రచనకు కారకులయిన ఆ యా యధి కారులకు నా యభినందనములు.

ఇందలిభావము లన్నింటికి నా 'యుపజ్ఞ'యే మూలమని నా భావము కాదు. అభిజ్ఞు లెందఱో చర్చించి సూత్రప్రాయ ముగ మన కిచ్చిన విశేషాంశములు లెస్సగాఁ జదివి నా నేర్చిన తీరులో కొన్నింటికి వ్యాఖ్యానములు చేసి వానినే ఇందు పొందు పఱిచితిని. సాహిత్యనిష్ణాతులు ఆయాయిఘట్టములలో ప్రవచిం చిన సిద్ధాంతములకే లక్ష్యములు సేకరించుచు వానిలో నాకు నచ్చినవానిని 'సంకలనము' చేసితిని.

ముమ్మొదట వేఱువేఱుగా ఈ వ్యాసములు పుట్టియుం డుటఁజేసి వచ్చిన యంశములే మఱల మఱల ఈ వ్యాసపరం పరలో రావచ్చును. ప్రపంచార్థమై వాని నట్లే ఉంచితిని. ఇందలి మంచిచెడ్డలకు విద్వల్లోకమే ప్రమాణము.

'త ఏవాక్షరవిన్యాసా స్తా ఏవ పదపంక్తయః
పుంసి పుంసి విశేషేణ కాపి కాపి సరస్వతీ.'

AOUA102B103

కృతిపతి

శ్రీ పరుచూరు వెంకటసుందరవరదులు గారు

M. A., LL. B.,

భూస్వామి - మద్రాసు హైకోర్టు అడ్వొకేటు

రామనగర్

తిరుత్తని

3F

శ్రీ సుందరవరదులకు

సరసుఁడు సాధువర్తనుఁడు సౌమ్యుఁడు సుందరవిగ్రహుండు'సుం
దరవరదుండు' మత్కృతికిఁ దగ్గ వరుండని తోఁచి దొడ్డసం
బరమున నిర్ణయించితిఁ, గృపాభరితుండగు వేంకటేశ్వరుం
డిరువుర కింటివేల్పగుట నియ్యది సార్థక మయ్యె నియ్యెడన్

౨

ఈతఁడు సాహితీప్రవణుఁ-డిద్ధచరిత్రుఁడు-న్యాయవాది, నా
కీతనితోడిమైత్రి మది కింపును బెంపును నింపుచుండ సం
ప్రీతుఁడ నౌట నా తగినరీతిగ నీ కృతి యిచ్చి యక్షర
వ్రాతములోన దాఁచితిఁ బరస్పరసౌహృదలాభసంపదన్

౩

తరతరాలుగ వియ్య మందిరి మదీయ
వంశ్యు లీతని వంశమువారితోడ;
కాకతాళీయముగ నిది కలసివచ్చి
నాదుసంకల్పమునకుఁ బ్రాణంబు వోసె

౪

ఇతరరాష్ట్రమ్ములో వసియించి తెల్గు
కమ్మఁదనమును మఱువని ఘటకుఁడనియుఁ
దెలుఁగు సాహిత్యసౌరభ్యదీప్తి వెలయు
మంచి విద్వాంసుఁడనియు భావించుకొంటి

౫

కవి శ్రమంపడి యిచ్చిన కానుకలకు
విలువ గుర్తింపఁగలుగు వివేకి, యెవని
కృతికి-పతిగా లభించునో యతని భాగ్య
మింత యని వేఱె వర్ణింప నేరితరము?

ఉ

నాదురచనలలోని విన్నాణ మేదొ
చదివి గుర్తించి నాకు సుస్వాగతంబు
పలికిన 'రసజ్ఞు' గొనియాడఁగలిగినపుడె
కృత మెఱింగినవాఁడనై బ్రతుకఁగలను

ఊ

వ్రాసి యుంచిన దంతయు వాసి గూర్చు
వ్రాఁత కాఁబోదు కవి యెంతవానికేని;
నిత్యకృషి సల్పుచున్నచో నికరమైన
ఫలిత మద్దిదక్కవచ్చు లోకులకుఁ గొంత

ఋ

అరసికుండగు ధనవంతు నాశ్రయించి
'రచన' వినిపించునట్టి 'ప్రారబ్ధ' మెపుడు
నాదుమొగమున వ్రాయింపరాదటంచు
నజుని వేఁడెద జన్మజన్మాంతరముల

ౠ

నా యొనర్చెడి కృషికి ననారతంబు
దోహదంబైన ప్రక్రియతోడ నన్ను
వెన్ను చఱచుచు నుత్సాహపెట్టు నిట్టి
మిత్రవర్యుల కే నిచ్చు మెచ్చు లివియె.

—స

సూచిక

1. భాష-వ్యాకరణము ... ౯
2. తెలుఁగు తియ్యఁదనము ... ౧౭
3. తెలుఁగు-ప్రాకృతభాషలు ... ౨౫
4. సాహిత్యతత్త్వము ... 33
5. కావ్యము-తద్విశిష్టత ౫౯
6. ధ్వనిప్రధానరచనలు ... ౭౦
7. తెలుఁగు భారతము ... ౮౨
8. నన్నయప్రసన్నకవిత ... ౯౧
9. తిక్కన-ప్రకృతివర్ణనము ... ౯౯
10. విరాటము-పాత్రౌచితి ... ౧౦౮
11. కీచక నిగమశర్మలు-వారిఅక్కలు ... ౧౧౯
12. శ్రీనాథుఁడు ... ౧౩౮
13. రాయలవారి కావ్యములు ... ౧౫౧
14. 'ఆముక్తము'లోని వర్ణనావైదుష్యము ౧౫౯
15. వసుచరిత్ర ౧ ... ౧౬౯
16. ,, ౨ ... ౧౭౯
17. నన్నయ్య-చిన్నయ్యలు ... ౧౮౬

ఓం

సాహితి

'భాష - వ్యాకరణము'

పరస్పర భావములను గుర్తింపను సాధనమైన శబ్దరూపమే భాష. ఆ శబ్దము ఉచ్చారణలో ముమ్మొదట ధ్వని రూపమై ఆభ్యంతరప్రయత్నములచే ఒక రూపునకు వచ్చి కంఠతాల్వాదిస్థానములలో అంటుకొని కకారాది రూపము లుగా సిద్ధించును. వానినే అక్షరములని వర్ణములని వ్యవహరింతురు. అవియే పదములుగా వాక్యములుగా సమకూడి ఆయాయి యర్థములను బోధించును.

ఆదిలో వాగ్రూపమున వెలువడిన భాష క్రమక్రమముగ లేఖనారూపము నందుకొనును. ఆ దశకు రాలేక పరస్పర భావప్రకటనమునకుమాత్రమే పనికివచ్చెడి భాషలు ప్రపంచములో లేకపోలేదు. నాగరికత పెరిగినకొలఁది భాషలో వికాస మేర్పడి చిలవలు పలవలుగా వన్నెచిన్నె లెన్నో యుద్భవిల్లును. లేఖనారూపములో విశిష్టత కలిగి పదిమందికి ప్రయోజనకారిగా ఏర్పడిననాఁడు ఆ భాషయే వాఙ్మయముగా పరిఢవించును. ఆ వాఙ్మయములో నిగ్గుతేలిన సారమునే సాహిత్యమని సారస్వతమని పిలువవచ్చును. భాష - వాఙ్మయము - సాహిత్యము, ఇవి పర్యాయపదములు కావు. భాష నేర్చినవారెల్లరు సాహిత్యవేత్తలు కారు.

ఏ భాషలో సాహిత్యము మఱెహూన్నత స్థానమునకు వచ్చునో ఆ భాషలో విశిష్టత ఉన్నట్లు లెక్క. 'సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయ' మ్మను మాటలో ఇదే భావ మున్నది. ఆలోచనామృతమైన సాహిత్యమును సంపాదింప వలెనన్న భాషలో మంచి పరిశ్రమ చేయవలయును. ఆ పరి శ్రమ కెన్నో త్రోవ లున్నవి.

శబ్దార్థము లెఱింగి అందలి సారస్యము గుర్తించి నప్పుడే సాహిత్య మబ్బినట్లు. సాహిత్య మబ్బని చదువులు నిస్సారములు. ఆ సాహిత్యమే మనకు కవితా సామ్రాజ్యము లోని చిద్విలాసములను వేలెత్తి చూపును. దాని ఫలితమే కావ్యామృతరసాస్వాదము. అదియే మధురమైన మంచి ఫల మనియు, అది సంసారవిషవృక్షములో పుట్టియు అమృతము వంటి ఫలితము నిచ్చుననియు పెద్ద లనుభవించి చెప్పిరి. అట్టి రసాస్వాదము చేయవలెనన్న, సారస్యతములో లోఁతు పాఁతులు తెలియవలెనన్న, భాషలో మంచి పరిశ్రమ కావలె నన్న-అది ఏభాషయైనఁగానీ దాని కొక మంచిసాధన మున్నది. అదియే వ్యాకరణము.

'యద్యపి బహు నాధీషే తథాపి పఠ పుత్ర! వ్యాకరణం,
స్వాజనఃశ్వాజనో మా భూత్ సకలం శకలం, సకృత్ శకృత్ ।'

ఇది పూర్వము 'భట్టి' యను కవీశ్వరుఁడు చెప్పిన గట్టిమాట.

'అంతగా తక్కిన చదువులు చదివినను చదువకపోయి ననుమానెగాని వ్యాకరణము తప్పక చదువవోయి నాయనా! అని దీని భావము. ఆ శాస్త్రమే నీకు రానిచో స్వాజనము

*శ్వాజనముగా, సకలము శకలముగా, సకృత్తు శకృత్తుగా నీ నోటి వెంట రావచ్చునయ్యా!' అని.

అదేమోగాని, నేటి విద్యాశాలలలో కుఱ్ఱకారు వ్రాఁతలలో 'విధ్య - విధ్యార్థులు - బ్రాహ్మలు' అన్న మాటలు ముప్పాతికమువ్వీసము కొట్టవచ్చినట్టు కన్పట్టును. ఇఁక నోటి మాటలలో అపస్వారాలకు అస్తవ్యస్తములకు అంతు లేదు. వ్రాఁతలో కూఁతలో ఈ దొసఁగులు పొసఁగ కుండ సాహిత్యము పెంచుకోవలెనన్న - శబ్దజ్ఞానము - ప్రకృతి ప్రత్యయ వివేకము చాలినంతగా ఉండవలెను. ఆ పరిజ్ఞానమే భాషను, ఒక కట్టడలోఁ బెట్టును. అదియే పైని జెప్పిన వ్యాకరణము. దానినే శబ్దశాస్త్రమని వ్యవహరింతురు.

యావద్భారతములో ఆ శాస్త్రము ఒకదీపమువంటిది. ఆ దీపమును ఉపయోగించుకొనని శాస్త్రమే లేదు. శాస్త్రము లన్నియు ఒకయెత్తు; వ్యాకరణశాస్త్ర మొకయెత్తు. దానినిబట్టియే ధ్వనికారుఁడు 'ప్రథమే హి విద్వాంసో వైయాకరణాః, వ్యాకరణ మూలత్వా త్సర్వవిద్యానామ్' అని వచించెను.

వ్యాకరణశాస్త్రవేత్తలే విద్వాంసులలో ముమ్మొదట లెక్కకు వత్తురని ఆ మాటకు భావము. పైగా-కవితాకన్యకకు వైయాకరణుఁడు తండ్రివంటివాఁడఁట. ఇవి యన్నియు పురాతనసంస్కృతవాఙ్మయములో వ్యాకరణశాస్త్రమున కున్న ప్రశంసలు.

నేఁడు దేశ్యభాషలలో విశిష్య- తెలుఁగువిద్యార్థులలో

---

* శ్వాజనము = సేవకులు, శకలము = ముక్క; నార-శకృత్తు = మలము.

వ్యాకరణభాగ మనఁగా ఒక యుప్పుబుట్ట తెచ్చి ముందుఁ బెట్టినట్లు. నితోత్సాహము గల విద్యార్థులుసైతము వ్యాకరణభాగము వచ్చుసరికి 'మందకొడి' గా సంచరింతురు. ఆ ప్రణాళికయే విద్యార్థుల శిరోవేదనకు ఆస్కారమైనది. పెద్దగా పరిశ్రమింపను బుద్ధి పుట్టని అద్యతనవిద్యార్థులను గూడ మనస్సులోఁ బెట్టుకొని తెలుఁగులో వ్యాకరణ గ్రంథము లెన్నో పుట్టినవి.

బడులలో పాఠ్యములలో వ్యాకరణముకూడ లెక్కకు ఒక్కటిగా నియమింతురు. కాని ఫలితము శూన్యము. పిల్లలలో ఈ బెడద పుట్టుటకు హేతు వేదో విచారింపవలెను.

జీవద్భాషలకు వ్యాకరణముతో పని లేదన్నట్లు ఒక ధోరణి కొందఱిలో నుండవచ్చును. కేవలము వ్యాకరణ శృంఖలలకుఁ గట్టువడి లొంగుట దేశ్యభాషల కొకింత కష్టమో నష్టమో కలుగవచ్చునేమోగాని, మొదలు ఆదీపమే లేనిచో ఆ భాష సాహిత్యదశకు రాలేదు. కావున వ్యాకరణ మన్నది బాల్యమునుండియు విధిగా నేర్వవలసిన విద్య యన వచ్చును.

వ్యాకరణమనఁగా వెంటనే సూత్రములు జ్ఞప్తికి వచ్చును. ఈ దేశములో 'సూత్రయుగము' న కింత విలువ వచ్చిన దనఁగా దానికి వ్యాకరణశాస్త్రమే ప్రాతిపదిక మని పాశ్చాత్యపండితులు సైతము మురిసిపోయిరి. అల్పాక్షరము లలో అనల్పార్థము నిమిడ్చి అద్భుతమైన శాస్త్రమును ప్రాచీనులు మనకు ప్రసాదించిరి. దానిని నేఁడు మనము మననము చేసికొనుటలో కొన్నిచిక్కులు కలుగవచ్చును. ఎన్నో ఇతర

శాస్త్రములు నేర్వవలసియున్న ఈ రోజులలో ఈ వ్యాకరణ శాస్త్రమునకు అంత ప్రాముఖ్య మీయ లేకపోవచ్చును. అయిన ను మంచిభాష కుదురవలెనన్న-సాహిత్యము చక్కఁగా పెరుఁగవలెనన్న వ్యాకరణదీపమును ఆశ్రయింపక తప్పదు. పోనీ, లక్ష్యభాగముచేతచే లక్షణజ్ఞానమును సంపాదింపవలె నన్న ప్రక్రియాబాహుళ్యము మనకు చిక్కులు తెచ్చిపెట్టును. లక్ష్యజ్ఞానమును మాని లక్షణజ్ఞానమునే 'బట్టీ'పెట్టుట అనుభవమునకు రాని వేదాంతవిద్యవోలె వ్యర్థమే యగును. కావున వీలయినంతవఱకు లక్ష్యభాగమునకు లక్షణజ్ఞానమును అనుబంధముగా సమన్వయపఱుచుచు సాహిత్యమును బెంచుకొనుటయే సర్వశ్రేయమని చెప్పవచ్చును.

అదృష్టవశమున ఆంగ్లకళాశాలలలో ఇటీవల తెలుఁగు వ్యాకరణమునకు కొంత ప్రవేశము లభించినది. నవనవలాడు పిల్లల మనస్తత్త్వమునకు దుర్గమారణ్యమువంటి వ్యాకరణ భాగమును జూపి అదరు బెదురు కలిగింపక, ఉత్సాహప్రోత్సాహములు కూర్చి ఉపదేశింపవలసిన బాధ్యత అధ్యాపకులకున్నది. ఒక్క లక్ష్యమునకు పెక్కు సూత్రముల పరిచయము కావలసియుండుటచే ఆ సూత్రములను మనస్సులో దాఁచుకొనుటలో పిల్లలు బెదరిపోకుండ, ఆ భావము చెదరిపోవని సులువైన ధోరణిలో సూక్ష్మములో మోక్షముగాఁ గను గొని బోధించుట మంచిది. శబ్దస్వరూపములో ప్రకృతి ప్రత్యయ విభాగములో కారకప్రవృత్తిలో వాక్యప్రయోగ వైచిత్రిలో హృద్యములైన ఘట్టములనే ఎత్తుకొని లక్ష్య భాగమునకు అనుబంధముగా మేళవింపఁజేసి బోధించినచో

శబ్దసంస్కారము నేటి కుట్టికారునకు కొంతవఱకైన అంట వచ్చును.

ఎంతగా వ్యావహారికములో రచనలు నడపవలెనని మోజు లున్నను శబ్దసంస్కారములోని పుట్టుపూర్వము లెఱిగియుండవలెను. భాషను సమగ్రముగ శాసించు వ్యాకరణశాస్త్రము తెలుఁగునకు లేనిమాట నిజమే యైనను, వ్యాకరణ సంప్రదాయములు ఎఱుఁగవలసిన యక్కఱ మనకుఁ దప్పదు. వ్యాకరణము విడిచి మహోన్నతస్థానమున కెక్కిన భాష ఏదియు ప్రపంచములో లేదు. పైగా-ప్రపంచములో పేరు గాంచిన భాషలలో 'ఈ శబ్దము ఇట్లే ఉచ్చరింపవలె' నని ఉచ్చారణములో నైతము శాస్త్రము పుట్టియున్నది. అట్టివినైతము సుష్ఠుగా పాటించి నిర్దుష్టముగా వాక్యప్రయోగము చేయవలెనని కట్టుదిట్టములు గావించుకొని ఎన్నో భాషలు రాణించుచుండఁగా- తెలుఁగులో మనకు వ్యాకరణముతో పనిలేదనుట అర్థము లేనిమాట. ప్రాథమికశిక్ష మొదలుకొని ఒక పదములో వర్ణవ్యత్యయముగాని ఉచ్చారణ లోపముగాని కానవచ్చినచో ఇంగ్లీషు చదువులలో ఆక్షేపములు వచ్చును. పట్టభద్రుఁడై పదిమందిలో పెద్దగానున్న న్యాయవాది వీధిలోఁ గట్టిన చెక్కమీఁద 'నరశింహ్మారావు' అని వ్రాయించుకొనియుండఁగా-అది ఎవ్వరికిని బట్టదు. సీతారాములను 'శీతారాములు' గాఁ జేసినను మనకు లెక్కలేదు. పరభాషలో మనము తీసికొను శ్రద్ధాభక్తులలో శతాంశమైన మనభాషలోఁ గుదిరినచో వ్యాకరణ మన్న-సాహిత్య మన్న నల్లేరుపై బండినడకగాఁ జేసికోవచ్చును.

'గిడుగు' వంటివా రెన్నఁడో వ్యాకరణ శృంఖలలు త్రెంపవలెనని అన్నదానిలో దుర్బలులకుఁ దోఁచు నర్థము మఱొకటి కావచ్చును. ఆ శాస్త్రము పుట్టుపూర్వము లెఱిఁగి ఆ సాహిత్యములో ఆనుపానులు గుర్తించి భాషావికాసము కోసమై వారొక కొంగ్రొత్త త్రోవలు త్రొక్కియుండవచ్చును గాని, ఈ శాస్త్రముతో బొత్తిగాఁ బనిలేని వ్రాఁతలే మన వాఙ్మయమునకు ప్రాణప్రదములని వారి భావము కాదు. ఎందాఁక ఈ దేశములో తిక్కనాది మహాకవుల సాహితీ మాధుర్యము చవిచూడవలసిన యోగ్యత ఉండునో, వసుచరి త్రాది ప్రబంధములతో మనకు సంబంధ ముండునో అందాఁక ఆ గ్రాంథిక భాగ్యమును గడించుటకైన ఏదేని ఒక వ్యాకరణ దీపము మనకు ఆవశ్యకమై యుండును. ప్రాచీన వాఙ్మయ మును విడిచి కేవలము నవ్యవాఙ్మయమందే మనము కాల క్షేపము చేయలేము.

నన్నయ్య కవితా సౌరభ్యములోని సొబగు చవి చూడ వలెనన్న చిన్నయ్య సూత్రములు దిక్సూచిగానైన మనము పాటింపవలసియున్నది. ఉన్నంతలోనే ఈ లక్షణమును సాధ నముగాఁ జేసికొని ఆ లక్ష్యభాగమును బరీక్షించి చదువు కొనవలసియుండును. 'ప్రయోగ శరణం వ్యాకరణ'మ్మను మాటను విశ్వసించి మహాకవి ప్రయోగములను గుర్తించి, వాని యాధారముతో ఒక కట్టుపాటు చేసికొనక తప్పదుగదా! అభ్యాసమువలన మనచేతికి వచ్చిన ఆ వ్యాకరణదీపము, అమూల్యమునైన సాహిత్యరత్నము లెన్నింటినో ఏర్చికూర్చి ప్రోవుచేసి మనకందించును.

అది చక్కఁగా గుర్తించి భాషాశుద్ధితోపాటు ప్రజ్ఞా ప్రాభవమును విజ్ఞానవైభవమును లెస్సగా గడించి తెలుఁగు నకు విలువ కలిగింతుము గాక!!

[1960—జనవరి]

తెలుఁగు తియ్యఁదనము

వెనుక ఒకతూరి ఒక 'పత్రిక' లో ఒక కవీశ్వరుఁడు తెలుఁగువారు నాగరకులు కారనుటకు వారి భాషలో దీపమునకు తెలుఁగుమాట లేకుండుట ఒక కారణమని వ్రాసెను. ఆతఁడు చదివిన పుస్తకములలో ముప్పాతికమువ్వీసము 'దీపములు-దివ్వెలే' గాని నిజమునకు తెలుఁగుపదములు కన్పింపక పోవచ్చును. వెంటనే పత్రికలలో 'తిర్లిక' లేదటయ్యా యని పలువురు పలువిధాల ప్రత్యుత్తరము లిచ్చిరి. అనఁగా-ముచ్చట గూర్చు ఎన్నెన్నో తెలుఁగుపదములు తెలుగు గడ్డలో మాఱుమూలపల్లెలలో మూలుగుచున్న వేగాని బస్తీల కెక్కుటయో, పుస్తకములలో చొచ్చుటయో జరుగుటలేదు.

నాగరకమ్మన్యులు లేని పల్లెలలో ఇప్పటికిని 'తిర్లిక' పెట్టవేళ అయినదే పిల్లాయని ప్రొద్దు గ్రుంకుట కొక 'పరి భాష' గా వ్యవహరింతురు. ఈ వ్యవహారమును వినియే కాఁబోలు-ఆనాఁటి 'బ్రౌను' మహాశయుఁడు 'తిర్లిక-దీపము' అని బ్రౌణ్యములో వ్రాసిపెట్టెను.

రాత్రివేళ కొందఱిదృష్టిలో 'ఉప్పు' తెమ్మనుట తప్పు. 'లవణమో' - 'బుట్టలోనిదో' తెమ్మని అనవలెనఁట. వేళా విశేషములనుబట్టి పదములకు సైతము నైచ్యము కల్పించి, వ్యవహారములో 'వాచ్యములు-అవాచ్యములు' అని రెండు తెగలు సృష్టించిరి. ఈ ధోరణిలో మనము దైవమును

బిలుచుట కేని ఒక తెలుఁగుపదమైన సంపాదింపలేని విస్మృతా వస్థలోఁ బడితిమి. కొంతకుఁగొంత-పోతన్న జన్మభూమియైన 'తెలంగాణము' మనకు తెలుఁగుదనము చూపుటలో ముంద రికి వచ్చుచున్నది. దైవమునకు-ఎల్లయ్య, లేఁడా యని ఆ పరగణాలో విందుము. తక్కి-నచోట్లను వ్యవహారములో దీని జాడ కొంత కానవచ్చును. నాగరకులు కానివారి ఆఁడు వాండ్రలో 'మా దేవుఁడు ఊరిలో లేఁడ'ని భర్తనుగూర్చి పలికెదరు. భర్తపేరు తాము ఉచ్చరింపరాదన్న సంప్ర దాయము గల స్త్రీలు 'ఎల్లయ్య-ఇట్లు చెప్పె'నని ఉదాహ రింతురు. కాని, గ్రంథములలో ఈ 'ఎల్లయ్య'ను దైవపర ముగా వాడకుండుటకు తెలుఁగుదనము తెలియకపోవుట మొదటి కారణము.

అసలు-ఈ భాషకు 'నామకరణము'లోనే కొంత గజిబిజి కానవచ్చును. తెనుఁగునకు ఆంధ్ర మను పేరు తెలుఁగువారెట్లు పెట్టుకొనిరి? తెలుఁగులో ఒత్తక్షరములు ఉండవుగదా! స్థిరాక్షరమైన 'ధ' కారమునకు పూర్వము బిందు వెట్లు వచ్చును? కావున ఈ పేరు ఈ భాషకు తరు వాత నెవ్వరో పెట్టుకొని యుందురని కొందఱందురు. అంతకు ముందున్న పేరు లెయ్యవి? అవియే 'తెలుఁగు-తెనుఁగు.' వానినే సంస్కృతీకరించి 'ఆంధ్రభాష-ఆంధ్రజాతి' యని పిలిచియుండవచ్చును. వింధ్యకు దక్షిణాన అడవులలో ఆంధ్ర జాతియను నొక తెగ యుండినట్లు ప్రాచీన సంస్కృత గ్రంథ ములలోఁ గానవచ్చుచున్నది. ఐతరేయ బ్రాహ్మణములో సైతము 'ఆంధ్రజాతి' ప్రస్తావ మున్నది.

తేనెవలె తియ్యగా నుండునుగాన తెనుఁగైనదనియు, తెలుఁగునాటిలో వాడఁబడునదికాన తెలుఁగైనదనియు కొందఱు చమత్కరింతురు. కొందఱు, వీనికే సంస్కృతముద్ర వైచి 'త్రినగభాష-త్రిలింగభాష' అని పేరుపెట్టి ఈ జాతికి 'సింహాచల - శ్రీశైల - శేషాచల' మధ్యభాగములు ఒక హద్దుగా నిర్ణయముకూడఁ జేసి చూపిరి. భాషాశాస్త్రమును బట్టి సంస్కృతభాషా సంబంధములేని ఈ తెలుఁగును ద్రావిడ భాషాకుటుంబములోఁ జేర్చి, తెలుఁగువేఱు-ఆంధ్రము వేఱు అన్నంతదాఁక భాషాశాస్త్రజ్ఞులు నిర్ణయించిరి. ఈ గజిబిజి వలననే 'సంయుక్తమద్రాసు శాసనసభలో' ఒకప్పుడు 'ఆంధ్ర యూనివర్సిటి' అనుటకు అనేకములైన ఆక్షేపణములు వచ్చి ఏవేవో కారణములచే తుది కొక పరిష్కారము చేయవలసి వచ్చెను. కాఁగా-కాలమునుబట్టి పౌర్వాపర్యము లెట్లున్నను మనభాషకు నేఁడు 'ఆంధ్రము-తెనుఁగు-తెలుఁగు' అను మూఁడుపేరులు పర్యాయములై చెల్లుచున్నవి. నన్నయ్య మొదలు నేఁటివఱకు ఎల్లవారు ఈ మూఁడుపదములను ముచ్చటగా తమతమ గ్రంథములలో వాడుకొనుచుండుట మనము చూతుము.

అట్టి యీ భాష తక్కిన భాషలకన్న తియ్యఁదనము గలదన్నమాట నేటిది గాదు. తెలుఁగు-ఆంధ్రమైన తరువాతనే ఈ కమ్మఁదనము కలిగెనేమోయని నా భావము. కన్నడరాయనికి తెలుఁగురాయఁడు కలలో వచ్చి ఆముక్త మాల్యదను తెలుఁగులో వ్రాయుమని చెప్పెనఁట. కన్నడ రాయఁడైన రాయలకు కన్నడములోనో మఱి ఏ భాషలోనో

కావ్యము వ్రాయుమని చెప్పక తెలుఁగులోనే వ్రాయుమను టకు మూఁడు కారణము లున్నవఁట. ఒకటి ' దేశంబు తెలుఁగు '; రెండవది ' ఏను దెలుఁగువల్లభుండ '; మూఁడ వదియే ఆ రెండింటికన్నను బలవత్తరము; మన కిప్పుడు ముఖ్యతమము. ' తెలుఁగొ కండ '— తెలుఁగు కండ గల భాషయఁట. కండ యనఁగా పులకండ మనియు నర్థమున్నది. గజపతిరాజుల దేశము మొదలు కన్యాకుమారివఱకు అఖండ సామ్రాజ్య మేలిన కృష్ణరాయల దర్బారులో నానాభాషలు మాటలాడు రాజులు వచ్చి రాయలను గొలుచుచుండఁగా— ఆ యాయి దేశ్యభాషలలో ఈ తెలుఁగుభాషయే తియ్యనిదని రాయలవారు గ్రహించెనఁట. ఒకవేళ అప్పటికి గ్రహింపక పోయినను గ్రహింపవయ్యా యని తెలుఁగురాయని యుపదేశ మఁట. " ఎల్లనృపులు గొలుచు నెఱుఁగవే "— అని.

ఇంతకన్నను మనభాష మధురమని చెప్పుటకు 'మోతు బరి' సాక్ష్యములు కావలెనా !

పోనీ, తెలుఁగురాయఁడు మన కిలువేల్పు; కన్నడ రాయఁడు మన ప్రభువు. ఉభయులు అభిమానముతో పలికి రందమా !

ఆఱువేలమైళ్ళనుండి ఈ దేశమున కెవ్వఁడో రాజ బంధువు విదేశ్యుఁడు ఉద్యోగమునకై బందరు వచ్చెను. ఆయన ఒక జిల్లాజడ్జియఁట. ఆ పదవి, ఆతని తీర్పులకుఁగూడఁ బనికివచ్చునుగదా! ఆ బ్రౌను దొర తెలుఁగువారికి రక్త బంధువు కాదే. భాషాబంధువు కావచ్చుఁగాక. ఆయన ఈ దేశమునకు వచ్చి మఱికొన్ని దేశ్యభాషలు చక్కఁగా నేర్చి

వానిలో తెలుఁగు సొగసునకు మురిసిపోయి, అచ్చు పుస్తక ములే లేని ఆ రోజులలో ప్రాచీనకావ్యములు సేకరించుకొని పండితులను దగ్గఱఁ బెట్టుకొని భాష్యము వినిపించుకొని పాండిత్యము గడించి 'ఓరా! ఈ తెలుఁగు ఇటాలియన్ వంటి తియ్యని భాషరా' అని కితాబు ఇచ్చి మెచ్చుకొనెను.

ఎందఱో తెలుఁగురాజులు ఎందఱో విద్వాంసులు ఎందఱో కవీశ్వరులు ఎందఱో సంపన్నులు చేయలేని ఎంతో మంచిపనిని ఈ బ్రౌనుదొర తెలుఁగువారికిఁ జేసిపెట్టెననుట లోకము మఱచిపోవరాదు. అచ్చు లేని ఆ రోజులలో మంచి మంచి తెలుఁగుకావ్యములు తెప్పించుకొని వ్యాఖ్యానములు వ్రాయించి అచ్చునకుఁ దెచ్చెను. విశ్వదాభిరామపద్యములను సమగ్రముగా సేకరించి వాని కింగ్లీషుపద్యములు వ్రాసి విదేశ ములకుఁ బంపి తెలుఁగువారి విన్నాణమును లాఁతివారికి రుచి చూపించెను. ఆ భాషలోని మాధుర్యము ఆతఁడు కనిపెట్టి అన్నేండ్లు అంతశ్రమ చేసి తనధనము తనకాలము ఎంతో కర్చుపెట్టి తెలుఁగువారికి అంత సాయము చేసియుండఁగా, నేఁడు మనపిల్లలకు విదేశ్యభాష ఏదో రవ్వంత రంగరించు కొన్నంత మాత్రాన మాతృభాష పరభాషగా-ద్వితీయ భాషగా-విశ్రాంతిభాషగా - ఉపేక్షాభాషగా - తోఁచుటలో అరమేమైనఁ గలదా?

ఇఁక మూఁడవసాక్ష్యముతో ముగింతును. దక్షిణాపథ ములో 'అప్పయ్యదీక్షితులవా' రన్న పేరు, వాఙ్మయరీతిగా మతరీతిగా జగ మెఱిఁగిన పేరు. ఆయన మహాపండితుఁడే కాదు; ఎన్నో గ్రంథములను వ్రాసిన మహాకవీశ్వరుఁడు.

మహాకవీశ్వరుఁడే కాదు; సర్వశాస్త్రము లెఱింగిన విద్వచ్ఛిరో మణి. అంతవాఁడు 'ఆంధ్రత్వము-ఆంధ్రభాష జన్మాంతర సుకృత విశేషము ఉన్నవారికే దక్కు-'నని యొక్క శ్లోకమును సుభాషితముగాఁ జెప్పెను. ఆయన దేశములో నేఁటికిని త్యాగయ్య కృతులు తమ యక్షరములలో నేర్చి ఈ ప్రాంత ములకే వచ్చి కచ్చేరి యిచ్చి మనవారిని మెప్పించి డబ్బుచేసి కొనుట నిత్యము మనము చూచుచున్నదే. అఱవదేశమునకు వలసవోయిన వంగడములోని త్యాగయ్య, తెలుఁగు పలుకు లలో ఇలువేలుపును స్తుతించుటకు హేతు వేమి? తెలుఁగు మధురాతిమధురమనియే. అఱవబాస ప్రాచీనమే కావచ్చును గాని, ఈ తియ్యఁదనము దానిలో లేదని ఆ గానబ్రహ్మకుఁ దెలియదా? ఆ సారము కనిపెట్టియేగాదా ఆ పాటలే నీటుగా నేర్చి అఱవలు పెక్కుమంది మనవారిలో 'రసమును' పిండ నేర్చిరి.

ఈ మాత్రము సాక్ష్యములనుబట్టి మన మాతృభాష లోని మాధుర్యమును జక్కఁగా భావించి వ్యాసంగమున కుపక్రమింతుమేని అడుగడుగునకు దాని లక్షణములు మనస్సు నకుఁ బట్టును. ఏవో ఒండు రెండుతక్కు అన్ని ధ్వనులను జక్కఁగా వినిపింపఁగల భాష ప్రపంచములో ఒక్క 'ఆంధ్రమే' యనుట అభిజ్ఞులు చెప్పిన మాట. కొన్ని భాషలు హలంత ములు కాఁగా-కొన్ని యుభయములు కాఁగా తెలుఁగు కేవలము అజంతభాష యగుటచే హృద్యమైన సంగీతము నకును బనికివచ్చి తియ్యఁదనమును గూర్చుకొన్నదని చెప్ప వచ్చును. యీవదాభరతములో తత్సమాకారము గడించు

కొనుటలో మిక్కిలి నేర్పు చూపిన ఈ తెలుఁగులో పదలాలిత్యము లెస్సగాఁ గుదిరి మాధుర్య ముట్టిపడుచుండునని భావింపవచ్చును. నవరసముల కనువైన రీతిలో నాణెమైన పలుకులు కుదిరి మంచిశయ్య ఏర్పడి, ఆ కూర్పు నేర్పులవలన శ్రోతల కానంద మిచ్చుటఁజేసి తెలుఁగు తియ్యనిదని చెప్పుటలో తప్పు లేదు.

ఇట్టి మధురాంధ్రభాషామయ ప్రపంచమును రామరాజ భూషణ కవిసార్వభౌముని మాటలలో ఒకసారి స్మరింతము;-

'మహిము న్నాగనుశాసనుండు సృజియింపం గుండలీంద్రుండు దన్మహనీయస్థితిమూలమై నిలువ శ్రీనాథుండు ప్రోవ న్మహా
మహులై సోమఁడు భాస్కరుండు వెలయింపఁ సొంపు
వాటించు నీ
బహుళాంధ్రోక్తిమయప్రపంచమునఁ దత్పాగల్భ్య
మూహించెదఁ.'

ఇక్కడ ప్రపంచమనఁగా విస్తరమనియు విశ్వమనియుఁ జెప్పవలెను. విశ్వసృష్టికి కర్త బ్రహ్మ. ఆయన వాగనుశాసనుఁడఁట. అనఁగా సరస్వతీశాసనుఁ డన్నమాట. ఆయన ముమ్మొదట సృష్టింపఁగా దానిని శేషుఁడు భరించెనఁట. ఆపై విష్ణువు పోషింపఁగా సూర్యచంద్రులు వెలుఁగులు వెలయించిరఁట. ఇది శ్లేషతోఁ గూడిన ధ్వని. ప్రకృతము మనకుఁ గావలసినది మఱొకటి. వాగనుశాసనుఁడైన నన్నయభట్టు కవితాసతిని సృష్టించెను. కుండలీంద్రుఁడనఁగా సోమయాజియైన తిక్కనమంత్రి. ఆతఁడు ఆ కవితాసతి మహనీయస్థితికి మూలమయ్యెను. ఆవల శ్రీనాథకవిసార్వభౌముఁడు ఆ కవితా

సతిని చక్కఁగా సంరక్షించెను. మహామహులైన సోమఁడు-
భాస్కరుఁడు, ఆ కవితాసతికిఁ గావలసిన వెలుఁగులు కూర్చిరి.
ఇది-బహుళాంధ్రోక్తిమయ ప్రపంచపరిస్థితి.

ఈ పరిస్థితిని ఈ ప్రాగల్భ్యమును లాఁతివారి మోతు
బరి సాక్ష్యములు వినియైన మనస్సులో పట్టించుకొని మాతృ
భాషలో మమకారము పెంచుకొని మంచి పాండిత్యము
గడించి దాని సారమును లాఁతివారికి విదేశీయులకు వినిపించి
తెలుఁగువారు ధన్యు లయ్యెదరుఁగాత!!

[1958—డిసెంబరు]

తెలుఁగు - ప్రాకృత భాషలు

దేవభాష యని పేరొందిన సంస్కృతమునకు దేశ్యభాషగా ఎన్నఁడు వ్యవహారము లేదుగాని, ప్రపంచమందంతటను దాని చాయలు జాడలు దేశ్యభాషలలో చొచ్చి యున్నవనుట నిగ్గుతేలిన మాట. ఆ చాయలు హెచ్చుగా పుచ్చుకొని 'ధన్యా పితృముఖీ కన్యా' అన్నట్లు మిన్నగా రాణ కెక్కిన దేశ్యభాషలలో తెలుఁగు 'లెస్స' యనుటలో విప్రతిపత్తి లేదు. ఒక విధముగా కొన్నింట 'స్వాత్వము' పోయిన తెలుఁగునకు సంస్కృతమువలననే 'అస్వతంత్రత' ఏర్పడ్డదను భావమును సమూలముగఁ గాదనలేము.

కాని, ఒక దృష్టిలో ఇన్ని వన్నెచిన్నెలు తెలుఁగులో వచ్చుటకు సంస్కృతమే మూల మనుటలో ఆధారము లనేకము లున్నవి. కావుననే నేఁడు యావద్భారతములో తెలుఁగున కున్న సంస్కృతభాషాసాన్నిధ్యము మఱి ఏ దేశ్యభాషకును గానరాదు. తెలుఁగును జక్కఁగా నేర్వవలెనన్న సంస్కృతభాష చవి చూచితీఱవలెనన్నంతగా-ఆ సాన్నిధ్యము పెరిఁగిపోయినది. ఒక విధముగా 'తత్సమాకారమున' తెలుఁగు ప్రబంధములలోఁ గానవచ్చు సంస్కృతభాషాప్రౌఢి, తద్వైచిత్రి సంస్కృతకావ్యములలోఁగూడ గానరాదనుట అతిశయోక్తి కాదు. కాని, ఈ తెలుఁగునకు ఈ తీరుగ ఒక్క సంస్కృతమే దగ్గఱి చుట్టము కాదు; ప్రాకృత భాషలుకూడ

మనకు దగ్గఱ వన్నమాట మన వ్యవహారములో నేఁడు కొంత మఱుచితిమి.

నాకుఁజూడఁగా— తెలుఁగుభాషను సుష్ఠుగాఁ జదువ వలెనన్న—దాని పుట్టుపూర్వములు సమూలముగ గుర్తింప వలెనన్న తెలుఁగు పాఠ్యభాగములో విధిగా 'ప్రాకృత భాషలు' కూడ ఉండితీరవలెనని తోఁచుచున్నది. ఎన్నో తెలుఁగుపదములు వ్యవహారములో రూఢములై 'గ్రాంథిక ముద్ర' పడనివి ప్రాకృతభాషలలో సాధుపులుగా గ్రంథముల కెక్కినవి. ఆ రహస్యము గుర్తింపకయే 'సప్పంబు పడగనీడను గప్ప వసించు' అన్న ప్రయోగమును అచ్చులోఁ గొందఱు 'సర్పంబు పడగనీడను' అని దిద్దివైచిరి. జానపదులలో బాహాటముగా పిలువఁబడుచున్న 'రుప్పిణమ్మ' ను 'రుక్మిణమ్మ' అనియే పిలువవలెనని 'నాగరకమ్మన్యులు' భావింతురు. 'మధ్యాహ్నము' నకు తెలుఁగువారి ఉచ్చారణములో నున్న 'మజ్ఝానము' 'ప్రాకృత' రీతిగా సాధువే. ప్రాకృతభాషాసంబంధము తెలుఁగుపాఠ్యములో విధిగా నున్నచో విశేషము లనేకములు వెలువడవచ్చును.

సంస్కృతభాషలో 'మధ్యాహ్నము – వహ్న – ప్రహ్లాదుఁడు' అని వ్రాసి 'మధ్యాహ్నము – వన్హా – ప్రహ్లాదుఁడు' అని యుచ్చరింపవలెనని శిష్టవ్యవహార మున్నది. ఉచ్చారణ సౌకుమార్యమును అపేక్షించి ఆ సంప్రదాయము వచ్చియుండ వచ్చును. కాని వ్రాఁత యొకటి కూఁత యొకటి ఎందుల కన్నట్లు ప్రాకృతవ్యాకరణము ఆ సంప్రదాయమును మార్చి 'మధ్యాహ్నము-వన్హా' ఇత్యాది పదములను సాధువులుగా

గ్రహించినది. అది మనకుఁగూడ గ్రాహ్యమైనను మనవ్యాకరణములు గ్రహింపలేదు.

ప్రాకృతాది వ్యావహారిక భాషలలోని శబ్దములు కొన్ని సంస్కృతములో చేరినవి. ప్రాకృతములోని 'కల్హార' రూపమే ఔత్తరాహుల సంస్కృతగ్రంథములలోఁ గాన వచ్చును. ప్రాకృతమైన 'పట్టణ' శబ్దము సంస్కృతములో బాహాటముగాఁ జేరినది.

నేఁడు విద్యాశాలలలో 'ప్రకృతి-వికృతులన్న' పేరుతో కొన్ని శబ్దములను విద్యార్థులకు వినిపింతుము. ఆ వికృతిపదములన్నింటికి సంస్కృతపదములే మూలములుగా ఉన్నవి. కావున 'ప్రాకృతసమములు-ప్రాకృతభవములు' అన్న విభాగమును దీసివైచి, అట్టి వన్నియు సంస్కృతభవనులే యనరాదా! యన్నట్లు కొందఱు వ్యాఖ్యానించిరి. కాని ప్రాకృతసమమని ప్రాకృతభవమని విభాగము చేయుటలోనే అర్థమున్నది. సంస్కృతములోని 'ఆకాశ' అన్నపదము ప్రాకృతములో 'ఆఆస' గా మాఱును. సంస్కృతములోని 'కుడ్య' శబ్దము ప్రాకృతములో 'కుడ్డ' యగును. 'నారాచ' మన్న సంస్కృతపదము, ప్రాకృతములో 'ణారాఅ' అగును. అట్లే, 'మృగీ-' అన్నది 'మియ' అని, 'సూచీ'-'సూఈ' అని 'సముద్రః'-'సముద్ద' అని ప్రాకృతరూపములు కన్పించును. వికృతులుగా వ్యవహరింపఁబడు 'ఆకసము - గోడ - నారసము - మెకము - నూది - సంద్రము' ఇత్యాదులు ప్రాకృతమువలన ఏర్పడినవి కావనియు సంస్కృతమునుండియే పుట్టినవనియుఁ జెప్పవలెను. ఇట్లే, 'అంగారః - ఇంగాలో - ఇంగలము' ఇత్యాదులలోని

'ఇంగలము' వంటి శబ్దములు 'ఇంగాలో' వంటి ప్రాకృతశబ్దములకు సన్నిహితములుగా ఉండుటఁజేసి 'ఇంగలము' వంటి వన్నియు ప్రాకృతభవములనియే వ్యవహరింపవలెను.

'అగ్నిః - అగ్గీ - అగ్గి' ఇందలి 'అగ్గి' ప్రాకృతమైన 'అగ్గీ'కి దగ్గఱగా ఉన్నది కావున 'అగ్గి'ని ప్రాకృతసమమని వ్యవహరించిరి.

కావున, తెలుఁగులో 'సంస్కృతసమము' - ప్రాకృతసమము; సంస్కృతభవము - ప్రాకృతభవము అన్న విభాగము శబ్దశాస్త్రమునుబట్టి ముఖ్యమని చెప్పవచ్చును.

ప్రాకృతము ముందా! సంస్కృతము ముందా! అన్న దొక పెద్ద 'సమస్య'. ప్రకృతియైన సంస్కృతమునుండి వచ్చినదే ప్రాకృతమని యొకవాదము ప్రాకృతమును సంస్కరించి ఒకతీరు తెన్నులో ఉంచినపుడు ఏర్పడ్డదే 'సంస్కృత'మని మఱొక పక్షము. ఏమైనఁగానీ ప్రాకృతభాషలు అనువిధములుగా ప్రాచీనులు తేల్చిరి. మహారాష్ట్ర ప్రాంతములో వ్యవహారమందున్నదానికి 'ప్రాకృత'మని పేరు. శూరసేనదేశములో పుట్టినది శౌరసేని. మగధదేశములో వెలసినది మాగధి. పిశాచదేశములో వ్యాపించినది పైశాచి. పాండ్య - కేకయ - నేపాళ - బాహ్లీక - కుంతల - చోళ ప్రభృతిదేశములకు పిశాచదేశములని వ్యవహారము. ఈప్రాంతములో నున్న భాషకు 'చూళికాపైశాచి' యనియు మఱొక పేరు కలదు. నాజూకు ఎఱుఁగనివారి నోటఁబలుకఁబడునది అపభ్రంశము. ఈ స్వరూపములో నున్న భాషలనుండి ఎన్నో పదములు తెలుఁగునకు వచ్చి ఒక వింత చెలువము కూర్చు

చున్నవి. ఆ రూపురేకలు తెలిసికొనుచు భాషాస్వరూపము గుర్తించుటలో ఆనంద మున్నది.

సంస్కృతభాషలో నాటకాదులలో ఆ యా పాత్రలను బట్టి ప్రాకృతభాషలను వాడుట ప్రసిద్ధమేగాని, నేఁడు మన వారి చదువులలో - ఆ భాగములనుగూడ 'సంస్కృత చ్ఛాయలో' చదువుకొని సరిపెట్టుకొనుచు కాలక్షేపము చేయుట సంప్రదాయమైనది. అందువలన - ప్రత్యేకముగా ప్రాకృతభాషలు అభ్యసించు సంప్రదాయమన్నది లేకపోఁగా నాటకాదులలో వచ్చిన ఈ యవకాశముగూడ ఈ తీరుగ వ్యర్థమగుటఁజేసి తెలుఁగువారికి ప్రాకృతభాషల సంబంధమే దూరమైనది. సంస్కృతమున దశవిధరూపకములలో- పాత్రౌచిత్యమును బరిశీలించి ఆ యా ప్రాకృతభాషలు వాడిరి. స్త్రీలు విదూషకులు మున్నగువారికి ప్రాకృతభాష నుపయోగింతురు. అధమ పాత్రలకు శౌరసేని. అత్యధమ పాత్రలకు మాగధి. రాక్షస పిశాచాదులకు పైశాచి, చూళికా పైశాచియు. చండాల యవనాదులకు అపభ్రంశము. ఈ సంప్రదాయమునుబట్టి యే వ్యావహారికమును గ్రంథములలో బొత్తిగా ఎక్కింపరాదన్న 'గ్రాంథికవాదుల' అగ్రకోటిలో నున్న 'వేదము' వారుకూడ 'ప్రతాపరుద్రీయా'దులలో పాత్రౌచిత్యమునుబట్టి వ్యావహారికభాషను వాడుకొనిరి.

అట్టి యా ప్రాకృతభాషలకు వాల్మీకి వరరుచి మున్నగువారు వ్యాకరణము వ్రాసిపెట్టిరి. అచ్చముగా-ప్రాకృతభాషలో 'సేతుబంధమ'ని ఒక కావ్యమును కాలిదాసు వ్రాసియున్నాఁడు. శాలివాహనుఁడు 'సప్తశతి' యనుపేర

ఈ భాషలోనే గొప్ప గ్రంథమును రచించెను. పైశాచి భాషలో 'బృహత్కథ' యన్నది పేరు పొందిన పెద్ద గ్రంథము. ఈ గ్రంథమును వ్రాసినది 'గుణాఢ్య' పండితుఁడు.

క్రీస్తవశకాబ్దికి మున్నూట ముప్పదియేండ్లకుమున్ను సాతవాహనచక్రవర్తికి 'గుణాఢ్యుఁడు' మంత్రిగా నుండెనఁట. ఆతఁడు కాణభూతి యను పిశాచరాజువలన ఒక కథను విని దానికి 'బృహత్కథ' యని పేరు పెట్టి ప్రాకృతభాషలో దానిని ఏడేండ్లు శ్రమపడి ఏడు లక్షల గ్రంథముగా రచించెను. అడవిలో ఒంటరిగా ఆతఁడు కూరుచుండి తన నెత్తు రోడ్చి, దానితో అన్నేండ్లు ఆ గ్రంథము వ్రాసి ముగించి, దీని నెవ్వారి కంకిత మిత్తునా! ఎట్లు ప్రకటింతునా! అని విచారములో నుండఁగా సాతవాహనుని పేరు జ్ఞప్తికి వచ్చి ఆతని సన్నిధికి ఆ కావ్యమును బంపెను. మహాకవియగు గుణాఢ్యుఁడు వ్రాసి పంపిన ఈ మహాకావ్యమును - ఆ రాజు ఏ ధ్యానములో నుండెనో గాని ఏడు లక్షలగ్రంథమా? భాష నీరసమైన ప్రాకృతమా! నెత్తుటితో వ్రాసిన వ్రాఁతయా? చీ! పాడు కథ! ఎవ్వరికిఁ గావలెనని ఈసడించెను. ఆ వార్త గుణాఢ్య పండితుఁడు విని ఎంతో బాధపడి శిష్యులతోఁబాటు ఒక కొండకొమ్మునఁ గూరుచుండి, అగ్నికుండము చేసికొని ఒక్కొక్క ఆకుగాఁ జదువుచు ఆ గ్రంథమును అగ్నికాహుతి చేసెనఁట. అంతలో సాతవాహనుఁడు అస్వాస్థుఁడై తన అస్వాస్థతకు నీరసమైన మాంసభోజనమే నిదానమని వైద్యుల వలన విని వంటవాండ్రను విచారింప వారును వేఁటకాండ్ర పయి నేరమి యారోపించిరి.

తీర - విచారింపఁగా ఒకానొక బ్రాహ్మణుఁడు అడవిలో కొండమీఁదఁ గూరుచుండి చేతిలోని గ్రంథమును జింపి మంటలో వేయుచుండఁగా అడవిలోని జీవు లన్నియు అక్కడికే చేరిన వనియు నిద్రాహారములు మాని ఆ కథనే వినుచున్నవనియు నకనకలాడు మెకములను గొట్టి తెచ్చితి మనియు వారు మెత్తుకొనిరి. వెంటనే సాతవాహనుఁడు వెళ్ళి కొండమీఁదఁ జూడఁగా గుణాఢ్యుఁడు వానిగ్రంథము వాని విశిష్టత తెలియవచ్చెను. అప్పటికే ఆఱు కథలు అగ్గికి బుగ్గియయ్యెను. ఒక్క కథమాత్రమే మిగిలెను. దానినే రాజు తెచ్చుకొని దేశములో ప్రచారము చేసెను.

ఆ సాతవాహనవంశములోనే ఒక రాణి, నిరంతర శాస్త్రశ్రవణపరిశ్రమచే విసువు కలిగినప్పుడు చదువను గుతూహలపడి ఈ 'బృహత్కథను' బయటికిఁ దీయించెను. దీనినే సోమదేవుఁడను మహాకవి 'కథాసరిత్సాగర' మను పేర సంస్కృతభాషలో మార్చి వ్రాసెను.

ఈ తీరుగ ప్రాకృతభాషలలో ఆ నాఁడు మంచి సాహిత్యమే పుట్టినది. జైనుల వేదములు పురాణములు మున్నగునవి ఎన్నో ప్రాకృతభాషలలో పుట్టినట్టులు చెప్పెదరు. బౌద్ధమతముచే బ్రాహ్మణ మతమునకు ప్రాభవము తగ్గినప్పుడు సంస్కృతభాషాస్థానములో ప్రాకృతభాషలే పరిఢవిల్లినవి. ఇటీవల గాంధీజీ తన యుద్యమమును దేశ్యభాషలద్వారా యావద్భారతమున పెంపొందించినట్టులు పూర్వము బౌద్ధము సైతము ఈ ప్రాకృతభాషల మూలమునసే ప్రచురప్రచారమునకు వచ్చెను.

అనఁగా – తెలుఁగులో తన 'ముద్ర' వైచినది ఒక్క సంస్కృతమే కాదనియు, ప్రాకృతభాషలుకూడ తమ యింపుసొంపులు తెలుఁగునకు సంపాదించి యిచ్చినవనియుఁ జెప్పవచ్చును.

కావున, తెలుఁగుభాషలో పరిజ్ఞానము కోరువారికి సంస్కృతభాషాపరిజ్ఞానముతోపాటు ప్రాకృతభాషాపరిజ్ఞానము సైతము అత్యావశ్యక మనుట పిండితార్థము.

[1958 సెప్టెంబరు]

సాహిత్యతత్త్వము

శ్లో॥ 'వ్యాసతు సతు గౌతమతు వ్యాళేంద్రతు యస్య నాస్తి సాహిత్యం,
తం ప్రతి సంప్రతి కం ప్రతి శిరో మమ తిరశ్చ-న పురశ్చ-న.'

ఎవనికి సాహిత్యవిద్య ఉండదో ఆతఁడు వ్యాసుఁడంత వాఁడు గానీ గౌతమునివలెఁ గన్పింపనీ మహాభాష్యకర్త పతంజలివోలె ప్రవర్తింపనీ ఆతనికి నా శిరస్సు తిరస్కరింపదు; పురస్కరింపదు. అనఁగా ఆతని కీయఁదగ్గ గౌరవ మీయదని సారాంశము. ఇది జగన్నాథపండితుని మాట. సాహిత్యమున కున్న ప్రతిష్ఠ పూర్వుల దృష్టిలో అట్టిదన్నమాట.

కేవల భాషమాత్రమే సాహిత్యము కాదు; పరస్పర భావప్రకటనమునకు పనికివచ్చునది భాష. దాని కెంతో పై యంతస్తు సాహిత్యము. భరతమునీశ్వరుఁడు మొదలు జగన్నాథపండితునివఱకు భారతీయసాహిత్యవేత్త లెంద రెందఱో 'సాహిత్య'మును నిర్వచించి చక్కఁగా శాస్త్రములు ప్రవాసిపెట్టిరి. ఆ పునాదిలోని ఆనుపానులు కొంతవఱ కైన మనము గుర్తింపనినాఁడు సాహిత్యగంధము చూడ నైన మనము పనికిరాము.

సాహిత్యశబ్దమునకు యౌగికముగా మేళనమని అర్థ మున్నది. మేళన మనఁగా-కలసియుండుట.

'శబ్దార్థయోఃయథావత్సహభావేన విద్యా సాహిత్య

విద్యా' — అని. 'కావ్యమీమాంస'లో - రాజశేఖరుఁడు వచించెను. అన్యూనాతిరిక్తముగా శబ్దార్థములను సహభావముతో నడపించునది సాహిత్యవిద్యయని ఆయన భావము. ఈ భావమునే భామహాదులు —

'శబ్దార్థౌ సహితౌ కావ్యమ్' అని అనువదించిరి. ఈ మాటనే ఇంకొక తీరులో 'వ్యక్తివివేక' టీకాకర్త ఇట్లని వ్యాఖ్యానించెను :—

'సాహిత్యం తుల్యకక్ష్యత్వేన అన్యూనాతిరిక్తత్వమ్'

అనఁగా-శబ్దార్థములకు సమానమైన హక్కు ఉండి ఒకటి హెచ్చు మఱొకటి లొచ్చు కాకుండుటయే సాహిత్యమని. ఆధునికులు — ఈ భావమునే ఇంకొక 'నిష్పత్తి'లో నిరూపించిరి :—

'సహితం రససంయుక్తం తదేవ సాహిత్యమ్'

రససంయుక్తమైనదే సాహిత్యమఁట. ఇంకొకరు: —

'హితేన నిరతిశయప్రేమాస్పదేన రసేన సహితం తదేవ సాహిత్యమ్' — అని.

ఆ రసము నిరతిశయప్రేమాస్పదము కావలెనఁట.

'శృంగార ప్రకాశిక'లో భోజదేవుఁ డీ ఘట్టమును ఇట్లని చర్చించెను :—

'కావ్యం తత్పునఃశబ్దార్థౌ సాహిత్య మా మనన్తి. తద్యథా — 'శబ్దార్థౌ' సహితౌ కావ్యమితి. కఃపునఃశబ్దఃయేన ఉచ్చరితేన అర్థఃప్రతీయతే. స చ ద్వాదశథా :— ప్రకృతిఃప్రత్యయ...ఇత్యాది. కోఽర్థఃయఃశబ్దేన ప్రత్యయతే. స చ ద్వాదశథా—క్రియా, కాలఃఇత్యాది.

కిం సాహిత్యమ్? యుః శబ్దార్థయోుః సంబంధుః. స చ ద్వాదశధా—అభిధా, వివక్షా, తాత్పర్యం, ప్రవిభాగుః, వ్యపేక్షా, సామర్థ్యం, అన్వయుః, ఏకార్థీభావుః, దోషహానం, గుణోపాదానం, అలంకారయోుగుః, రసావియోుగుః,—ఇతి' అని. ఈ మాటయే 'ధ్వన్యాలోకము'లో ఒక చోట—

'సహృదయానాం ... శబ్దార్థయోుః సాహిత్యేనైవ కావ్యత్వే' అని చెప్పిరి. ఇంకొక స్థాయిలో మతికొందఱు, 'రమణీయార్థప్రతిపాదకుః శబ్దుః కావ్యమ్' అని సిద్ధాంతీకరించిరి. సాహిత్యమనఁగా కావ్యభాగమని ఈ సిద్ధాంతము లోని పిండితార్థము.

పూర్వగ్రంథములలో 'సాహిత్యవిద్య' అనియు 'సాహిత్యశాస్త్ర' మనియు వ్యవహారము స్థిరమైపోయినది. తక్కిన శాస్త్రములమాట ఎట్లున్నను ఈ సాహిత్యశాస్త్రమును ముఖ్యముగాఁ జదువవలెననియు, ఇది చదువనివారు గౌరవింపఁదగినవారు కారనియు ప్రాచీనులు భావించిరి. ఈ శాస్త్రము వ్యాకరణశాస్త్రమునకు పరిశిష్టమనియు పుచ్ఛమువంటిదనియు—కొందఱి విశ్వాసము. అనఁగా వైయాకరణులయు సాహిత్యవేత్తలయు సిద్ధాంతము లొకే కోవలోఁ జేరునన్నమాట. భాషకు ప్రాణములవంటివి రెండే రెండు. వానిలో ఒకటి బహిుఃప్రాణము; రెండవది అంతుఃప్రాణము. మొదటిది వ్యాకరణశాస్త్రము; రెండవది సాహిత్యశాస్త్రము. మొదటిది శబ్దశుద్ధిని గలిగింపఁగా రెండవది శబ్దార్థరామణీయకమును సంపాదించి యిచ్చును.

సాహిత్యవేత్తలనఁగా ఆలంకారికులనియు సాహిత్య

మనఁగా కావ్యభాగమనియు కావ్యలక్షణములను తెలుపు శాస్త్రమునకు అలంకారశాస్త్రమనియు సాహిత్యశాస్త్ర మనియు వ్యవహారము వచ్చినది. ఇతర వాఙ్మయములలో లేని 'అలంకారప్రాచుర్యము'-'అలంకారవైభనము' సంస్కృత వాఙ్మయములో కావలసినంత పెరిఁగినది. ఆ ధోరణిలో కావ్యమునకు అలంకారములే ప్రధానమని భావించినవారు ఉండుటఁజేసి తమ లక్షణగ్రంథములలో అలంకారాగమును గూర్చియే హెచ్చుగా చర్చించుటఁజేసి, భామహాదులు, 'భామహాలంకారమని-రుద్రటాలంకారమని, కావ్యాలంకార సంగ్రహమని' పేరులుపెట్టి అలంకారశాస్త్రమనియు వ్యవహరించిరి. కాని పూర్వాపరములు పరిశీలించి చూడఁగా అలంకారశాస్త్రమనుటకన్న సాహిత్యశాస్త్రమనుటలోనే అర్థమున్నది. కావునఁనే తరువాతివారు 'సాహిత్యదర్పణము-సాహిత్యచింతామణి - సాహిత్యరత్నాకరము - సాహిత్యసారము-సాహిత్యకల్పలతిక - సాహిత్యకల్పద్రుమము'-ఇత్యాదిగ తమ గ్రంథములను 'సాహిత్యపదాంకితము'గానే రచించిరి.

వ్యవహారము కోసమై సాహిత్యశాస్త్రము-సాహిత్యవిద్యయని పలికినను తక్కినశాస్త్రములకు సాహిత్యమునకుఁ గావలసినంత భేదమున్నది. ఇతరశాస్త్రములలోని కర్కశత్వము సాహిత్యశాస్త్రములో స్ఫురింపదు. కేవలశాస్త్రవేత్త పరమచాందసుఁడుగాఁ గన్పింపవచ్చునుగాని సాహిత్యవేత్త సరసుఁడుగా లౌకికుఁడుగా స్ఫురించును. శాస్త్రములో శాసించు ధర్మము ఉండుటవలన అది మన కొక బెదురు కలి

గింపవచ్చును. సాహిత్యములో కాంతాసమ్మితదృష్టి కన్పట్టుటఁ జేసి ఒకానొక ప్రసన్నత-లాలిత్యము అందు వ్యక్తమగును. శాస్త్రము బుద్ధికి మెఱుఁగు పెట్టఁగా సాహిత్యము హృదయమును సంస్కరించును. సాహిత్యదృష్టిలో రాజకీయములు పనిచేయవు. సాంఘికద్వేషములు స్ఫురింపరాదు. భాగ్య భోగ్యములతో నిమిత్తము లేదు. లింగభేదము లేదు; వయోభేదము లేదు. అందఱు వారివారి జవసత్త్వములనుబట్టి సాహిత్యములో సారస్యమును జక్కఁగా ఆస్వాదింపవచ్చును. అంత మృదువుగా సులువుగా శాస్త్రములోలికిఁ బోలేము.

పల్లెపదాలలో జానపదగీతములలో భక్తుల పాటలలో మహాకవుల కావ్యములలో వారివారి అంతస్తునుబట్టి సారస్యము సంగ్రహింపవచ్చును. సాహిత్య మొకవిధముగా హృదయమున కానంద మిచ్చి మానవుని సభ్యునిగాఁ జేయఁ గలదు. ఆ సభ్యతలోనే మానవత్వ మున్నది. అది లేని మానవుఁడు నిర్గంధకుసుమమువంటివాఁడే యగును.

అపారమైన సంస్కృతసాహిత్య సాగరములో శాస్త్రప్రవంతు లెన్నో చొచ్చి ప్రపంచసాహిత్యవేత్తలకే ఆశ్చర్యము కలిగించినవి. ఆ మహానదులలో ఈ సాహిత్యశాస్త్ర మొకటి. ఈ శాస్త్రములో భారతీయులు చేసిన పరిశ్రమ, ప్రపంచములో ఇతరు లెవ్వరు చేయలేదని అభిజ్ఞు లందురు.

ముఖ్యముగా సాహిత్యములో-వ్యాకరణములో-వేదాంతములో భారతీయుల కృషి 'పరాం కోటి' కెక్కినదని పరదేశీయులే సంభావించిరి. ఈ సాహిత్యశాస్త్రమునకు భరతముని ప్రధానపీఠమన్నమాట నిజమైనను వానికి పూర్వముకూడ ఈ

దేశములో సాహిత్యచర్చ ఉన్నట్లు తారాకాణము లున్నవి. యావదాభారతములో విశిష్య-కాశ్మీర దేశము, ఈ శాస్త్రము నకు మూలస్థానము. అసలు సంస్కృత వాఙ్మయములో కాశ్మీర దేశము చేసిన సేవ అనుపమానము. ఆ దేశములోని 'శారదా పీఠము' ప్రపంచములో పెద్దపేరు గడించినది. అచట పుట్టిన సాహిత్యప్రక్రియలు ఇన్ని-యన్ని కావు. సాహిత్య శాస్త్రఘట్ట ములో కాశ్మీరము తరువాత ఆంధ్రదేశమే మిన్నయని ఎన్నఁ దగును. సంస్కృతసాహిత్యశాస్త్రము రచించినవారిలో ఆంధ్రు లెందఱో ఉన్నారు. మల్లినాథ-జగన్నాథ-విద్యానాథ ప్రభృతు లెందఱో స్వతంత్రసాహిత్య గ్రంథము లెన్నో సృష్టించిరి. ఈ తీరుగ భారతీయులు వ్రాసిన సాహిత్య శాస్త్రగ్రంథములు ఇంచుమించు తొమ్మిదివందలదాఁక ఉన్న వని చరిత్రకారులు వ్రాసిరి. ఈ యంశమునుబట్టి చూడఁగా 'సాహిత్యతత్వము' మనము గుర్తింపవచ్చును.

ప్రపంచములో వేదములే మున్మొదటి సాహిత్య మన వచ్చును. 'వేదపురాణశాస్త్రపదవీనదవీయసియైన పెద్దము త్తైదువ'-అన్న శ్రీనాథుని మాటలో ఈ భావ మున్నది. శబ్ద జ్యోతియే ఆ ముత్తైదువ. ఆమెయే ఆదిమశక్తి. ఆ శక్తియే మనకు పురాణశాస్త్రము శాస్త్రసాహిత్యము కావ్యశాస్త్రము ప్రసాదించినది. శబ్దార్థసహితత్వమే 'సాహిత్య' మన్న నిర్వచ నములో 'హిత' శబ్ద మున్నది. హిత మనఁగా పథ్యము; లేక విధి. దానితోఁ గూడినదే సహితము. దాని ధర్మమే సాహి త్యము. అదే మున్మొదట 'ఓం' కార రూపముగా వెడలి బ్రహ్మానందమై, అవల-బ్రహ్మానంద సబ్రహ్మచారియైన సాహి

త్మానందమును సృష్టించి మన కిచ్చినది. వైదికసాహిత్యములో వస్తువున కున్న విలువతోపాటు సాహిత్యపరమైన విలువ సైతము మిక్కిలిగాఁ గలదు. సూత్రవాఙ్మయములో ఉన్న సాహిత్యమును పరిశీలించి విదేశీయపండితులు నివ్వెరవోయిరి. అల్పాక్షరములలో అనల్పార్థము నిమిడ్చి అంత చక్కని చిక్కని కూర్పులో ఉన్న వైఖరి, ఇతరవాఙ్మయములలో లేకపోవుటయే వారి యాశ్చర్యమునకు కారణము. సంస్కృతములో వైదికభాగమునకు లౌకికభాగమునకు వ్యాకరణ ప్రక్రియ వేఱుగా ఉన్నను రెండింటఁ గల సాహిత్యసౌరభము సమానస్థాయిలోనే సాగియున్నది. భక్తి-జ్ఞాన-వైరాగ్యఘట్టములలో బయలుదేరిన ప్రాచీనసాహిత్యములోని విలువ ఇంతయని చెప్పలేము. కేవలము-ఆధ్యాత్మికముగా వెలయు 'మంత్రపుష్పము'లోఁగానీ, శుష్క-వ్యాకరణముగా స్ఫురించు 'మహాభాష్యము'లోఁగానీ కన్పించు సాహిత్యము శ్రవణపేయమై హృద్యమై యుండుననుట స్తవముకాదు; వాస్తవము.

సాహిత్యశబ్దమును ఆపాతతః వాఙ్మయశబ్దమునకు పర్యాయముగా వాడవచ్చును. కాని వాఙ్మయ మంతయు సాహిత్యము కాదు. రమణీయార్థము నిచ్చు వాఙ్మయమే సాహిత్యము. అట్టి వాఙ్మయమే కవిత్వము. కవిత్వము-సాహిత్యము, సమానార్థకము లనవచ్చును. సాహిత్యములో వ్యాసంగము చేసినవా రెల్లరు కవిత్వములో కృతహస్తులు కాలేకపోవచ్చును. కవిత్వములో సాహిత్యము ఉండవచ్చునుగాని సాహిత్యవిశారదు లెల్లరు కవీశ్వరులు కారని భావము.

కవిత్వమనఁగా శబ్దార్థముల రామణీయకము. వట్టి

శబ్దార్థములే కవిత్వమైనచో 'గణితబోధిని' వంటివికూడ కావ్యములనవలసివచ్చును. అట్టివి వాఙ్మయములోఁ జేర వచ్చునుగాని సాహిత్యములోఁ జేరవు. ఇట్టి సాహిత్యభాగ మునే 'ఉక్తివయప్రపంచ' మని రామరాజభూషణుఁడు పేర్కొనెను. ఇచ్చట-ఉక్తి యనఁగా కేవలశబ్దార్థములే కాదు; చమత్కారముతోఁగూడిన శబ్దార్థములే 'ఉక్తి' యని చెప్పవలెను. అదే కవిత్వఘట్టము; అదే సాహిత్యసంపద.

లౌకికముగా ముమ్మొదట సాహిత్యపరీమళమును ప్రాచీనులు పసిపట్టినది వాల్మీకమునుండియే యని చెప్పవచ్చును. వాల్మీకమనఁగా కవిత్వారంభము. అదే రెండవ ఘట్టములో ఆదిసాహిత్యము. కావునఁనే వాల్మీకి ఆదికవియనియు వాల్మీక మాదికావ్యమనియు వ్యవహారము కలిగినది. మధురాక్షరము లలో మధురాతిమధురమైన కవిత్వమును ముమ్మొదట మనకిచ్చినది వాల్మీకియఁట. ఆయన శోకమే శ్లోకమై సంస్కృత సాహిత్యములో కవిత్వభిక్షను ప్రసాదించినది. ఆ సాహిత్య మునుబట్టియే దానిని సృష్టించిన మహర్షినిబట్టియే-అందలి కథానాయకునిబట్టియే, ఋషి కానివాఁడు కవికాఁడనియు, కావ్యనాయకుఁడు ఉత్తమప్రకృతికలవాఁడై యుండవలెననియు కావ్యము ఉపదేశాత్మకమై ఉండవలెననియు ఒక రాచబాట ఏర్పడినది.

పూర్వుల దృష్టిలో విద్య యనఁగా వేదము; లేదా-వైదికభాగము. రానురాను వైదికవిద్య-లౌకికవిద్య, అని రెండుత్రోవ లేర్పడినవి. మొదటిది ముక్తికి రెండవది భుక్తికి అన్నట్లు సంప్రదాయము పుట్టినది. వైదికమును పీడి లౌకిక

మును జేరుట పతనముక్రింద లెక్క- యున్నట్లు భావించిన రోజులును గలవు. లౌకికము లేని కేవలవైదికము రాణింప దనుట నాగరికపద్ధతి కావచ్చును.

ఆ లౌకికభాగములో కావ్యభాగము ప్రధానము. 'కావ్యాలాపాంశ్చ వర్జయే' త్తని ఒకానొక ఆంక్ష యున్నను- అసత్కావ్యాలకే అది యన్వయింపవలెనని పరిహారము చెప్పిరి. బ్రహ్మాండమైన ఇంతటి వైదికవిద్య ఉండఁగా లౌకిక విద్యతో మన కేమి పని యుండునో చర్చించి చూడవలెను.

మానవునకు కేవలము కూడుగుడ్డలే ప్రధానము కావు. భౌతికముగా అవి ఆతని కక్కఱ కావచ్చును, గాని, మానసికముగా ఆతని కానందము కూర్పఁగలిగిన ప్రక్రియ వేఱు. అదే సాహిత్యము; అదే సారస్వతము; అదే కావ్యము. ఆ గంధమంటని మానవుని వైఖరి నిర్గంధకుసుమమువంటిదే యగును. దానినే 'సంసారవిషవృక్షస్య ద్వే ఫలే చా మృతోపమే కావ్యామృతరసాస్వాదః ఆలాపః సజ్జనైస్సహ.' అని ప్రాచీనులు హెచ్చరించిరి. దానినే ఇంకొక ధోరణిలో 'ఇదమంధంతమః కృత్స్నం జాయేత భువనత్రయం, యది శబ్దాహ్వాయం జ్యోతి రాసంసారం న దీప్యతే' అని బోధించిరి. కావ్యామృతరసాస్వాదమువలన మానవుని సంసారతాపత్రయము మాసిపోవునఁట. శబ్దజ్యోతి లేనినాఁడు సర్వము అంధకారబంధుర మగునఁట. అనగా ఆ కావ్యామృతములోనే ఆ శబ్దజ్యోతిలోనే సాహిత్యతత్త్వము గర్భితమై యున్నదని భావము.

అట్టి సాహిత్యవిద్యకు ఉజ్జీయైనది సంగీతవిద్య. అవి

రెండు ఒకేచోట ఉండుట విశిష్టతలో విశిష్టత. 'సంగీతమపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం, ఏక మాపాతమధుర మన్య దాలోచనామృతమ్'. సారస్వతమునకు మూలపీఠము సరస్వతి. ఆమె అవయవములవంటివే సంగీత-సాహిత్యములఁట. ఒకటి తాత్కాలికమధురము కాఁగా రెండవది-ఆలోచించిన కొలఁది అమృతమయమఁట. ఈ మాటలో పరమార్థమున్నైత మున్నది. ఉభయము ఆరగ్రోలిన త్యాగయ్యకు పరమార్థము దక్కినదనుటలో ఆశ్చర్య మేముండును? సంగీతము లేని సాహిత్యముగానీ సాహిత్యగంధమే లేని సంగీతముగానీ రాణింపవు. కావుననే తెలుఁగులో రామరాజభూషణకవిసార్వ భౌముఁడు సంగీతసాహిత్యరసపోషకుఁడై మిక్కిలియు రాణించెను. సాహిత్యమే లేనిచో త్యాగయ్యకృతులు ఇన్ని యేండ్లుగా ఈ తీరుగా బ్రదికియుండునా?

సాహిత్యత త్వవిచారములో కవిత్వత త్వ వైఖరి రాక మానదు. కవితా సంపద లభించినచో రాజ్య మెందులకోయి యని ప్రాచ్యులే గాదు; పాశ్చాత్యులునైతము నిర్ణయించు కొనిరి. ఎందఱో రాజులు మహారాజులు యుగయుగాలుగా మన కన్నులకుఁ గన్పించుచు కావ్యప్రపంచములో ఉన్నా రనఁగా-అదే కవితామహిమ; అదే సాహిత్య సౌభాగ్యము. ఆ సాహిత్యమే లేనిచో ఆ రాజు లెవరో ఆ రోజు లెట్టివో ఎవ్వరి కెఱుక? ఆ శబ్దార్థముల మనోహరమైన కలయికయే అనుస్యూతముగా అవిచ్ఛిన్నముగా ఇంత బంధము-సంబంధము కలిగించుచున్నది. భౌతికముగా మన మనుభవించునవన్నియు నశ్వరములే. కాని కవిత్వసంపద నశ్వరము కాదు. బ్రహ్మ

సృష్టిలో వంకరటింకరలు కష్టనష్టములు హెచ్చుతగ్గులు ఉండవచ్చునుగాని కవిసృష్టిలో ఇట్టివి కన్పట్టవు. ఈ సృష్టిలో ఉన్న దంతయు రసమయమై యావజ్జీవము మన జీవితముల కానంద మిచ్చును. రసము లేని బ్రదుకు నీరసమైనట్లు కావ్య రసము గ్రహింపలేని బుద్ధి, వట్టి యెండుకట్టె యగు. బ్రహ్మానందసబ్రహ్మచారియైన ఒకానొక దశావిశేషమును అనుభవింపఁ గలిగినవానికి హృదయము రసార్ద్రమై మానసికశక్తి-సంతృప్తి పెంపు కావచ్చును. ఆ శక్తిలోనే నైతిక ఫలము కూడ దక్కవచ్చును. 'అనార్యాశిఖలు పరదారవ్యవహారః' అన్న యుపదేశము మనుస్మృతిలో జమయయి వెగటుకూర్చు వైదికఘట్టముగా పరిణమింపవచ్చును. దానినే 'కీచకవధ'గా మార్చి, సాహిత్యము పోషించి, ఇంత కవితారసము రంగరించి అందించిరేని మనస్సు లగ్నమై హృదయములో హత్తుకొని చిరకాలము మాయని ముద్రగా నెలకొని మానవుని దరింపఁజేయవచ్చును. కావుననే కావ్యములకు కాంతాసమ్మితములని పేరు వెట్టి రసికజనభోగ్యములుగాఁ జేసి వానిని సహృదయులు కీర్తించిరి.

చిత్రము-శిల్పము - నాట్యము - నృత్యము - గేయము, ఇత్యాదులకన్న సాహిత్యములోనే విశిష్టమైన శోభ ఉన్నదన వలెను. అనఁగా రమ్యమైన కావ్యకళ చిత్రాదులకన్న మెఱుఁగని దాని భావము. సంగీత మాపాతమధురమన్నమాట నిజమైనను ఆ కళ, చెవిటివానిని రంజింపఁజేయలేదు. చిత్రము-శిల్పము-నాట్యము హృద్యములే కావచ్చునుగాని అంధునకు అవి అక్కఱకు రావు. వాఁడు మూగయైనను చెవిటియైనను

జనుపాంధుఁడైనను మనోహర కావ్యమును జదివి-చదివించు కొని ఆనందింపఁగలఁడు.

మన మే వృత్తిలో ఉన్నను ఏ దశలో ఉన్నను ఇంత సాహిత్య మబ్బి కవిత్వాతత్త్వము గుర్తింపఁగలిగితిమేని అది యొక మహాభాగ్యముగా భావింపవచ్చును. ఆ త్యాగరాజు ఆ సంగీతసాహిత్యములలో వెలుఁగుగూర్చు బ్రదుకులో బ్రదికి పారమార్థిక సంపదను గడించి పరమధన్యుఁడయ్యెను. ఆ పోతరాజు భౌతికముగా భాగ్యభోగ్యములు లేకున్నను ఆ సాహిత్యపరిధిలో- ఆ కవిత్వప్రాభవములో మునిఁగినవాఁడు కావుననే ఇలువేల్పును సన్నిధిచేసికొని ఆధ్యాత్మికముగా తరించెను. నిన్న మొన్నటి గోపరాజు - ఆ భక్తిరసములో ఆ సాహిత్యమును కవిత్వమును మెదపి రంగరించి అత్యద్భుత ధోరణిలో లోకులకుఁ బంచియిచ్చి సుకృతాత్ముఁడయ్యెను. ఆ తిక్కన సోమయాజి-ఆ సాహిత్యదృష్టితోనే కవితారూపములో సాధించి సాధించి, హరిహరస్వరూపమును ఆకళింతకుఁ దెచ్చుకొనెను.

పూర్వులు చెప్పినవే మనము విన్నవే మాటిమాటికి గ్రంథములలో రావచ్చును. ఆ కూర్పులోని నేర్పువలన ఆ భావములే నిత్యనూత్నముగా చిత్తమునకు హత్తుకొని రాణించుచుండును. కావుననే 'నవ్యం భవతి గ్రథన కౌశలాత్' అని లాక్షణికులు వచించిరి. గ్రథన కౌశలములోని వైవిధ్యమే సాహిత్యసౌందర్యముగా భావింపఁబడుచుండునని దానిభావము.

'శివా శబ్దమయీ ప్రోక్తా శంభు శ్చార్థమయఃి స్మృతఃి

శబ్దజాత మశేషంతు ధత్తే శర్వస్య వల్లభా
అతః శబ్దార్థనిష్పత్తి సిద్ధయే తౌ నతౌ మయా'
అర్ధరూపం య దఖిలం ధత్తే ముగ్ధేందు శేఖరః ।

వాయుపురాణ సంహితలోని ఈ శ్లోకద్వయమునే మన స్సులో భావించుకొని మహాకవి కాలిదాసు మన కిచ్చిన మధురమైన శ్లోక మిదిగో :—

'వాగర్థావివ సంపృక్తౌ వాగర్థప్రతిపత్తయే
జగతః పితరౌ వన్దే పార్వతీపరమేశ్వరౌ.'

గ్రథనకౌశల మనఁగా నిట్టిదే. ఈతఁడే, ఆదికావ్యమైన వాల్మీకములో వాల్మీకినోట వచ్చిన 'రఘువంశ' 'అభిజ్ఞాన' శబ్దములను ఆ ఘట్టములనుబట్టి సంస్మరించి, ఆవల 'రఘువంశ' మహాకావ్యమును—'అభిజ్ఞానశాకుంతలము' ను రచించి మన కిచ్చెను.

కాలమునుబట్టి దేశమునుబట్టి సాహిత్యములో వైవిధ్యము స్ఫురించుచుండును. ఉత్తమసాహిత్యము సార్వకాలికమై సార్వదేశికమై సర్వథా రాణించుచుండును. ఆ సాహిత్యము ఉదాత్తమగుటకు ప్రధానకారణము అందలి యుత్తమ కవితాశిల్పమే. ఆ శిల్పములో కేవలము శబ్దార్థములే కాదు; వస్తువు – భావములు – పాత్రచిత్రణాదికములుగూడ ప్రధానముగా నుండవలెను. ఆ యంశములలో ఒక్కొక్క మహాకవికి ఒక్కొక్క దానియందు ఆభిముఖ్యము అభినివేశము సహజమై పరిఢవించును.

శబ్దార్థములలో కావలసిన శిల్పము రావలసిన రామణీయకము అత్యద్భుతముగా వెలయింపఁజేయుటచేతనే రామ

రాజభూషణుని వసుచరిత్రలో సాహిత్యము 'పరాం కోటి' కెక్కినది. వస్తువును జక్కఁగా చిత్రించుటలో పింగళి సూరన్నను మించినవా రెందఱో లేరు. భక్తిశృంగారములను ఓతప్రోతములుగాఁ జేసికొని పవిత్రభావములను ప్రోదిచేయుటలో బమ్మెరపోతరాజు ప్రాగ్రసరుఁడనుట అత్యుక్తి కాదు. పాత్రచిత్రణములో తిక్కన్నను మించినవారు సంస్కృతాంధ్రములలో ఎవ్వరున్నారు? ఆయన 'హస్తివాసి'లో ఆ కీచకుఁడు – ఆ ద్రౌపది – రాజకీయనాయకుఁడైన ఆ కృష్ణుఁడు ప్రత్యేకవ్యక్తులుగా భాసించిరి. కవితాశిల్పములో రసము చిప్పిలునప్పుడే అయ్యది మంచి సాహిత్యముగా మన్నన కెక్కును. ఈ దృష్టితో పరిశీలించితిమేని ప్రాచీనాంధ్రవాఙ్మయములో హెచ్చుపాలు మంచి సాహిత్యమే మనకు లభించినదని వచింపవచ్చును.

లోకములో ప్రాఁతకూఁతలు గల ప్రతిభాషకు సాహిత్యము కొంత ఉండితీరును. కరచరణాదులలో మానవులందఱు సమానులే యయినను మొత్తముగా మానవసముదాయము వ్యవహారములో 'జాతులు'గా విభక్తమైయున్నది. మతమునుబట్టి సంప్రదాయమునుబట్టి దేశమునుబట్టి జాతులనేకములు పుట్టినవి. ఆయా జాతికిఁ జెందిన ఒకానొక దశయే 'జాతీయత' యని వ్యవహారములో వచ్చినది. ఈ 'జాతీయత'కు నిర్వచనము లనేకములు నేఁడు కన్పించుచున్నవి. రాజకీయముగా నేఁడు దీనికి మంచి ప్రాభవమున్నది. ఒకవిధముగా 'జాతీయత' సంకుచితార్థమిచ్చునని తలఁచి, 'అంతర్జాతీయతను' మెచ్చువారు ఉన్నారు. ఆయా జాతు

లలో ఉండెడి ఆచారవ్యవహారములు అలంకారములు కట్టు బొట్టు లన్నియు జాతీయతలో ప్రతిబింబించును. ఆ జాతీయతకు సాహిత్యమునకు చుట్టుఱికము చాలఁగా ఉండక తప్పదు. ఆ యా జాతుల కున్న సంస్కృతినిబట్టియే సాహిత్య స్రవంతి సాగుచుండును. ఉత్తమసంప్రదాయములు లేని జాతికి ఉత్తమ సాహిత్యము దక్కదు. ధర్మార్థకామమోక్షములలో అను స్యూతముగాఁ బెనవేసికొన్న ఒకానొక బంధమును అవిచ్ఛిన్న ముగ ప్రోదిచేసి యుగయుగాలుగా భారతీయులను నడపించు చున్న సాహిత్యము 'సంస్కృతసాహిత్య' మని చెప్పకతప్పదు. ఆ యా భాషలనుబట్టి ఈ దేశములోనున్న ఇతరసాహిత్యము లన్నియు ఆ సంస్కృతసాహితికి పుత్రికలే యనవలెను. అనేకత్వములో ఏకత్వ మున్నదన్న మాటకు ఇంతకన్న మిన్న యైన తార్కాణము లేదు.

ఆధ్యాత్మికచింత అలవడవలెనన్న-ఆస్తిక్యబుద్ధి ఏర్పడ వలెనన్న-పారమార్థికదృష్టితో బ్రదుకవలెనన్న ఈ భారత భూమిలోని సర్వజాతులను బంధించి బోధించునది సంస్కృత సాహిత్యమేగదా! ఆ సాహిత్యమునకు వేదములు మూలము కాఁగా, శాస్త్రములు పురాణములు కావ్యములు సర్వాంగ ములుగా వెలసి బలిసినవి. వానిలో రామాయణ-భారత-భాగవతములు సాహిత్యపరముగాఁగూడ భారతీయుల కారాధ నీయములైనవి. ఆ సాహిత్య ప్రపంచములో కాలిదాస మహాకవి ఒక పీఠాధిపతి. ఆతనికి కుడియెడమలలోఁ గూరు చుండఁదగ్గవారు భాస-భవభూతి ప్రభృతి మహాకవులు. వారి దృశ్యకావ్యములు శ్రవ్యకావ్యములు గద్యములు, చంపువులు

ఈ దేశమునకే కాదు; ప్రపంచమునకే ఇచ్చిన సాహిత్య సంపద ఇంతయని చెప్పఁదరము గాదు. అభిజ్ఞానశాకుంతలము లోని వర్ణనాఘట్టములను గొన్ని చదివి విదేశీయులు గంతులు వైచి ముచ్చటపడిరనఁగా-ఆ సాహిత్యసంపద అట్టిదని భావింప వలెను. పంచతంత్రములోని పశుపక్ష్యాదులు మాటలు నేర్చి రాజకీయములు బోధించెననఁగా-ఆ సాహిత్యమువిలువ అట్టి దనవలెను. రసస్ఫోరకములై సద్యస్స్ఫూర్తికి తావలములై ప్రపంచజ్ఞానమునకు భాండారములైన చాటువులు లక్షల కొలఁది ఉద్భవించి సహృదయుల కానందము గూర్చుచున్న వనఁగా సంస్కృత సాహిత్య ప్రభావము అట్టిదని గుర్తింప వలెను. 'నాటకాన్తం హి సాహిత్య' మన్న సూక్తి, సంస్కృతవాఙ్మయములో నాటకమున కున్న ప్రాముఖ్యమును జెప్పుచున్నది. అనఁగా నాటకములదాఁక సంస్కృతము చదు వనివానికి సాహిత్య మంటదనియు, ఆ వాఙ్మయములో నాట కము వ్రాసి మెప్పించినవాఁడే మహాకవియనియు దాని భావము.

ఆ-ఉగ్గుతో పెరిఁగి ఆ రసముతో బలిసి శాఖోపశాఖ లుగా ప్రవర్ధమానమైన తెలుఁగుసాహిత్యమునుగూర్చియు నిచ్చట గొంత ముచ్చటింపవలసియున్నది.

హాలుఁడు వ్రాసిన ప్రాకృతగాథానిబద్ధమైన గాథాసప్త శతియే ఆంధ్రుల ప్రథమసాహిత్యమని చెప్పవచ్చును. నాఁటి తెలుఁగుగడ్డలోని జానపదుల ప్రణయఘట్టము లిట్టివట్టివని ఆ గాథలవలన మనకు అనేకాంశములు తెలియుచున్నవి. పామరుల జీవితమాధుర్యమును హాలదేవుఁ డా గాథలలో

అందింపఁగా-ఆభిజాత్యము గల సాహిత్యవిశారదులుసైతము చవులు వుట్టునట్టు నోరూరునట్టు చదువుకొనిరి. ఆలంకారికులకే ఆ గాథలు లక్ష్యము లయ్యెననఁగా దాని భావమేమి? అనంత కవు లెందఱికో ఆ భావములే ఆ ప్రణయరీతులే కవితాగ్రాసముగా ఉండవలెనని తీర్పు చెప్పినట్టుగాదా?

ఆంధ్రుల ప్రథమసాహిత్యము గాథాసప్తశతి కాఁగా తెలుఁగువారి కవితాప్రస్థానము తెలుఁగుభారతముతో ప్రారంభమైనదని చెప్పవచ్చును. చారిత్రికముగా 'ఆంధ్రులు-తెలుఁగులు' వేఱైనను కాలక్రమమున ఆ భేదము మాయమై శాబ్దికముగా ఉభయులు ఒక్కరే అన్న ప్రసిద్ధిని బడసిరి. ఆర్యద్రావిడసామరస్యము ఆంధ్రులలో వెలసి భాషలో ధర్మములో సభ్యతలో పడుగుపేకలుగాఁ గలసిపోయెను. తెలుఁగును ముమ్మొదటగా ఏడవశతాబ్దిలో చాళుక్యులే రాజభాషగా స్వీకరించిరి. అందనుక తెలుఁగుభాష ప్రాకృత బహుళమై కాలక్రమముగ పరిణామమంది స్వతంత్రమై పద్యరూప మంది శాసనముల కెక్కినది. ఆ కాలములో దేశీయచ్ఛందస్సులో పదకవిత్వముగా సాహిత్యము పుట్టియున్నను ప్రౌఢదశకు రాకపోవుటచే తెలుఁగు భారతము ముందు అయ్యది బ్రదుకలేకపోయియుండునని విమర్శకు లూహించిరి. ఏది యేమైనను ప్రాజ్ఞన్నయయుగమందలి ఆంధ్రసాహిత్యపైఖరి నేఁడు మన కంటికిఁ గానరానిదశలో అంతరించినదని చెప్పవచ్చును.

కాఁగా చాళుక్యరాజుల తపస్సిద్ధివలన వేయి యేండ్లకు మున్ను నన్నయ్య తెలుఁగుభారతమును వ్రాసి తెలుఁగు

సాహిత్యసౌధమునకు మూలస్తంభముగా నిలిచెను. ఆయన అక్షరరమ్యతను అభిమానించి ఆయనచేసిన అనువాదధోరణిని అవలంబముగాఁ జేసికొని తెలుఁగులో విలువయైన కావ్యము లెంద ఱెందఱో సంతరించిరి. ఆంధ్రుల సాహిత్యములో సంస్కృతసాహిత్యముద్ర బాధముగా హత్తుకొన్నదనుటకు సాహిత్యాంగము లన్నింటను చాలినంత సాక్ష్య మున్నది. అది అట్లయ్యె, నన్నయ్య చేసినది అనువాదమయ్యె-ఆయన చేతి చలువచే తెలుఁగు సాహిత్యమున కొక దీప్తి ఏర్పడినది. 'తింటే గారెలే తినవలె; వింటే భారతమే వినవలె' నన్న ఆమెతవంటి తెలుఁగుసామెత వ్యాసుని రచనవలన పుట్టియుండ లేదు; ఆ సామెతకు మూలము మునిత్రయమువంటి కవి త్రయమువారి కవితావైభవమే యని గట్టిగఁ జెప్పవచ్చును.

వైదికపరిజ్ఞాన సంపన్నమైన ధోరణిలో మార్గకవితలో నన్నయ్య ఆంధ్రసాహిత్యమును సృష్టింపఁగా విజ్ఞానపూర్వకమైన లోకానుభవమును ఆధ్యాత్మికసాధనతో మిశ్రముచేసి అపూర్వమైన శిల్పచాతుర్యము వెలయించి భాషలో భావములో సంభాషణములో వర్ణనావైఖరిలో తెలుఁగు జాతీయత ఇంత ప్రోదిచేసి సాహిత్యసంపద సమకూర్చినవాఁడు తిక్కనమంత్రి. దక్షిణాపథములోని రాజకీయచరిత్రను ధార్మిక ప్రవృత్తిని మనసులో భావించి విద్యారణ్యస్వామివోలె దేశము నుద్ధరించిన జాతీయకవి తిక్కన సోమయాజి.

లోకములో నిత్యనైమిత్తికములైన ఘట్టములనే తీసికొని విశ్వశ్రేయస్సు మనస్సులో భావించి జగత్తును తమస్సునుండి జ్యోతిర్లోకమునకు నడపించుట కవీశ్వరుల ధర్మము.

అట్టి కవితాశక్తి గల సాహిత్యము సమాజమును సంస్కరించి తీరును. కావుననే కవి, ఒక దృష్టిలో ద్రష్టగా ప్రవక్తగా ఋషిగాఁ గన్పించును. కవికి సమాజమునకు-అవినాభావ సంబంధ ముండుననుట ముమ్మాటికి నిక్కము. నాఁటి దేశ్య పరిస్థితులనుబట్టి రాజరాజనరేంద్రుఁడు ప్రోత్సహింపగా నన్నయ్య తన సాహిత్యములో వైదికధర్మనిష్ఠ నెలకొల్పెను. జైనబౌద్ధాదికములగు అవైదికమార్గములనుండి ఆంధ్ర దేశమును మఱల్పవలెనన్న గాఢదీక్షయే నన్నయ్య సాహిత్యములోఁ గన్పించును. పాల్కురికిప్రభృతుల కావ్యములలో శైవమతప్రాబల్యము స్పష్టముగాఁ గన్పట్టును. పదుమూఁడవ శతాబ్దిలోని పరిస్థితులను ఆకళింతకుఁ దెచ్చుకొని తిక్కనమహా మంత్రి హరిహరస్వరూపమున కభేద మేర్పఱిచి వైదికములో జాతీయతను రంగరించి యిచ్చెను. ఆవల శ్రీనాథకవిసార్వ భౌముఁడు దేశ మెల్లెడలను సంచారము చేసి దివ్యక్షేత్రములను సేవించి చారిత్రికాంశములను సాహిత్యములోఁ జొనిపి సాంఘికవిశేషములను జక్కఁగా నిరూపించెను. అఖండ పాండితీమండితుఁడయ్యు పామరజనమున కందుపాటులో నున్న సాహిత్యములో సుద్దులను వ్రాసి వారిచే పాటలు పాడించిన శుద్ధదేశీయకవి – శ్రీనాథమహాకవి. ఆయన దేశభక్తి – పాండితీ ప్రకర్ష –సౌందర్యదిదృక్ష – పరిహాసప్రావీణ్యము-కవితా ప్రౌఢి, అడుగడుగున ఆయన సాహిత్యములో అభివ్యక్త మగుచుండును.

ఇక-ప్రబంధయుగమన్నది సాహిత్యప్రపంచములో ఆణిముత్తెమువంటిది. సాహితీసమరాంగణ సార్వభౌముఁడైన

శ్రీకృష్ణదేవరాయల సరస్వతీసేవాసక్తిచేతనే రాజులకన్న-కవిరాజులు మిన్నయన్న మాట సార్థకమైనది. ఆయన కొలువులో సామంతరాజులకన్న కవిరాజులకే పెద్దగద్దె లిచ్చి అగ్రపూజలు చేసిరి. ఎన్నడో భోజమహారాజు కథలు విన్న ఈదేశములో అభినవభోజరాజు పుట్టి ఆస్థానసాహితీగోష్ఠులు జరిపి అష్టదిగ్గజములవంటి మహాకవులతో 'భువనవిజయము'ను నెలకొల్పెను. సాహిత్యముగా ఈ యుగము స్వర్ణయుగమని ఎందఱో అభినందించిరి.

రాయలవారి సాహిత్యకీర్తికి, ఆయన వ్రాసిన 'ఆముక్తమే' కాక-అష్టదిగ్గజకవుల రచన లన్నియు ధ్వజప్రాయము లనవచ్చును. ఆ నాఁటి యాచార వ్యవహారములు-పేదసాదుల సాంసారికస్థితిగతులు-భాగ్యవంతుల భోగభాగ్యములు-నాగరకతావైఖరులు అద్దములోఁ జూపినట్లు 'ఆముక్తము'లోఁ గన్పట్టును. రాయలసీమలో ఆ నాఁటి పొలాలు-అందును మెట్ట మాగాణులు-తోఁటలు దొడ్లు-గొడ్డుగోదలు-కాపులు-వారి సేద్యము సర్వము రాయలవారు వర్ణించి, తన యేలుబడిలోని ప్రజల జీవితమును సాహిత్యరూపములో మనకుఁ జూపించిరి.

'దేశభాషలందుఁ దెలుఁగు లెస్స' అన్న సిద్ధాంతము ఈ రాయలయుగమందే స్థిరమైనది. ఈతని సామ్రాజ్యవైభవమునకు ఈడుజోడుగా సాహిత్యవైభవముకూడ సాగినదను టకు ప్రబంధయుగమే సాక్షి. ఆంధ్రులు ఆచంద్రార్కము తమ ప్రత్యేకకావ్యప్రక్రియగా ఎన్నుకొని మురిసిపోవఁదగిన సాహిత్యభండారమే ఈ ప్రబంధమండలి సర్వతోముఖముగ

ఇంతటి వైభవముతో రాణించిన ఈ కావ్యప్రక్రియ, ఇతర వాఙ్మయములలో ఎచ్చటను లేదని ప్రాజ్ఞులు నిర్ణయించిరి. ఈ స్వర్ణయుగమండే ఎంద ఱెందఱో రాజకవులు కవిరాజులు సంస్కృత కావ్యములను వైతము సంతరించి యావదాభరత ములో ఆంధ్రుల సాహిత్యదీక్షను వేనోళ్ళ వెల్లడించిరి.

రాయలయుగమునకుఁ బిదప దక్షిణాంధ్రయుగములో రఘునాథరాయలు చేసినంత సాహిత్యసేవ మఱెవ్వరు చేయ లేదు. ఈ రాయలవార లిర్వురు మహావీరులు ; మహాకవులు. ప్రజారంజకులు; పండితపోషకులు. ఈ యిర్వురు లక్ష్మీసరస్వ తులకు తియ్యని నెయ్యము నేర్పిన సహృదయులు. వీరి యుగ ములోనే మనుచరిత్రవంటి మహాప్రబంధములు విజయవిలా సమువంటి మనోహరకావ్యములు ఎన్నో వెలసి వన్నె కెక్కి తెలుఁగు సాహిత్యమును పోషించినవి. ఆంధ్రసాహిత్యములో ప్రత్యేకాంగములైన యక్షగానములకు గేయకవిత్వమునకు కేంద్రమై వెలసినది రఘునాథరాయల యుగమనియే చెప్ప వచ్చును. కవులతోపాటు కవయిత్రులుకూడ ఆస్థానగోష్ఠు లలో పాల్గొని సంస్కృతాంధ్ర సాహిత్యములో వన్నెచిన్నెలు చూపినదియు ఈ యుగమే యని చెప్పవలెను.

చాళుక్యులతో స్థిరమైన సాహిత్యసంపద సంపాదించిన ఆంధ్రి, కాకతీయయుగములో పెరిఁగి పెద్దదై విద్యానగర సామ్రాజ్యములో స్వైరవిహార మొనర్చి దక్షిణాంధ్రయుగ ములో వన్నెచిన్నెలు కూర్చుకొని చోళపాండ్యరాజ్యముల పతనముతోపాటు బక్కచిక్కిపోయెను.

ఇన్ని దశలు చూచిన ఈ సాహిత్యము ఆధునికయుగ

ములో ఎట్లు పర్వాలు త్రోలెనో రవ్వంత పరిశీలింతము.

తెలుఁగు సాహిత్యమునకు తెలుఁగు ప్రజలకు సంస్కృత వాఙ్మయము చేసిన సహకారము ఇంతయంతకాదని కొందఱు శ్లాఘింతురు. తెలుఁగులో లేని అక్షరాలతోనే 'ఆంధ్ర' మన్న మఱొకపేరు పుట్టినది. అక్షరాభ్యాసము-ఆరంభించు నాఁడే 'ఓం నమశ్శివాయ' అని దిద్దిపెట్టెదరు. తెలుఁగు చదువునకు మున్నుందుగా మనము నేర్పవలసినది సంస్కృత వర్ణసమామ్నాయము. ఆవల 'బాలరామాయణ' మో 'శబ్ద మంజరి' యో కొన్నాళ్ళు నడచినవి. ఉన్నంతలో మన మొదటి తెలుఁగు మహాకావ్యము సంస్కృతభారతమునకు అనువాదము. ఆవల, వచ్చిన మహాకావ్యము లన్నింటికి సంస్కృతకావ్యములే మాతృకలు. కావ్యవిభాగము-రసచర్చ-అలంకారప్రకరణము - వ్యాకరణము - ఛందశ్శాస్త్రము ఇత్యాదు లన్నింట తెలుఁగునకు సంస్కృతము పెట్టిన భిక్ష యే భిక్ష. ఈ తెలుఁగు సాహిత్య మంతయు తత్సమరూపములో బలుపు కలిగి, సంగీతములో మార్దవములో హృద్యమైన భాష యన్నంత ప్రాభవము గడించినది. సంస్కృత సంప్రదాయము తెలియని తెలుఁగువాఁడు పండితుఁడే కాదన్నంత వైఖరిలో సంస్కృతము తెలుఁగును ఆక్రమించినది. ఈ ప్రాభవమే— ఈ యాక్రమణమే తెలుఁగునకు పుష్టినిగాక నష్టినే తెచ్చి పెట్టినదన్న వాదము కొంత లేకపోలేదు.

తుదకు 'ఉత్తర దక్షిణ' దిక్కులను తెలుఁగులో ఏమందుమో మనము మఱచిపోయితిమి. 'ఛందస్సు' నకు అచ్చ తెలుఁగులో పర్యాయపదమేదో తెలియదు. ఆ కథ

అట్లుండఁగా—ఇటీవల రెండుమూఁడువందల యేండ్లుగా ఆంగ్లేయుల పరిపాలనలో మనము ఉండవలసి వచ్చుటచే తెలుఁగు మీఁద మఱొక దండయాత్ర సాగినదనవచ్చును. తెలుఁగు భాషను సంస్కృత పండితుఁడు ఈసడించిన రోజులు పోయి సంస్కృతాంధ్ర భాషలను ఆంగ్లభాషాపండితుఁడు ఏవగించుకొను రోజులు వచ్చినవి. తెలుఁగుమీఁద సంస్కృతము పెత్తనము చేయు దుర్దశ మాఱి ఆంగ్లమే ఇతరదేశ్యభాషలతోపాటు తెలుఁగును అణఁచిపెట్టిన దశయు వచ్చినది. కాని, ఆంగ్లేయుల పరిపాలనమువలన ఈ దేశమునకు వచ్చిన నష్టములతోపాటు లాభములుగూడ రాజకీయముగా-సాహిత్యముగా లేకపోలేదు.

ఆంగ్లసాహిత్యమును జక్కఁగాఁ జదివిన ఆంధ్రులెందఱో తెలుఁగునకు వెలుఁగులు కూర్చిరి. నన్నయ్య పద్యరచనలో దారి చూపఁగా చిన్నయ్య గద్యరచనలో మార్గమేర్పఱిచెను.

ఆ యిర్వురి రచనలలోని సొబగును జక్కఁగా నేర్చి ఆంగ్లములోని ప్రక్రియ లెన్నో తెలుఁగునకుఁ దెచ్చి దీప్తి గలిగించిన మహామహు లనేకులు గలరు. ప్రాచీనాంధ్రసాహిత్యమునకు భరతవాక్యము చెప్పిన నవీనాంగపరిపాలనాయుగములో ముఖ్యమైన ప్రక్రియలు మూఁడు త్రోవలలో సాగినవి. ఒకటి గద్యరచన. రెండు రూపకసృష్టి. మూఁడు ఖండకావ్యసరణి. వచనరచనలో చిన్నయసూరి తరువాత వీరేశలింగముపంతులు చేసిన సాహిత్యసేవ చెప్పఁదరముగాదు. నన్నయయుగము – ప్రబంధయుగము – దక్షిణాంధ్రయుగము,

అన్న ధోరణిలో వీరేశలింగయుగముకూడ వ్యవహారమునకు వచ్చినదనఁగా ఆయన ప్రతిభ ఊహింపవలెను. అందనుక లేని నవలలు – విమర్శములు – జీవితచరిత్రలు–దేశచరిత్రలు–వ్యాసములు – ప్రహసనములు, ఎన్నెన్నో శాఖోపశాఖలుగ పుంఖానుపుంఖముగ 'కందుకూరి' మనకు సృష్టించి యిచ్చెను. ఆయన సంస్కృతనాటకములు అనువదించుటయేగాక స్వతంత్ర నాటకములుసయితము రచించెను. ఆధునికయుగములో వీరేశలింగముపంతులు ప్రసాదించిన సాహిత్యములో ముక్కాలు ముప్వీసము సమాజమున కక్కఱకు వచ్చినది. ఆయన ఏది వ్రాసినను ఏది చేసినను సమాజమును మనస్సులో భావన చేసియే పాటుపడెను. ఆయన వ్రాసిన దంతయు సాహిత్యము కాకపోయినను సాహిత్యము చేయఁగల ఉపకారము ఆయన రచనలలో స్పష్టముగ వ్యక్తమగుచుండును.

'మను–వసువుల'లోని పద్యములు ఒకే బిగువుగాఁ జదువను ఓపికయు తీరికయు లేని ఈ రోజులలో చదివి జీర్ణించుకోలేని ఘట్టములో మన జవసత్త్వములకు అనువుగా పద్యములు–పాటలు–గేయములు వెలసినవి. ప్రాచీనసాహిత్యములోని ఇతివృత్తమునకు నవ్యసాహిత్యములోని వస్తువునకు కొండంత భేద మేర్పడినది. రాజులు మహారాజులు ప్రాచీన సాహిత్యములో కథానాయకులు కాఁగా ప్రజాసామాన్యమే నవ్యసాహిత్యములో ప్రధానపాత్రలై ప్రజలలో అభిరుచి కలిగించిరి. ప్రపంచసభ్యత పెరిఁగి శాస్త్రైవైవిధ్యము తత్ప్రాభవము నవనవోన్మేషముగ సాగుచున్న ఈ రోజులలో వెనుకటి సాహిత్యముతో కాలక్షేపము చేయుటకు తగిన ఓపికయు

తీరికయు లేకపోవుటచే నవీన సాహిత్యప్రక్రియలకే అత్యంత ప్రాముఖ్యము వచ్చినది. కాని పూర్వసాహిత్యమును విడిచి అచ్చముగా ఈ సాహిత్యమునే ఆలంబముగాఁ జేసికొన్న నాఁడు తెలుఁగుసాహిత్యము మెఱుఁగులు విలువలు నిలువ లేవు. ఆ సాహిత్యము కొంతయైన రుచి చూచి నవ్య మాదరించిననాఁడే తెలుఁగు వెలుఁగులు కంటికింపుగాఁ గానవచ్చును.

కాలక్రమముగ కావ్యకర్తలలోఁగాని పాఠకలోకములోఁగాని వెనుకటి అష్టాదశవర్ణనములు నాయికానాయిక సంబంధములు బంధకవిత్వములు అరుచి కలిగించినమాట అసత్యము కాదు. ఈ సందడిలో గ్రాంథికవ్యావహారికముల దందడియు సాగి, నవ్యసాహిత్యము నానావిధముల విజృంభించినది. ప్రాచీనసాహిత్యరక్షణార్థమై మహాసంస్థలు కొన్ని పాటుపడుచుండఁగా నవ్యసాహిత్యపోషణార్థమై మఱికొన్ని నవ్యసంస్థలు పనిచేయుచున్నవి. ఉభయుల సిద్ధాంతములను సమన్వయించి ఉపయోగించుకొన్నచో కావలసిన మేలు కలిగితీరును. కావ్యభాషగా గ్రాంథికమునకు స్థానమిచ్చి విషయప్రధానమైన వస్తువిజ్ఞానమునకు వ్యావహారికము ఉపయోగింతుమేని భాషకు సాహిత్యమునకు మనకును శ్రేయము కలుగుననియే చెప్పవచ్చును. కృత్రిమవేషమని గ్రాంథికమును నిందించిన నోటితోనే కృత్రిమధోరణిలో వ్యావహారికమును సాగించిన రచన లెన్నో నేఁడు కన్పించుచున్నవి. సహజసుందరమైన లాలిత్యముతో శ్రవణానందమును గూర్చి అర్థస్ఫూర్తికి ఆటంకము లేని గ్రాంథికరచనలు లేకపోలేదు.

నన్నయ్య మొదలు వీరేశలింగముపంతులు వఱకుఁ

గల తెలుగు సాహిత్యమును జక్కఁగా ఆదరించి ఆశ్రయించి దాని యండదండలతో నవ్యసాహిత్యమును పెంచుకొంచు తత్ఫలితమును లెస్సగా అనుభవించుచు సాటి దేశ్యభాషలకుఁ దీసిపోవని తీరులో తెలుఁగుసాహిత్యమును నడిపించుకొను టలో న్యాయ మున్నదనియు-ఈ త్రోవలో తెలుఁగు రచయితలు నడచి ఆంధ్రికి విఖ్యాతి గూర్తురనియు ఆశింతును.

[1963—నవంబరు]

కావ్యము - తద్విశిష్టత

'అపారే కావ్యసంసారే కవిరేవ ప్రజాపతిః'—అని పూర్వులు కవీశ్వరునకు ప్రజాపతిత్వమును నిర్ణయించిరి. అసారమని అస్థిరమని భౌతికముగా మనము వర్ణించుకొనుచున్న ఈ ప్రపంచములో చిరస్థాయిగా బ్రదుకఁదగినవానిలో కావ్యమన్నది ఒకటి. మన కంటిజంటకు నేఁడు భౌతికముగా వాల్మీకాదులు కానరాకున్నను వారికావ్యముల మూలమున వారు మనకు అనుక్షణము ప్రత్యక్షమగుచుందురు. అదియే తక్కిన వారికన్న వారిలోనున్న విశిష్టత.

అచ్చులో కావ్యమని మనము చూచుచున్నవన్నియు కావ్యములు కావు. కవిపదవాచ్యులుగా ఈ ప్రపంచములోఁ గన్పించువారెల్లరు కవులు కారు. ఏ వాఙ్మయమందైనఁగానీ ఎక్కడనో ఎవ్వఁడో నూటికిఁ గోటికి నలువురో మూవురో నాలుగు కాలాలు నిలువఁగల మహాకవీశ్వరు లుందురు. నాఁటికి నేఁటికి గణనాప్రసంగములో కనిష్ఠిక కెక్కిన కాళిదాసు పజ్జను ఈడుజోడుగాఁ గూరుచుండ నేర్చినవాఁడే లేఁడను టలో—ఆ మహాకవి ప్రఖ్యాతినే గాక కవితావైఖరినిగూడ మనము గుర్తింపవచ్చును.

ఆయాయికాలములలోని సాంఘికపరిస్థితులనుబట్టి ఉద్భవించిన కవిత్వము ఒక పదేండ్లపాటు దేశములో 'పరపతి' గడింపవచ్చును. ఆ కావ్యమందు వస్తువుతో అక్కఱ తీరిన

వెనుక ఆ కావ్యము మాఱుమూలకుఁ బోవచ్చును. ఇంచు మించు అట్టి కవిత్వము ప్రచారకాండలోఁ బనికివచ్చునేమో గాని చిరస్థాయిగా నిలిచి విశ్వ్రశేయము కూర్పలేక పోవచ్చును. కలకాలము నిలువఁగల కావ్యము లేవో ప్రకృతము దిక్సూచిగాఁ బరిశీలింతము.

కవి యనఁగా వర్ణించువాఁడని ఒక నిర్వచనము కద్దు. సాంగోపాంగముగ కరచరణాదులను వర్ణింప నేర్చినంత మాత్రాన - అదియుత్తమకవిత్వముకాదు. గంభీరమైన ఉదాత్తమైన భావపరంపరయే సాహిత్యమునకు దీప్తి సంతరించును. కవియగువాఁడు, లోకములోని వస్తువులనే ఇతివృత్తముగా స్వీకరించి, కళాదృష్టితో దానికి అపూర్వమైన సన్నివేశము కల్పించి మానవజీవితమునకు అక్కఱయైన పరమార్థమును ఇంపుగా సొంపుగా ప్రబోధించును. ఆ ప్రబోధించెడి పరమార్థము కొంగ్రొత్తది కాకపోయినను — ఆ బోధించు విధానము నిత్యనూత్నమై మనస్సును ఆఁకట్టివైచును. అయోధ్యాపట్టణము ఏనాఁటిది? ఎక్కడిది? రామాదు లెప్పటివారు? వాల్మీకిని మనము కంటిమా? కలిసితిమా? తరతరాలు గాదు; యుగయుగాలుగా సీతారామలక్ష్మణులను సృష్టించి యిచ్చిన ఆర్ష కవి-ఆదికవి వాల్మీకుల కవితాప్రపంచములో నున్న ఘనత - గుణసంపత్తి ఎటిదో మనము గురింపవలెను.

'రామాదివ ద్వర్తితవ్యమ్—న రావణాదివత్' — అనెడి ధర్మసూత్రమును కావ్యపరిభాషలో సొంపుగా వర్ణించి నీతిని బోధించిన ఆదికవిని లోక మాదరమఱచిపోవు టెట్లు?

రనానుభవదృష్టి ఒక్కటే కవిస్సృష్టిలో ప్రధానాంశము కాదు. పూర్వులు కవిత్వములో సైతము ధర్మదృష్టికి ప్రధానపీఠ మిచ్చిరి. అట్లని ఆ రచనలను ధర్మశాస్త్రకోటిలో దింపలేదు. అడవిలోఁ జొచ్చి వేఁటలో మునిఁగిపోయిన దుష్యంతునకు హరిః ఓమ్మని ఆశ్రమవాసులు ఆశ్రమమృగమును జంపరాదని బోధించిరి. అంతదనుక ఆ మహారాజునకు ఆ వేఁటయే తమక మును గూర్చు రాజధర్మమై ఒప్పియుండవచ్చును. ఆశ్రమ వాసుల మాట విన్నపిదప ఆ మహావ్యక్తికి మఱొకటి ధర్మమై వెలసినది. నాగరకాగ్రగణ్యుఁడైన ఒకానొక మహారాజునకు ప్రశాంతమైన కణ్వాశ్రమములో సంబంధము తెచ్చిపెట్టి, ధర్మాచరణములో దీక్ష వహింపఁజేసి ప్రజాపరిపాలనములో విశిష్టత చేకూర్చి కాలిదాసు, మహాకవిగా మన్నన కెక్కెను. ఈ నాటకములో భౌతికముగా సుందరములై ముద్దు వచ్చెడి ఎన్నో ఘట్టనులలో ఈ మహాకవి, ఆధ్యాత్మికత్వమును మేళ వింపఁజేసి అత్యద్భుతస్సృష్టి కావించి ఈ కావ్యమునకు చిర స్థాయిత కలిగించి తాను చిరంజీవియై వెలసెను.

వేదసమ్మితమైన రామాయణమును పంచమవేదమై పరఁగిన భారతమును ఆర్షకవులు మనకు సృష్టించి యిచ్చిరి. నాఁటికి నేఁటికి ఈ దేశములో విశిష్య-ఈ రెండు కావ్యము లను మనము మఱచిపోకుండుటకు ప్రధానకారణ మేమి? నిన్నచూచిన వార్తాపత్రిక నేఁడు కంటిదగికే రానీయము. మొన్న చదివిన నవలను మఱొకసారి మూచూడనైన ఇష్ట పడము. ఏవేవో గీతములు సంగీతములు ఖండములు అప్ప టప్పటికి ఆనందము కూర్పవచ్చును. 'వింటే భారతమే విన

వలె'నఁట. నిన్న పురాణశ్రవణము చేసిన విరాటమును నేఁడు కావ్యముగా మనము చదువుకొన్నచో-ఆ యానందము బ్రహ్మానందముకింద లెక్క. ఆ కావ్యమే ధర్మజ్ఞులకు ధర్మ శాస్త్రముగా స్ఫురింపవచ్చును. అదియే వేదాంతులకు వేదాంతముగా గణనకు రావచ్చును. ఇతిహాసికుల కదియే ఇతిహాసముగా ఆనంద మీయవచ్చును. ఈ యందఱకు ఇన్ని రూపులలో ఎన్నెన్నో వన్నెచిన్నెలు కూర్చుచున్నదనఁగా-ఆ గ్రంథములో ఉన్న గుణసంపత్తి యెట్టిది? అది కాంతా సమ్మితమైన కావ్యముగా పరిఢవించి విశ్వజనీనమై వెలయుటఁ జేసియే దాని కా ప్రతిష్ఠ దక్కినది. ఈ యంశమునే సూత్ర ప్రాయముగా 'విశ్వశ్రేయః కావ్య'మ్మని నన్నయ్య నిర్వచించి నాఁడు.

నిత్యము-ఈ ప్రపంచములో మనము చూచుచున్న అన్నదమ్ముల పోరాటములే ఆలుమగల వైఖరులే వింత కథలుగా గాథలుగా భారతములో చిత్రించి చూపిరి. మను ష్యుల మానసికప్రవృత్తులు - మంచిచెబ్బరలు - రూపురేకలు కవితాభంగిమలోఁ జూచి మనము విస్మయపడెదము. కల్ప నలతో మేళగింపఁబడి ఎన్నెన్నో సొబగులు గుబాళించెడి ఆ ఘట్టములను మనము ఆఁచి యూఁచి తూఁచి తూఁచి చదు వఁగా - చదువఁగా, అయ్యవి ఒకానొక సత్యమునకు దీప స్తంభములై ప్రామాణికములై సిరస్థిరరూపముతో మన హృదయములలో ముద్ర వైచి మన మన జీవితములలో మేళవింపు చేసికొని నిలిచిపోవును.

రసికజనమునకు ఆ దశను గలిగించు కావ్యమే

కావ్యము. అట్టి వైఖరి తెచ్చిపెట్టు కవియే మహాకవి. ఆ కావ్యములోని శిల్పసౌందర్యమును తూఁచి కొలిచి చూపఁగల మానదండము అంతటి రసికులకే లభించును. మహాకవి రచన లోని విశేషములు ఒక సంఘమునకే చెందవు. ఒక కాలము నకే అన్వయింపవు; ఒక దేశమునకే అంటిపెట్టుకొని యుండవు. అనఁగా ఏ దేశములోఁగాని ఏ వాఙ్మయమందైనఁగాని మహా కవుల దివ్యసందేశములలో భావపరంపరలో పరస్పరసంవాద మున్న ఘట్టములు ఎన్నో కానవచ్చును. మానవసంఘమునకు అక్కఱకు వచ్చు శాశ్వతధర్మములను సార్వదేశికములుగా సార్వకాలికములుగా ప్రబోధించుటయే మహాకవుల లక్ష్యము; సిద్ధాంతమును. కవిత్వము కేవలము ఒక లలితకళా విశేషమే కాదు; పైపై మెఱుఁగులు గుబాళించు ఒక శిల్పము మాత్రమే కాదు. కవిత్వకళకు ఇంపుసొంపులు కూర్చునవి ముఖ్యముగా మూఁడని విమర్శకుల నిర్ణయము. వానిలో 'వస్తువు' మొదటిది. కావ్యములో మొదలు 'వస్తువును' స్వీకరించుటలోనే ప్రాచీనులకు నవీనులకు కావలసినంత భేదమున్నది. ఉదాత్తనాయకాశ్రయము లేని కావ్యము కావ్యము కాదని ప్రాచీనుల మతము. ఆ స్వీకరించెడి వస్తు వును-అనఁగా ఇతివృత్తమును ప్రౌఢమైన భావపరంపలో మప్పి ఒప్పింపవలెను. భావనాబలము లేని వస్తువు వట్టి నిష్ప్రచ్ఛరము. ఆ రెండింటికిఁ దోడైనది రచన. ఆ వస్తువును-ఆ భావమును సముచితమైన రచనలో వెలువఱిచిననాఁడే ఆ కవీశ్వరుని నేర్పుకూర్పులు కొట్టవచ్చినట్టులు కన్పట్టును. పదములు-వాక్యములు-శైలి-ఛందస్సు, ఇత్యాదు లన్నియు

రచనకు అందచందము లీయవలెను. కవిత్వకళకు ముమ్మొద టగాఁ గానవచ్చు ఆకృతి, రచన. భావ-వస్తువులు, ఆంత రంగికములు. ఆంతరంగికములకు ప్రాధాన్య మీయని రచన నీరసమైపోవును. భావము-వస్తువు-రచన, ఈ మూఁడింటిలో అందివేసిన కవిత్వమే చిరస్థాయియై నిలుచును. అదియే ఉత్తమమైన కవిత్వకళ. తక్కినది మాటవరుసకు కవిత్వమని పించుకొన్నను, ఆపాతతః హృద్యమై యున్నట్లు తోఁచినను చిరస్థాయిగా నిలువకపోవచ్చును. దీనినిబట్టియే లోకములో కవిపదవాచ్యు లెంద ఱెందఱో వెలసినను కాలిదాసాదులు కొందఱే మన కంటికిఁ గానవచ్చుచుందురు. అట్టివారి కావ్య ములే చిరస్థాయులై సార్వకాలికముగ ఆరాధ్యములై వెలయుచున్నవి.

ప్రాచీనులు కావ్యప్రయోజనములను పెక్కువిధాల వర్ణించి చూపిరి. కీర్తిప్రతిష్ఠలు లభింపవలెనన్న కావ్య మొక సాధనము. భాగ్యభోగ్యములు ప్రాప్తింపవలెనన్న అది యొక మార్గము. అమంగళము-అశ్లీలము పరిహరింపవలెనన్న-ఆచారవ్యవహారములు బోధింపవలెనన్న ఐహికాముష్మిక కానందములు ఆపాదింపవలెనన్న కాంతాసమ్మితమైన కావ్యము అత్యంతము ఉపకరించునని మన పూర్వుల సిద్ధాంతము. శబ్దప్రధానమైన వేదమువలె ఇదమిత్థమని కావ్యము శాసింపదు. అర్థప్రధానమైన పురాణము భంగి కావ్యము ఉపదేశింపదు. శబ్దార్థములకు ప్రాముఖ్య మిచ్చి రసప్రధానమై కావ్యము కాంతామణివోలె సహృదయులను సరసను జేర్చుకొని గామాదులవలె సంచరింపవయ్యా యని

ప్రబోధించును. ప్రతిభావంతుఁడైన కవీశ్వరునిచేతిలో మెలఁగిన పాత్రలు మన హృదయములలోఁ రూపు గట్టి నిచ్చలు నిలిచి యుండును. తాను సంపన్నగృహస్థు అయ్యి - శ్రీశుకులవోలె జితేంద్రియత్వమునకు పెట్టినది పేరుగా ప్రవరుఁడు ఉన్నాఁడను టలో పెద్దన కవితాశిల్పము ఎంతపని చేసెనో రసికులకే ఎఱుక. పెద్దన మనుచరిత్ర చదివినపిదప వరూధినీప్రవరుల జంటను మనము మఱువఁగలమా? ఆంధ్రవాఙ్మయములో చిరంజీవులైన ఆ పాత్రల రామణీయకము అనుక్షణము మనకు ఆస్వాద్యమై పెలయుటలో పెద్దన కవితాశిల్పము ఏమని వర్ణింతుము? ఇట్లే తెలుఁగులో తెలుఁగుఁదనము తెలుఁగులకు పంచిపెట్టుచు సోమయాజులు సృష్టించిన పాత్రల తీరు తెన్నులు అద్భుతావహము లనుట అతిశయోక్తి కాదు. ఆయన తీసికొన్న ఇతివృత్తము ఆయన సొంతము కాదు. అది అరువు సొమ్మే కావచ్చును. ఆ పాత్రలన్నియు వేదవ్యాసుల వారి చేతిలో మలఁచినవే కావచ్చును. యావద్భారతములో అందఱకు ఆ పాత్రములు పరిచితములే కావచ్చును. కాని, తెలుఁగువారికి తిక్కన్న చూపిన విధానము అత్యద్భుత మనుటకు ఎన్నో ఉపపత్తులు చూపవచ్చును. రాజకీయతంత్ర ములతో ధార్మికప్రవృత్తితో ఓతప్రోతములుగా పెనవేసికొన్న భారతగాథను తెలుఁగుపల్లెలలో పురాణముగా నేఁటికిని వినుచుందురు. సారస్వతరీతిగా కావ్యపాఠము చేసికొందుము. తిక్కన సృష్టించిన 'ద్రౌపదీ-ధర్మరాజులు-' ఒకానొక తీరులో ప్రత్యేకముగా భాసింతురు. ఆ కర్ణార్జునుల ఈడుజోడులోని తారతమ్యమును ఎంత గడుసుగా తిక్కశర్మ వెలిబుచ్చెనో

కొందఱకే తెలియవచ్చును. ఆచార్య-భీష్ముల ధోరణి ఆపాద మస్తకము సోమయాజు లెట్లు చిత్రించెనో మనము గుర్తింప వచ్చును. కీచకాదుల వైఖరిగాని శిశుపాలజరాసంధాదుల పోకడలుగాని తెలుఁగువారికి కవిబ్రహ్మ ఎట్లు చవిచూపెనో వివరింపవలెనన్న-అది యింకొక మహాభారతమే యగును. వారివారి చేష్టలు మంచిచెడ్డలు కవితాధోరణిలో మప్పి మనకంటికిఁ జూపుచు, పాత్రౌచిత్యములో రచనావిధానములో కవితాభంగిమలో విశిష్టత చూపుచు తెలుఁగుజాతికి సర్వాత్మనా నచ్చినట్లు చేసియుండుటఁజేసియే ఆ కావ్యమునకు-ఆ మహాకవికి ఆ కవిత్వమునకు చిరంజీవిత్వము ప్రాప్తించినది. కావ్యము చిరస్థాయిగా ఉండవలెనన్న ఏ యే యంశములు-ఏ యే గుణములు ఆవశ్యకములో అవి యన్నియు రాశీభూతములై కవిత్రయమువారి భారతములో అక్షరాక్షరముగ ప్రతిఘట్టములో మనకుఁ గానవచ్చును. కావుననే తెలుఁగు భారతములో ఒక్కొక్క పర్వమును ఒక్కొక్క ప్రబంధముగా విజ్ఞులు నిరూపించిరి. పర్వాంతర్గతములైన ఉపాఖ్యానము లన్నియు ఖండకావ్యములుగా రాణించును. ఏ భాగమున కా భాగముగా ప్రాముఖ్యమిచ్చి భారత మంతయు ప్రబంధమండలిగాఁ జేసి సర్వాంగసౌష్ఠవమును గూర్చి కవిత్రయమువారు మనకు శాశ్వతమైన మనోజ్ఞమైన మహాకావ్యమును ప్రసాదించిరి.

ఈ శ్రేణిలోఁ జేరినవారే పోతన్న-శ్రీనాథులు. రసరాజమైన శృంగారములో తాము మునిఁగి లోకమును ముంచి ఉజ్జ్వాత లూఁగించిన మహాకవు లెందఱో ఉండగా,

ఆ శృంగారమునే భక్తిరసములో రంగరించి, ఒక ధోరణిలో భౌతికముగా సౌందర్యమును వెలార్చుచు, వేఱొక ధోరణిలో ఆధ్యాత్మిక తత్త్వమును బోధించుచు, చదువరులను తరింపఁజేసెడి పోతరాజున కీ తెలుఁగు గడ్డలో ఈడు జోడు కాఁగలవా రెవ్వరై న ఉన్నారన్న - ఆ భద్రాద్రి గోపరాజు - ఆ గానబ్రహ్మము త్యాగరాజు - హంసలదీవి - భక్తరత్నము కాసుల పురుషోత్తమము ఈ మువ్వురే నా కంటికిప్పటికిఁ గానవచ్చుచున్నారు. తెలుఁగునాఁడు బ్రదికియున్నంతదాఁక - 'కమలాక్షు నర్చించు కరములు కరము'లన్న చరణము మఱచిపోవు తెలుఁగువాఁడెవ్వఁ డుండును ?

ఆంధ్రజాతికి తారకమంత్రముగా భక్తియోగమును, బ్రసాదించిన పోతన్న రచనలో గజేంద్రమోక్షగాథ ఒక మనోహర కావ్యముగానే కాదుసుమా! ఆపదలో నేదియు తోఁపని ఆర్తజనమున కయ్యది ఒక సంజీవిమంత్రముగా సాయపడుట అనుభవించినవారికే తెలిసెడి పరమరహస్యము. గోపికా గీతలను భగవద్గీతనువోలె పారాయణము చేయువారు తెలుఁగువారిలో ఉన్నారనఁగా-ఆ మహాకవి కవితాదీక్ష-భక్తిపారవశ్యము మన కర్థము కావచ్చును. త్యాగరాజ కృతులువోలె పోతరాజు భాగవతమునే గాక గోపరాజు [illegible] కమును సైతము తెలుఁగువారు కంఠతఃవల్లింతు [illegible] ఆ రహస్యము మనము గుర్తింపవలెను.

సంస్కృతములో 'కావ్యాలాపాంశ్చ వర్జయేత్ [illegible] ఒక కారిక ఉన్నది. ఆధ్యాత్మికదృష్టి ఉన్నవారు కావ్యాలోలికిఁ బోరాదని దానిభావము. కావుననే ఔత్తరాహ

లలో మతప్రమేయము గల ఒక కొందఱు సంస్కృత విద్యార్థులకు కాలిదాసకావ్యములనే పాఠ్యములుగాఁ జెప్పరాదని నిషేధించుట కద్దు. కాని, 'కావ్యాలాపాంశ్చ' అన్న దానికి 'అసత్కావ్యాలాపాంశ్చ' అని వ్యాఖ్యాతలు అన్వయించిరి. ఆ యన్వయమే లేనిచో పోతన్న కావ్యమును విడనాడి తెలుఁగువాఁడు బ్రదుకఁగలఁడా? మధురాతి మధురములైన భజనకీర్తనలువోలె పోతన్న పద్యములను తెలుఁగువాఁడు రోళ్ల రోఁకళ్ల వేనోళ్ల పాడుకొనుచుండునే!

తెలుఁగులో మహాకావ్యముగా ఆవిర్భవించి ఉపనిషత్సారమును తెలుఁగుపలుకులలో బోధించిన తిక్కన మనీషి కవితా వైభవమునకు ఏ సామ్రాజ్యవైభవము సాటి రాఁగలదు? తెలుగునేలలో భారతభాగవతకర్తలు సూర్యచంద్రులవంటివా రనుటలో ఎంతో అర్థమున్నది.

మనుచరిత్రాదిప్రబంధములు ఆంధ్రభాషాయోషకు అమూల్యములైన స్వర్ణభూషలు. మహేశ్వరుఁడు కవీశ్వరుఁడు నైన రాయలవారు సృష్టించిన స్వర్ణయుగములో-ఈ ప్రబంధయుగ మన్నది ఒక వింతసృష్టి. ఏ దేశములో ఏ వాఙ్మయములో ఇట్టి మనోజ్ఞసృష్టి లేదని విజ్ఞులు చెప్పినమాట మనము మఱువరాదు.

శ్రీనాథునివంటి ఉద్దండపండితులు కవిసార్వభౌములు రామరాజభూషణునివంటి రసికశిఖామణులు విద్వత్కవిచక్రవర్తులు సంస్కృత కవులలోనే ఒకరిర్వ్వురు తక్క అంతగాఁ గానరారు. నిగమశర్మ అక్కను పేరు లేని పెద్దముత్తయిదువగాఁ దీర్చి దిద్ది సంపన్నగృహస్థుల ఇండ్లలో గారాబువలన

దారిదప్పిన బిడ్డలకు మంచి సుద్దులు బుద్ధులు ఏ తీరుగ బోధింప వలెనో-బోధించినను పుట్టితో బుట్టినది పుడకలతో గాని ఎట్లు రూపుమాయదో రామకృష్ణకవి తన కావ్యములో చక్కగా వ్యక్తపఱిచెను. నిగమశర్మ వట్టి నేతిబీరకాయ అయ్యి-ఆ యుపాఖ్యానము తెలుగువాడు పఠింపనినాడు ఆతడు సాహిత్యములో ప్రవేశము లేనివాడే. సాహితీ సమరాంగణ సార్వభౌముడైన రాయలవారి 'ఆముక్తమును' గొంతయైన చవిచూడనివాడు-ఆ స్వర్ణయుగమును ఎఱుగని వాడే. కాలము మాఱి రాజ్యములు జాఱి చరిత్ర తలక్రిందు లైననాడు ఉద్భవించిన దక్షిణాంధ్ర వాఙ్మయములోని మధు రాతి మధురములైన ఘట్టములను మాటిమాటికి మనము స్మరింపవలసియున్నది. నన్నయ్యనుండి చిన్నయ్యదాక-ఆయా కాలములనుబట్టి అభిరుచులనుబట్టి ఉద్భవించిన కావ్యములలో అన్నియు మనకు దక్కలేదు. దక్కినవన్నియు రుచింపకపో వచ్చును. కాని, ఆ వాఙ్మయములో ప్రతిభావ్యుత్పత్తులు బాఢముగా గలిగి భావనాబలము లెస్సగా గడించి అర్థ గాంభీర్యముతో లలితపదప్రయోగనైపుణ్యముతో ఉదాత్త భావ సంపత్తితో మనోహర కావ్యములను సృష్టించి మనకు ప్రసాదించిన మహాకవులు పెక్కురున్నారు. నేటి మనచదువు లలో ఆ మహాకవుల రచనావిశేషమును అండదండగా గైకొ నుచు, కొంగ్రొత్త పోకడలను పుష్కలముగా ప్రోదిచేసి కొనుచు యావద్భారతములో తెలుగుతల్లికి వెల్గుగలల సమకూర్చుట మనకు విధ్యుక్తధర్మమని భావింతును.

[1960 - జూలై]

ధ్వని - ప్రధానరచనలు

లౌకికధోరణిలో చమత్కారము వెల్లివిరియునట్లు చక్కఁగా సంభాషణము చేయఁగల చతురులు మనలో కొంద ఱుందురు. సమయస్ఫూర్తితో నిండిన ఆ సంభాషణములో ఆపాతతఃి ఒక యర్థము మనచెవులకు వినిపించినను లోలోన మఱొకభావము గర్భితమై తఱుచినకొలఁది ఆనందము కలి గించుచుండును. అట్టిదే వాక్యచాతుర్యము. ఆ చాతుర్యము లోని సారస్యము గ్రహింపవలెనన్న కొంత నేర్పు కూర్పు, శ్రోతకుసైతము ఉండవలెను. అట్టి కళయే సాహిత్యములో ధ్వనిగా వినఁబడుచుండును. అలంకారఘట్టములో శాస్త్ర చర్చలో 'ధ్వనికి' పెద్ద ప్రాముఖ్య మున్నది. కావ్యదృష్టిలో ధ్వని, ఒక బ్రహ్మాండమైన శాఖ.

వాచకము-లక్షకము-వ్యంజనము అని శబ్దము మూఁడు విధములనియు వాచ్యము-లక్ష్యము-వ్యంగ్యము అని అర్థము మూఁడు విధము లనియు లాక్షణికులు నిర్వచించిరి. వాచ్యార్థ మున కందఁగాని వ్యంగ్యార్థమును సమకూర్చునదియే 'ధ్వని' యందురు. అవయవము లన్నియు ఒకయెత్తు; వానికి భిన్నమై వానివలన స్ఫురించెడి లావణ్యము ఒకయెత్తు. ఆ లావణ్యము వంటిదే వ్యంగ్యము. వ్యంగ్యమునుబట్టియే 'ధ్వని' యేర్పడును.

మన ముచ్చరించు శబ్దము-దాని యర్థము అప్రధానము కాఁగా-తన్మూలమున అర్థాంతరము బోధించుటకు వీలయిన

ఘట్టమునే ధ్వనియని శాస్త్రకారులు నిర్ణయించిరి. వాచ్యార్థముకన్న వ్యంగ్యార్థము చమత్కారి అయిననాఁడు-అనఁగా ఆ చమత్కారము ధ్వనింపఁబడునపుడు అదియే 'ధ్వని' యనుపేర ఒకానొక గుణముగా రాణించును. సంస్కృత సాహిత్యములో ధ్వని కున్న ప్రాముఖ్యము ఇంతింత కాదు. 'ధ్వనిమత' మని ప్రత్యేకముగా శాస్త్రములో ఒకశాఖ వెలసినది. ధ్వనిమతమందలి వ్యంజనామార్గమే స్ఫోటమార్గమును అనుగమించుచుండును. స్ఫోటమార్గ మనఁగా శబ్ద బ్రహ్మ విచారము చేయు వ్యాకరణశాస్త్రసంప్రదాయము. ఆ మతమునే ఆధారముగా అవలంబించి ఆలంకారికులు ఈ ధ్వనిమార్గమును నిర్మించినట్లు తేలుచున్నది. లక్ష్యార్థ తాత్పర్యార్థములకన్న భిన్నమై రమణీయమై అనిర్వచనీయమైన ఒకానొక అర్థమే ధ్వని యని పిండితార్థము. అదే వ్యంగ్యమని సారాంశము. వ్యంగ్యమును స్ఫురింపఁజేయవలెనన్న మనము ప్రయోగించు పదమునకు ఒకానొక శక్తి యుండవలెను. దానినే వ్యంజనాశక్తి యందురు. ఈ శక్తి ఆ పదమునకు క్రొత్తగా ఒక యర్థమును గల్పింపదు. కాని, ప్రసిద్ధమైన అర్థమునే చక్కఁగా స్పష్టము చేసి చూపును.

అలంకారము - రసము-రీతి-గుణదోషములు మున్నగు వాని తత్త్వము లెస్సగా విమర్శించి, ఇట్టివాని నన్నింటిని ధ్వనిలో లయింపఁజేసి దానినే 'ధ్వనిమతము'గా ప్రాచీనాలంకారికులు అంగీకరించుటఁజేసి సాహిత్యములో సహృదయులకు ఈ వ్యంగ్యార్థమన్న బ్రహ్మానందము లభించినంతగా భావన ఉన్నది. ఎక్కడ వ్యంగ్యార్థము మిక్కిలిగా పోషింపఁబడునో

అక్కడ ఉత్తమకావ్యలక్షణము ఉన్నట్లు లెక్క. అది వచనము కావచ్చును; పద్యము కావచ్చు; ప్రహసనము కావచ్చు.

సామాన్యసంభాషణములో సైతము 'వంకాయలూ' అనఁగా, కావలసినది వంకాయలే యైనను రావలసినది తేవలసినది 'వంకాయలబ్బి' యని అన్వయము. ధ్వన్యర్థము దేశకాలపాత్రములనుబట్టియు విషయ స్వరూపభేదములను బట్టియు గ్రహింపఁదగియుండును. గంగయందు గొల్లపల్లె ఉన్నదనఁగా, గొల్లపల్లె గంగాతీరమం దున్నదని భావము. గంగాశబ్దమునకు శైత్యపావనత్వములే ప్రయోజనములు. శ్లేషగా చెప్పవచ్చును; వ్రాయవచ్చునుగాని రచనలో ధ్వనిని దెచ్చుట అందఱకు సాధ్యముగాదు. ధ్వనియే కావ్యాత్మగా చెల్లుననియు; ధ్వనికావ్యమే ఉత్తమకావ్య మనియు ఆనంద వర్ధనాదులు అద్భుతముగా చర్చించి సిద్ధాంతము చేసిరి.

ఈ ధ్వనివిశేషములు తెలుఁగుసాహిత్యములో ఎంతగా వినఁబడుచున్నవో కొంతవట్టు పరిశీలింతము. నన్నయభట్టారకు నకు మున్ను తెలుఁగువాఙ్మయము లేకపోలేదుగాని దాని స్వరూపస్వభావాదులు స్పష్టముగా మనకిప్పుడు కన్పింపవు గావున నన్నయ్య 'పలుకుబళ్ళ'తోనే ఈ ఘట్టము ప్రారంభింతము.

సభలో, వాసుదేవునకు ధర్మతనయుఁ డిచ్చిన అర్ఘ్యమును జూచి సహింపనోపక శిశుపాలుఁడు ఉపాలంభనపరుండయి ధర్మరాజున కిట్లనియె :—

ము 'అవనీనాథు లనేకు లుండఁగ విశిష్టారాధ్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వురుండఁగ ధరిత్రీనాథ ! గాంగేయు ము

ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెటిఁగించి తిందఱకు దాశార్హుండు పూజార్హుఁడే !

అక్షరసౌభాగ్యము–అనుప్రాస సౌందర్యము మున్నగు సుగుణములతోపాటు ఈ పద్యములోని పదముల సొంపు పెంపులు పరిశీలింపవలెను. పూజింపఁదగినవారు అవనీనాథులలో మహీదివిజులలో ఇంద ఱిందఱు ఇంతటి యోగ్యులుండఁగా వార్ష్ణేయుని పూజించుట వట్టి యవివేకమని శిశుపాలుని వాదము. వృష్ణివంశ్యుఁడు వార్ష్ణేయుఁడఁట. ఆ 'ముఖా'లో వృష్ణివంశ్యులకు అంత పేరు ప్రతిష్ఠలు లేవని శిశుపాలుని తీర్పు. పైగా–దాశార్హుండు పూజార్హుఁడే, అని ఒక ఎత్తిపొడుపు. దాశార్హుఁడనఁగా శ్రీహరి యని అర్థమున్నది. అది వాచ్యము. దాశులనఁగా చేఁపలను బట్టువారు; అనఁగా పల్లెకారులు. వాఁడ్రకుఁ దగినవాఁడు ఈ కృష్ణుఁడని ఒక వ్యంగ్యము. లేదా–దాస+అర్హుఁడన్నచో, దాస్యమునకుఁ దగినవాఁడన్న ధ్వనియు రావచ్చును. తొడలు విఱిగి పడిన దుర్యోధనుఁడు శ్రీకృష్ణు నాక్షేపించు సందర్భమున 'కంస దాసునిపుత్త్రి! కానవు నీ దురాచారంబుఁ గృపయు లజ్జయును లేక ప్రేలెదు' [శల్య. పర్వము] అని ఈ దాస్యపు ధోరణి యెత్తుకొనును. కాఁగా, భీష్మ పలుకుఁజేసి బేలవై పోయిన ఓ ధర్మరాజా! నీవు పూజింపఁ దలపెట్టిన ఈతఁడు పల్లెలు–బోయలు మున్నగువారికిఁ దగినవాఁడ్రై వారిలోఁ దిరిగి వారివిూఁది పెత్తనమునకు పనికి రావచ్చుఁగాక! లేదా భృత్యత్వమునకుఁ దగినవాఁడు కావచ్చు. అంతేగాని ఈ మహా

సభలో ఇందఱు పెద్ద లుండఁగా ఈతఁడు పూజార్హుఁడుగ ఎట్లగునయ్యా! అని ధ్వనిగా ఒక ఆక్షేపము గర్భితమై యున్నది.

ఈ ఘట్టమందే 'అఖిలలోకపూజ్యు నచ్యుతుఁ బూజింపు మధిప! యదియ చూవె యజ్ఞఫలము' (సభా) అని భీష్ముఁడనఁగా, ఆ మాటలే శిశుపాలుఁ డందుకొని 'యీతఁ డర్హుఁడని యచ్యుతు నర్చితు జేయఁ బాడియే' అని వెక్కిరించును. ఇక్కడ 'అచ్యుతుని' అన్నచోట, అ+చ్యుతుఁడు అని వ్యాకరణసంప్రదాయముప్రకారము వేఱొక యర్థము స్ఫురింపవచ్చునని పెద్ద లందురు. నన్నయ్యపదములలోని సొగసునుబట్టి సమయానుకూలముగ ఇట్టి యర్థములు స్ఫురింప వచ్చును. ఇట్టివే ధ్వనికి బీజములు. తుదకు శిశుపాలుఁడు భీష్మ భీముల నతిక్రమించి శ్రీకృష్ణునివంకకుఁ దిరిగి ఇట్లనును:—

మ. 'అవమాన్యున్ సభలోన మాన్యుఁడని సౌహార్దంబునం గౌరవ
స్థవిగర్హాపేరణ నిన్నుఁ బాండుతనయుల్ తప్పంగఁ బూజించి ర
య్యవివేకాస్పదులైన పాండవులు మోహాంధుండు భీష్ముండుఁ గే
శవ! నీవుం గడఁగుండు నాకు నెదురై సంగ్రామరంగంబునన్' (సభా)

ఇందు, కే, శవ! నీవుం గడఁగుండు నాకు నెదురై అని 'శవ-నీవు' అన్న పదముల విఱుపులో వెటకారము స్ఫురింప వలెను. ఇట్టివి శ్లేషలో లెక్కవేయక ధ్వనిలో జమ కట్టి ఆనందింపవలసి యున్నది. పలుకుబడిలో అర్థవిశేషమును గల్పించి సమయానుకూలముగ గంభీరభావమును గూర్చుటలో నన్నయ్య ఆరితేరిన మహాకవి. ఆయనత్రోవలోని

మెఱుఁగులను గుర్తించి మఱికొంత ఉదాత్తమైన ధోరణిలో ధ్వనిమతమును కవిత్వములో అన్వయించి చూపిన మహాకవి తిక్కన మనీషి.

తెలుఁగులో తిక్కన రచనలో ఒక విశిష్టత ఉన్నది. అది నన్నయ్య పురాణఘక్కివలె నడువదు. అది యొక మనోహరమైన కావ్యఘక్కి. దానిలో వక్రోక్తులు వ్యంగ్యములు కావలసినన్ని కన్పించును. వక్రోక్తులలో అర్థాంతరము స్ఫురించి వ్యంగములోనికి దిగి సంభాషణాచాతుర్యమును నాటకీయతను పోషింపఁజేయును. ఈ త్రోవలో తిక్కన్నను మించినవారు తెలుఁగులో లేరనవచ్చును.

సుదేష్ణ మందిరములో నున్న ద్రౌపదిని కీచకుఁడు చూచి మోహాంధుఁడయి ఆమెదగ్గఱికిఁ జేరి తమకము ఆఁపు కొనలేక ఆమెకు తనకోరికను వెల్లడించెను. అప్పుడు ద్రౌపది అన్నమాట ఇది :—

తే. 'చనునె యిమ్మాటలాడ సజ్జనుల కాఁడుఁ
బుట్టువులతోడ నీవును బుట్టినాఁడ
వట్లుఁగాకయు హీనవంశాభిజాత
నైన పతివత్నినగు నన్ను నడుగఁదగునె !'

[విరాట. 2 ఆ. 50 ప.]

అన్నా ! కీచక ! సజ్జనులైనవారు ఇట్టిమాటలు పలుకుట న్యాయమయ్యా ? ఆఁడుఁబుట్టువుతోడ నీవును బుట్టినాఁడవే గదా ! అదియునుగాక, నేను హీనవంశసంజాతనే. పతివ్రతనే. నన్నిట్లు అడుగుట నీకుఁ దగునా ? అని పైకి ఆ

మూర్ఖునితో ఆ ద్రౌపది అన్నట్లు కవి వాక్యము. ఇందు-కావలసినంత గంభీరమైన అర్థాంతర మున్నది.

ఓరి నీచుఁడా! సజ్జనుఁడైనవాఁడు ఆఁడుతోడు గల వాఁడు ఇట్టి కూఁతలు కూయఁడు. పరస్త్రీలను ఈ తీరుగ పలుకరించువాఁడు సజ్జనుఁడగునా? నీకున్నైత మిక్కడ తోఁబుట్టు వున్నదిగదా! ఆ దృష్టితో నన్నొఁగూడఁ జూచి సంచరింపవలదటరా! సజ్జనత్వము గిజ్జనత్వము నా కక్కఱి లేదు; ఆఁడుతోడు గీఁడుతోడుతో నాకుఁ బనిలేదు. అని యందువేమో! అవునవును నిజమే. ఆ ధోరణిలోనే ఉన్నావు. హీన!—హీనుఁడవైన కీచకా! నే నెవరనో తెలియునా! వంశాభిజాతనురా = అనఁగా సద్వంశమున పుట్టినదాననురా; ఆపైని పతివ్రతను రా. పరాక్రమవంతులైన భర్తలు గల దానను రా. నన్నటరా నీవు కోరుట? నా వంశము ప్రతిష్ఠను గానీ నా భర్తల పరాక్రమక్రమముగానీ గుర్తింపక ఈ తీరుగ వదరుచున్న నీకు నాశనము తప్పదురా! అని హెచ్చరికగా ఒక ధ్వనిని ఆమె నోట వినిపించును. ఈ పద్యము వట్టి చిన్న గీతమే కావచ్చును. అలఁతియలఁతిపదములే ఉండవచ్చును. 'హీనవంశాభిజాత'-అన్న పదములో 'హీన' పదమును విఱిచివైచి కీచకున కన్వయించినచో శ్లేషయై, వానికిఁ దగిన యర్థమును దెచ్చి యిచ్చును. వంశము-పతివ్రత-అన్న ముక్కలలో ఒక బిగువు-ఒక ఆభిజాత్యము, ఆపైని ఆ నీచుని నైచ్యమును వెల్లడించుటలో కావలసినంత చమత్కారము ఉన్నవి. ఇంతకన్న రచనలో 'ధ్వని' ఇంకేమి కావలెను?

కవిత్రయమువారి తరువాత ధ్వనిప్రధానరచన చేసిన

వారిలో రామరాజభూషణుని మించినవారు లేరు. ఆతఁడు కేవలము శ్లేషకావ్యములనే ప్రాసినట్లు మందబుద్ధులు కొందఱు బ్రమింతురు. ఆతఁడు ప్రాసిన వసుచరిత్రము ఆంధ్ర సారస్యతమునకే తలమానికము. అలంకారములు – అర్థగౌరవము–రీతి–వృత్తి – పాకము – శయ్య, ఇత్యాదు లన్నింటికిని వసుచరిత్ర ఒక బంగారుగనివంటిది. ఈ మహాకావ్యములో ధ్వనియే ప్రధానగుణముగా భాసించుచున్నది. కావ్యలక్ష్మికి శబ్దార్థములు శరీరమువంటివి. కాఁగా అలంకారములు సొమ్ములవంటివి కాఁగా, ధ్వని–జీవనము వంటిదే యగునన్న లాక్షణికుల మాటకు వసుచరిత్రలో ప్రతిపద్యము తార్కాణగా చూపవచ్చును. శ్రవణసుభగమైన మాధుర్యమును శ్లేషలో రంగరించి యుంచి రసౌచిత్యములో ధ్వనులను గూర్చుటఁజేసి వసుచరిత్ర 'ధ్వని కావ్య' మయినది. ఒక పదము గాదు; ఒక పద్యము గాదు; ఈ కావ్యమందంతటను అర్థధ్వనియును గూర్చుటకయి అద్భుతమైన శిల్పము నెల కొల్పెను. నదులకు పర్వతములకు మానవత్వము కల్పించి అధిష్ఠానదేవతలుగా రూపించి, గర్భధారణలు–ప్రసూతి విశేషములు–శిశుపోషణములు–బాల్యక్రీడలు–వయోభేదములు– సఖీధర్మములు–ప్రేమానుబంధములు – రసానుభూతులు–శృంగారస్ఫుట్టములు–రమణీయ సన్నివేశములలో ఈ తీరుగ కావ్యమును చిత్రించినవాఁడు 'న భూతో న భవిష్యతి'. దిక్సూచిగా–ఇవిగో ఈ పద్యములను ఒక్క–సారి పరిశీలింతము :—

ఈ కావ్యములో గిరికావసురాజులు నాయికా నాయకులు. మంజువాణి, గిరికకు ఆంతరంగిక సఖీమణి. వసురాజు

నర్మసఖుఁడు, మాయామాతానియై వచ్చి గిరికావృత్తాంతమును మంజువాణివలన వినుచుండును. ఆ ఘట్టములో వసురాజు ఆకస్మికముగా అక్కడికి రాఁగా అమితానంద మందిన మంజువాణి ఆ మహారాజుతో ఇట్లనును :—

మ. 'అనఘామూల్యమణిప్రరోహముల నీ కర్పించు నే దివ్య వా
హిని గౌరీపతికిన్ హిమాచలమున ట్లే గట్టు నీకున్ విహా
రనగంబై తగు నట్టి శుక్తిమతియుం బ్రాలేయశై లేంద్రనం
దనుఁడుం గాంచిన కన్యఁగా నధిప! యీ తన్వంగి నెన్నందగున్.'

[ఆ 3 పద్య. 57]

మహారాజా! నిత్యము నీకు ఏ దివ్యవాహిని రత్నాలను కానుకలుగా సమర్పించుకొనుచుండునో, గౌరీపతికి హిమాచలమువోలె ఏ పర్వతము నీకు విహారనగమై వెలయుచుండునో-ఆ శుక్తిమతికి ఆ కోలాహలునకు పుట్టిన బిడ్డయే ఈ గిరికాదేవి యని కథానాయికా జన్మవృత్తాంతమును వసురాజునకు వినిపించుటయే ఇందు సామాన్యార్థము.

ఈ ఘట్టములో వస్తుధ్వని కావలసినంత. మహారాజా! 'రత్నహారీ తు పార్థివః' అన్నట్లు ఈ ప్రాంతమందు ఉద్భవించిన రత్నములు నీకే దక్కవలసియున్నవి గదా! ఈమె తల్లి శుక్తిమతి, తనలో పుట్టిన రత్నాంకురములను నీకు సమర్పించుకొనుట సంప్రదాయము కావున, తనయందే పుట్టిన రత్నాంకురమువంటి ఈ బిడ్డను గిరికనుగూడ నీకే సమర్పింపఁగలదని ఒక సూచన. ఇట్టిదానినే వస్తుధ్వని యందురు.

అది కేవలము వాహినికాదు; దివ్యవాహిని. అది సమర్పించునది వట్టి మణులు కాదు. అనఘములు-అమూల్య

ములు. అనఁగా నెఱసులు లేనివి–విలువలు కట్టరానివి. ఆపైని మణిప్రరోహములఁట. అనఁగా ముత్తియపు మొలకలు. అవి సమర్పించు ఆ దివ్యవాహిని పేరుకూడ శుక్తిమతి యఁట. మొలకము త్యాలు సమర్పింపఁజాలినది వట్టి 'నది' యనక 'శుక్తిమతి' యని ప్రయోగించుటలో సారస్యము గ్రహింప వలెను. తల్లి అయిన ఆ వాహిని 'దివ్య' అగుటచేతను, తండ్రియైన ఆ 'గట్టు', ప్రాలేయాద్రేంద్రనందనుఁడనుట చేతను–ఆ దివ్యదంపతులకుఁ గలిగిన ఈ గిరికాదేవియొక్క ఆభిజాత్యము గమనింపవయ్యా మహారాజా! యని మధుర ధ్వని. అయితే, ఇంతవారైన ఈ దంపతులు తమకన్యను నా కిత్తురో లేదో అన్న సందేహము నీ కక్కఱ లేదు. ఎందు వలన? ఇదిగో! వినుము: ఆమె నీకు రత్నాంకురములు సమర్పింపవలసియున్నది గదా! ఆతఁడు నీకు విహారనగమై ఉన్నాఁడు గదా! ఆ యిర్వురు ఈ తీరుగ పరాధీనులు కావున వారికి పుట్టిన ఈ కన్య నీకు గ్రహింపఁదగిన సొమ్మేయనియు, వారిని నీవుగా అడుగవలసిన అక్కఱయే లేదనియు సంశయ నివారణము. గౌరీపతికి హిమాచలమునట్లు–ఇదియు వట్టి ఉపమ కాదు. హిమాచలముమీఁద విహరించు పరమేశ్వరు నకు హిమాచలకన్య పార్వతి పరిగ్రహపాత్ర అయినట్లు, కోలాహలపర్వతము నీకు విహారనగముకావున ఆతని బిడ్డ యైన ఈ గిరిక నీకు వివాహయోగ్య మహారాజా! అని మఱొక ధ్వని. ఇందే ఇంకొక్క పద్యము :—

మ. 'పదమెత్తం గలహంసలీల యధరస్పందంబు సేయ శుభా
స్పదమా రాగకదంబకంబు శ్రుతిచూప శ్రీవిలాసంబు కే

ల్గదలింపన్ సుకుమారపల్లవనవైలాలక్ష్మి వీక్షింప వ
ట్పదియుం బొల్చుఁదరంబె కన్నెఁగొనియాడన్ గేయవాక్ప్రౌఢిమన్'

ఆ గిరిక అడుగువెట్టినదా అచ్చముగా రాచయంచయే. అధరము కదలించినదా ఎఱుపువన్నెల గుబురులు మెఱయ వలసినదే. శ్రుతిని జూపినదా శ్రీవిలాసమే. శ్రుతి యనఁగా-చెవి. చెవి శ్రీవర్ణాకారముతో ఉండునని కవిసమయము. కేలు కదలించినదా ఏలాలక్ష్మిని కన్పించినట్లే. అనఁగా-కేలు ఏలకి తీవెల చివుళ్ళవోలె పెంపు సొంపారుచుండునని భావము. ఇఁక ఆమె వీక్షించినదా షట్పదియే సుమా! అందును షట్పదము గాదు; షట్పది. అనఁగా ఆఁడుతుమ్మెద. కావున ఆ కన్య యొక్క గేయవాక్ప్రౌఢి కొనియాడఁదరమా! ఇచ్చట పాద న్యాసాదికము వలననే ఆమె గానసమృద్ధి కన్పించుచున్నదను టలో ఒక ఆశ్చర్యము ధ్వనించుచున్నది. ఈ యాశ్చర్య ములో ఒక చమత్కారము ధ్వనింపవలెను. అందును కార్య కారణ భావము కలసిరావలెను. రామరాజభూషణ కవిసార్వ భౌముఁడు 'సంగీతసాహిత్యరసపోషణుఁడు' కావున ఈ పద్యము నాలుగు పాదములలో అయిదు రాగములను సూచించెను. అవి, 'కలహంసరాగము - రాగకదంబకము - శ్రీరాగము-ఏలపాట-షట్పది' అనునవి.

గిరికాదేవి అవయవములలో ఏది కదలించినను ఏదో ఒకరాగము కన్పించును గావున ఆమె గానమహిమ వర్ణింపఁ దరముగాదనియు, ఆమె గమనము మరాళగమనము-పెదవి కెంపు-కేలు చివురు-చూపులు తుమ్మెదలు కావున ఆమె రూప సంపద సౌందర్యసౌకుమార్యములు చెప్పఁదరముగావనియు

అర్థద్వ్యయము వ్యక్తము కావలెను.

పద మెత్తఁగానే శ్రుతి చూపవలెనన్నది ఒక చమత్కారము. సుకుమార పల్లవలో 'పల్లవి' ఉన్నది. ఈ తీరుగ వెలసిన ఆమె సంగీతపాటవముమాట అటుంచి రామరాజభూషణుని సంగీతప్రావీణ్యమును ధ్వనిప్రాముఖ్యమును మున్ముందు మెచ్చుకొనవలసియున్నది.

ఈ దృష్టితో పరిశీలింపఁగా తెలుఁగులో శతకవాఙ్మయములో 'ధ్వని' విశేషము లెన్నో ధ్వనించుచుండును. అందును నవీనుఁడైన కాసుల పురుషోత్తమకవీశ్వరుఁడు ఈ ఘట్టములో ఆరితేఱిన దిట్ట. ఆతని 'ఆంధ్రనాయిక శతకము' ధ్వని ప్రధానరచనలకు శిరోమణి. ఇఁక వచనరచనలో చమత్కారమును గుప్పించుచు హాస్యమును పోషించుచు మాధుర్యమును వెలార్చుచు 'ధ్వని' విశేషములను జూపినవారిలో చిలకమర్తి-పానుగంటి లక్ష్మీనరసింహాద్వ్యయమును మించినవారు పుట్టలేదనుట స్తవము కాదు; వాస్తవము.

[1962 - జులై]

తెలుఁగు భారతము

సంస్కృతభారతము వేదవ్యాసప్రణీతమని వ్యవహారములో రూఢి కెక్కినను - ఆ గ్రంథములో చాలభాగము ఇతరుల చేతిలో నడచినదన్న విమర్శకుల మాట కాదనలేము. అనఁగా సంస్కృతభారతము ఒకవిధముగా విభిన్నకర్తృక మన్న మాట విమర్శకులు తేల్చిన సిద్ధాంతము.

ఆ యూహసత్యమే తెలుఁగు భారతమునకుఁగూడ సంక్రమించినది. కాఁగా-మున్నూఱేండ్ల వ్యవధిలో మూవురు మహాకవులు తెలుఁగు భారతము వ్రాసి మన కిచ్చిరి. ఈ విషయమిట్లు జరుగునని జోస్యము చెప్పినట్లు నన్నయ్య నోటముమ్మొదటగా ఈ మాటయే వచ్చినది :—

'శ్రీవాణీగిరిజా శ్చిరాయ దధతో వక్షోముఖాఙ్గేషు యే
లోకానాం స్థితి మావహ న్త్యవిహతాం స్త్రీపుంస యోగోద్భవామ్
తే వేదత్రయ మూర్తయ స్త్రిపురుషా స్సమ్భావితా వస్సుఖైఃభూయాసుఃపురుషో త్తమామ్బుజభవశ్రీకన్ధరా శ్శ్రేయసే'

[భార. మంగళశ్లోకము 1]

ఈ మంగళశ్లోకములో నన్నయ్య చెప్పినట్లు 'హరిహర బ్రహ్మాలయు శ్రీ గిరిజా సరస్వతులయు స్తోత్రమే ప్రధానముకావచ్చును. కాని, ఈ ఘట్టములో కావ్యార్థ సూచనవంటి అంశము లున్నవి. వేదత్రయ మూర్తయఃత్రిపురుషాఃఅన్న మాటలో పంచమవేదమైన ఈ తెలుఁగు భారతమునకు పురుష

త్రయము కర్తలయ్యెదరని ధ్వనియున్న దనుట సత్యమే' 'పురు షత్రయ' మనఁగా మనము సంభావించుకొను 'కవిత్రయము' వారే. ఆ పురుషత్రయమును 'పురుషో త్తముఁడని – అంబుజ భవుఁడని – శ్రీకంధరుఁడని' నన్నయ పేర్కొనెను.

గాసటబీసటగా నున్న తెలుఁగువాఙ్మయములో మహా కావ్యత్వసిద్ధికి మూలపురుషుఁడు కావున వాఙ్మయరీతిగా మనకు నన్నయభట్టు పురుషో త్తముఁడే అయ్యెను. అంబుజభవశబ్దము కవిబ్రహ్మ తిక్కన్నను నిస్సందేహముగా నిర్ణయించును. కాఁగా శ్రీకంధరుఁడున్నాఁడు. శ్రీకంధరుఁడనఁగా పరమేశ్వ రుఁడు. కవిత్రయములోని ఎఱ్ఱనామాత్యుఁడు 'ప్రబంధపర మేశ్వరుఁ' డే గదా! పైగా–ఆతఁడు శైవోపాసకుఁడఁట. 'శంభుదాసుఁడ'ను బిరుదముగూడ ఇతని కున్నదాయె.

'ఇది శ్రీ శంకరస్వామి సంయమీశ్వరచరణసరోరుహ ధ్యానానంద సౌందర్యధుర్య శ్రీసూర్యసుకవి సంభవ శంభుదాస లక్షణాభిధేయ యెఱ్ఱయ నామధేయ ప్రణీతము' అని ఈతని హరివంశములోని ఆశ్వాసాంత గద్యమువలన ఈతని శివ భక్తి స్పష్టమగుచున్నది.

ముమ్మూర్తులను బోలిన ఈ మువ్వురు మహాకవుల కున్న పేరుప్రతిష్ఠలు తెలుగు వాఙ్మయములో మఱెవ్వరికిని లేవు. సంస్కృతములోనైతము భాస–కాలిదాస భవభూతు లను విడిచినచో వీరిని మించినవారు లేరనవచ్చును.

కమ్మగా వచనము వ్రాయవలెనన్నను చక్కఁగా పద్యము లల్లవలెనన్నను తెలుఁగువాఁడు కవిత్రయమువారిని లెస్సగాఁ జదువవలసియున్నది. వారిలో ఒకరు హెచ్చు

మఱొకరు లొచ్చు-అని తేల్చుట కాధారములు చాలవు. కాని మనవేడుకకై ఏవో కొన్ని ఉపపత్తులను గల్పించినచో అవి మనబుద్ధిలోని 'మాలిన్యమును - పాక్షికభావమును' మాత్రమే ప్రదర్శింపఁజాలియుండును. ఒక యంశములో నన్నయ్య, మార్గదర్శి యన్నచో వేఱొక త్రోవలో తిక్కన్న మొనగాఁడని తేల్పవలసివచ్చును. ఈ యిరువురి కీడుజోడయి కవిత్వపుఠీవిలో అచ్చము అవే రూపురేకలు దిద్దితీర్చిన 'అజ్ఞాతవాస' కవీశ్వరుఁడు ఎట్లన్న ఏమిటను దక్కువ కాదు. కావున, తెలుఁగున ఈ మూవురు మనకు హరిహరబ్రహ్మలువోలె పరమపూజ్యులన్నమాట తేలిన విషయము.

వీరి కవితాపాటవము ఆయాఘట్టములనుబట్టి స్పష్టమగుచుండును. వీరి యదృష్టము పండి వీరికి దక్కిన కథాభాగములనుబట్టియే తఱుగు మెఱుఁగులు స్ఫురించుచుండును. ఇచ్చట-ఆ కథల ప్రస్తావమే ఇంచుకంత చూతము.

వైదికసభ్యత కలిగి చాళుక్యుల కులబ్రాహ్మణుఁడైన నన్నయభట్టు, కౌరవపాండవుల పుట్టుపూర్వపు గాథలు - జాతకకర్మకాండలు వర్ణింపవలసివచ్చినది. మన మాటలలోఁగాక 'కవిబ్రహ్మ'మాటలలో నన్నయభట్టారకుఁడు 'ఆంధ్రకవిత్వవిశారదుఁడు; విద్యాదయితుఁడు; మహితాత్ముఁడు'. ఆ భట్టారకుని సర్వవైదుష్యమును జిత్రించుటకు ఈ మూఁడు విశేషణములే చాలును.

అసలు, 'కృతాద్యవస్థ'- అన్నమాట కర్థము కవిత్వములో దిగినవారికే తెలియును. సంస్కృతభారతమును తెలుఁగునకు దించుట యన్నది - ఒక విధమగు కృతాద్య

వస్థయే. ఇది సామాన్యమగు ఉద్యమము కాదు. పంచమ వేదమని పేరు వడసిన మహాగ్రంథము మహాభారతము. దేశ కాలములనుబట్టి చాళుక్యభూపతి యభిలాషనుబట్టి ధర్మాద్వైత స్థితినిబట్టి ఈ భారతము తెలుఁగునకు రావలసివచ్చినది. ఈ మహోద్యమములో ముఖ్యఘట్టములు రెండు. ఒకటి 'ఆంధ్ర కవితావిర్భావము'. రెండు 'అద్వైత మతప్రచారసిద్ధి.' ఈ రెండింటిని సుష్ఠుగా పోషించి, ఒకవంక ఆదికవిగా, వేఱొకవంక అద్వైతమతోద్ధారకుఁడుగా నన్నయభట్టు ప్రతిష్ఠ కెక్కెను.

భారతగాథలలో 'తక్షకుఁడు – కుండలములగాథ' ము మొ్మదటిది. పాండవుల 'స్వర్గారోహణము' కట్టకడపటిది. పదునెనిమిది పర్వములలో వీరశృంగారములు అద్భుతముగా వర్ణించి ప్రత్యేక కావ్యములుగా పారాయణము చేసికోఁదగిన భాగములు పెక్కులు గలవు. లౌకిక భాగములనుండి జీవి తములను మఱల్చి జీవాత్మపరమాత్మ తత్త్వవివరణము కావించి, ఆధ్యాత్మికరహస్యములు స్పష్టపఱచి బ్రహ్మానంద మందుటకు ఉపకరించు గాథలనుగూడ భారతము వర్ణించినది. ఒకవిధముగా భారత మంతయు మానవజీవితమునే చిత్రించి చూపిన దనవచ్చును. అన్నదమ్ముల అసూయలు–బావమఱఁ దుల బ్రదుకుకోరుటలు – సైఖ్యోపాధ్యాయికలు–ఈర్ష్యాపరుల దుశ్చేష్టలు–దాయాదుల కుట్రలు – రాజకీయముల రగడలు–తంత్రావాపములు–అనుష్ఠాననిత్యత్వములోని స్వాతంత్ర్యభంగ ములు–అధర్మప్రాబల్యము–ధర్మవిజయము, ఇత్యాదు లెన్నో ఈ మహాగ్రంథములో 'వ్యక్తి' గతములై అభివ్యక్తమగు చుండును. మానవుని సర్వతోముఖ జీవితచరిత్రమునకు మహా

భారతము ఒక వ్యాఖ్యగా పరిణమించినదని చెప్పవచ్చును.

కవితాదృష్టితోఁ గానీ పారమార్థిక బుద్ధితోఁ గానీ ప్రమాణముగా భావింపవలసిన గాథలు భారతములో ఎన్నో యున్నవి. వానిలో ముఖ్యము లైనవి ఏవో-కవిత్రయములో ఎవరిచేయి ఏ తీరుగ పనితనము చూపనేర్చినదో పరిశీలించుట తెలుఁగువారి విధి.

సీ. 'ధర్మతత్త్వజ్ఞులు ధర్మశాస్త్రంబని యధ్యాత్మవిదులు వేదాంతమనియు
నీతివిచక్షణుల్ నీతిశాస్త్రంబని కవివృషభులు మహాకావ్యమనియు
లాక్షణికులు సర్వలక్ష్యసంగ్రహమని యైతిహాసికు లితిహాస మనియుఁ
బరమపౌరాణికుల్ బహుపురాణసముచ్చయంబని మహిఁగొని
యాడుచుంద్రు

ఆ. వివిధవేదతత్త్వవేది వేదవ్యాసుఁ డాదిమునిపరశరాత్మజుండు
విష్ణుసన్నిభుండు విశ్వజనీనమై పరఁగుచుండఁ జేసె భారతంబు.'

ఒక్క సూర్యుఁడే సమస్తజీవులకుఁ దా నొకొక్కఁడై తోఁచినరీతిగా, మహాభారతము ఇందఱకు ఇన్నివిధాలఁ దోఁచి విశ్వజనీనమైనదఁట. ఈ త్రోవలలో నన్నయ్యకు నచ్చిన దేదో తిక్కన్నకు హితమైన దేదో ఎఱ్ఱన్న వీరిర్వురను ఎట్లు అనుకరించి అనుసరించెనో లోఁతుగాఁ జూచినఁగాని అంతు పట్టదు.

అసలు-మహాభారతమునకు ఇతిహాసమని పేరుకలదు.

'ధర్మార్థకామమోక్షాణా ముపదేశసమన్వితమ్
పూర్వావృత్త కథాయుక్త మితిహాసం ప్రచక్షతే'

చతుర్వర్గముల ఉపదేశముతోఁ గూడి పూర్వము జరిగిన కథను విప్పిచెప్పినదే ఇతిహాసము. ఈ దృష్టిలోనే

నన్నయ్యభట్టారకుని దీక్ష కన్పించును. పదిమందికి ఇతిహాస ముగా ఈ తెలుఁగుభారతము పనికి రావలెననియు పురాణ ముగా పౌరాణికులు పారాయణము చేయవలెననియు ఐహికా ముష్మిక సుఖప్రదములైన ఆ కథలను ప్రమాణబుద్ధితోఁ జదివి తన్మూలమున పరమశ్రేయస్సు పడయుటయే జన్మసాఫల్య మనియు ప్రధానముగా నన్నయ భావన కావచ్చును. కావుననే ఆతఁడు ప్రధానకథను మించి అవాంతరకథలను పెంచఁడు. ఇతి హాసముద్రయే నన్నయ రచనలో హెచ్చుగాఁ గన్పట్టును. కథాకథనములో అక్షర రమ్యతలో కవితాప్రసన్నతలో నన్నయచేయి మిన్నయే కావచ్చును.

తిక్కన రచన అట్టిది కాదు. భారతము మహాకావ్య మన్న భావనలో ఆతని కవిత్వము నడచినది. ప్రభుసమ్మిత మైన వేదముగాఁ గాక సుహృత్సమ్మితమైన పురాణముగాఁ గాక కాంతాసమ్మితమైన కావ్యముగాఁ జేసి తిక్కనామా త్యుఁడు భారతమును తెలుఁగునకుఁ దెచ్చెను. పదునైదు పర్వములను ప్రబంధమండలిగాఁ జేసి కర్తవ్యాకర్తవ్యోప దేశమును సరసమార్గములోఁ గలిగించుచు ప్రవృత్తినివృత్తు లను విధినిషేధ వాక్యములను నడుమ నడుమ మెలకువగాఁ జూపుచు రచనలో తెలుఁగు జాతీయత రంగరించి మహా కవిత్వ దీక్షావిధిలో గద్యపద్యాత్మక కృతిని గావించి తిక్కన, ఆంధ్రావలికి భారతామృతమును బంచియిచ్చెను.

నిర్వచనోత్తర రామాయణ రచననాటికే ప్రౌఢమైన తిక్కన కవితాఫక్కి, విరాట పర్వములో వీనులవిందై ఉద్యో గములో హృదయరంజకమై యుద్ధపంచకములో రస సంబ

ద్ధమై శాంత్యాదులలో చల్లనై ఆంధ్రావలికి మోదమును గూర్చెనన్న అభిజ్ఞుల తీర్పులో అతిశయోక్తి లవ్వంతయు లేదు. రాజసేవామర్మములలో స్వానుభవమును లోకానుభవమును జతగూర్చి రాజకీయములను జక్కఁగా తిక్కన వర్ణించెను.

నన్నయ్య తిక్కన్న లుభయులు ఉభయుల మార్గములో సిద్ధహస్తులైరి. మూఁడవమూర్తి ఎఱ్ఱన్న అన్నింటను ఇర్వ్వురకు ఈడుజోడయ్యెను.

ఈ కథ ఇట్లుండఁగా వర్తమానసంఘములో ఉద్గ్రంథములు చదువుటకే తీరిక చిక్కదు. ఆర్థికదృష్టిమూఁది మోజువలన పారమార్థికబుద్ధి సన్నగిల్లినది. ఇట్టి గ్రంథములజోలికిఁ బోవుటలో కష్టమున్నమాట నిజమే. ఏవేవో 'తాత్కాలిక భావములను' ప్రకోపింపఁజేయు వినోదకథలజోలికి పోవునంతటి వేగముగా ఈ పూర్వగాథల జోలికి బుద్ధి పోనేరదు. పైగా-ఇట్టి గ్రంథములను జేతఁబట్టెడివారిని వట్టి 'ఛాందసులు' గా భావించు 'ప్రబుద్ధులు' సైత ముందురు.

అయినను యావద్భారతమునకు రాజకీయమగు ముక్తి ప్రాప్తించుటే గాక తెలుఁగువారికిసైతము ఒక 'స్వత్వము' దక్కి జాతీయత చవిచూడను స్వాతంత్ర్యసౌఖ్యమనుభవింపను 'ఉపాధి' చిక్కినది కావున తెలుఁగుబిడ్డలు తెలుఁగు సాహిత్యములోని సారస్యమును జక్కఁగా అవగాహము చేసికొందురని ఆశింతును.

తిరికనుబట్టి 'కనీసము' ఈ క్రింది కథలనైన జదివి అందలి విశిష్టతను గుర్తింతురని ఎంతును.

నన్నయ చేతిలో వన్నెకెక్కిన ఘట్టములు

1. జనమేజయుని సర్పయాగము
2. యయాతి చరిత్ర
3. దుష్యంత చరిత్ర
4. కుమారాస్త్ర విద్యాభ్యాసాదికము
5. ధర్మజుని రాజసూయము
6. కౌరవపాండవుల ద్యూతవ్యవహారము
7. నలోపాఖ్యానము
8. నహుష ప్రశ్నలు

ఎఱ్ఱాప్రెగడ పలికినవి

1. ధర్మవ్యాధుని కథ
2. సత్యా ద్రౌపదీ సంవాదము
3. సైంధవుని దుశ్చేష్టలు
4. రామాయణ వృత్తాంతము
5. సావిత్రి గాథ
6. యక్షప్రశ్నలు

ఇఁక-తిక్కన కృతులలో ఆతని నోటితోఁ జెప్పిన 'విరాటము' ఆద్యంతము కావ్యరీతిగా మధురాతిమధురము. అందును ముఖ్యము 'కీచకఘట్టము' అది యొక విషాదాంత మయ్యు మఱొక విధముగా మోదాంతమైన మహాకావ్య ముగా పరిఢవిల్లినది.

రాజకార్యదక్షుఁడైన తిక్కన్న చేతిలో మెలఁగిన 'ఉద్యోగపర్వము' సర్వము చదువఁదగినదే; కాదు కాదు. కంఠతఃవల్లింపఁదగినది. కావరములు-కొట్లాటలు - ఎత్తులు -

పై యెత్తులు ముగిసి యుద్ధములో మునిఁగినపిదప సర్వసంక్షో భము జరిగిన వెనుక ప్రశాంతబుద్ధిని ప్రసాదించినవి 'శాంత్యానుశాసనిక పర్వములు.' అందును భీష్ముని ధర్మోపదేశములు – ధర్మజుని ధర్మనిష్ఠ వన్నె కెక్కిన ఘట్టములు.

ఈ తీరుగ మహాభారతము సవిమర్శముగా సర్వకాలము చదువఁదగియున్నది. నిన్న చదివి నేఁడు పాఱవేయవలసిన 'వాఙ్మయము' లో 'భారత-భాగవత-రామాయణములు' చేరవు. అవి నిత్యనూత్నములు. వానిలోని గాథలు మన జీవితగాథలతో పెనవైచుకొని కానరాని విచిత్రమైన ఒక 'ఆత్మీయత' కలిగియుండును. మన 'అన్నదమ్ములే' అందును ఉందురు. మనవంటి 'ఆలుమగలే' అందును గాన వత్తురు. మనజీవితములే మన రాజకీయములే మన పార మార్థికములే అందును ప్రతిబింబించుచుండును.

వానిని జక్కఁగాఁ జదివి మన 'జీవితములను' నెమరు నకుఁ దెచ్చుకొని వివేకమును సంపాదించుకొనుటయే మన విధ్యుక్త ధర్మము.

[1958 ఆగస్టు]

కౌరవ్య లనఁగా ధార్తరాష్ట్రులని లోకములో వ్యవహారము కలదు. సంస్కృతములో భట్టనారాయణ కవికూడ తన 'వేణీ సంహారనాటకము' లో 'కౌరవ్యాః పశవః' అని భీమునిచే ధార్తరాష్ట్రులనుగూర్చి పలికించెను. నిజము చూడఁగా-ఉభయులును కౌరవులే. తాను బ్రదికియున్నంతదాఁక కౌరవ సామ్రాజ్య మంతయుఁ దనచేతిలో ఉన్నదికావున దుర్యోధనుఁడు కురుదేశసమ్రాట్టుగా పేరు పొందెను. పైగా - 'రారాజు' అన్న రూఢినామము లోకములో ఆతనికే దక్కినది. వాని యనంతరము ఆ దేశమునకు చక్రవర్తి-ధర్మరాజు. కౌరవపాండవు లుభయుల వంశము లౌకికముగా ఎట్లున్నను శాస్త్రధోరణిలో చంద్రవంశ మనిరి. భారతము చంద్రవంశ్యుల గాథ; రామాయణము సూర్యవంశ్యుల కథ. భారతదేశములో ఈ రెండే రెండు ప్రసిద్ధక్షత్రియవంశములని చెప్పుకొందురు.

చంద్రవంశ్యులైన పాండవులగాథ చంద్రవంశ్యుఁడైన రాజరాజనరేంద్రునకు మిక్కిలి నచ్చినది. పాండవ ప్రపౌత్రుఁడైన జనమేజయునకు తన తాతముత్తాతల గాథ వినవలెనని కోరిక కలుగఁగా-ఆతనికి సంప్రీతిగా వేదవ్యాసుఁడు ఈ గాథ వినిపించెనఁట. చాళుక్యులలో పేరువొందిన రాజరాజునకు సైతము తెలుఁగులో ఆ గాథ వినవలెనని కోరిక కలిగెనఁట.

భారతశ్రవణమువలన బహుయాగములు చేసినంత ఫలితము దక్కునని అప్పటివారి నమ్మకము. పైగా-రాజరాజునకు వైదికమతమును ఉద్ధరింపవలెనని సంకల్పము గలిగెను.

సంస్కృతభాషలో ఎంతగా ప్రచురప్రచారముచేసినను వేదవాఙ్మయ మెంతగా వినిపించినను తెలుఁగు ప్రజలకు ఆ వైదికతత్త్వము అంతగా మనస్సునకుఁ బట్టదు; రుచింపదు. ఈ మెలకువ గమనించియే ఆ నాఁడు బుద్ధుఁడు సైతము పూర్వాచారమును సడలించి ప్రజాసామాన్యమునకు అందు పాటుగ ప్రాకృతభాషలో తన మతమును ప్రచారముచేసి విజయము పొందెను. ఆ చూపుతో-తెలుఁగునేలలో సాగిన వైదికమతప్రచారమునకు 'భారతాంధ్రీకరణ మహాకార్యము' మొదటి సాధనమైనది.

రాజరాజు చూపిన ప్రోత్సాహముచే-ఈ రంగములో మున్ముందుగ ముందునకు వచ్చినవాఁడు నన్నయ భట్టారకుఁడు. వానికి వానికి గాఢతరమైన సంబంధ మున్నది. ఆతఁడు ప్రభువు; ఈతఁడు కులబ్రాహ్మణుఁడు. ఆతఁ డొక స్వతంత్రుఁడైన మహారాజు. ఈతఁ డొక జపహోమతత్పరుఁడైన మహావ్యక్తి. ఉభయులకు మాతృభాష తెలుఁగు. తెలుఁగులో సాగిన ఈ మహాకావ్యము తెలుఁగుప్రజలకు మిక్కిలి యక్కఱకు వచ్చునని ఇర్వురయు సంకల్పము. ఆ సంకల్పమువలననే తెలుఁగు వారికి తెలుఁగుభారతము ఒక దివ్యమైన నిక్షేపముగా పరిఢవించినది. తెలుఁగువాఙ్మయములో - ఏ మహాకవికిని దక్కని మహాభాగ్యము నన్నయభట్టారకునకే దక్కినది. నన్నయను విడిచిన తెలుఁగు తెలుఁగు కాదు. ఆతఁ డొకవంక 'భట్టార

కుఁడు'. మఱొకదృష్టిలో 'ఆదికవి'. వేఱొక ధోరణిలో 'విపుల శబ్దశాసనుఁడు.'

కావ్యము విశ్వ్రశేయము గూర్చునని నన్నయ్య సిద్ధాంతము. సర్వధర్మములకు కేంద్రమైన మహాభారతము తెలుఁగు జాతికిఁ దెలియునట్లు వ్రాసినచో సర్వ్రశేయము కలుగునని నన్నయభట్టు భావించెను. అందును వైదికమతప్రచార మొక యెత్తు; దేశ్యభాషలో కొంగ్రొత్తగా మహాకావ్యము నిర్మించుట మఱొకయెత్తు. ఈ భారము సామాన్యము కాదు. ఇందు ఎంతో పరిశ్రమ కావలెను. గాసట బీసటగా నున్న తెలుఁగు కవిత్వములో గారవము సమకూర్చు ఉత్తమరచన సాగింప వలెనన్న ఎంతో 'సాధన' యుండవలెను. ధర్మ్రప్రధానమైన భారతమును ధర్మము జాఱిపోకుండ కథారూపముగ తెలుఁగునకుఁ దేవలెను. కథారచన హృదయరంజకముగా నున్నప్పుడే ఆ ధర్మములు బోధపడును. కథాకథనములో కవితాశిల్పము చక్కఁగా నున్నప్పుడే - అది రసికజనభోగ్యమై నిలుచును. పైగా-ప్రాకృతప్రజలకు పురాణశ్రవణముగా అది పనికి రావలెను. ఇన్ని యంశములలో మెఱుఁగులు ఉన్నవాఁడే ఆ 'రచన' మహాకావ్యమై నాలుగుకాలాలు బ్రతుకును. అట్టి మహాకావ్యములలో ఆంధ్రమహాభారతము అగ్రేసరము. అట్టి మహాకవులలో నన్నయభట్టారకుఁడు అగ్రగణ్యుఁడు. అందువలననే ఆతఁడు 'ఆంధ్రకవిత్వ విశారదుండు - విద్యాదయితుండు' నై కవితాప్రపంచములో కలకాలము నిలువఁగలిగెను. ఆతని కవిత్వవిశారదత్వ మేమో ఇంచుకంత చర్చించి చూతము. ఆతఁడే తన రచనలో ముమ్మొదట తవ్వి

ఇట్లని వర్ణించెను.—

'ఉ. సారమతిం గవీంద్రులు ప్రసన్నకథాకవితార్థయుక్తి లో
నారసి మేలు నానితరు లక్షరరమ్యత నాదరింప నా
నారుచిరార్థసూక్తినిధి నన్నయభట్టు డెనుంగునన్ మహా
భారతసంహితారచనబంధురుఁడయ్యె జగద్ధితంబుగన్.'

ఈ వర్ణనలో ఉన్నట్లే అక్షరాల ఆతనిరచనలో ఈ సుగుణము లన్నియు స్పష్టముగాఁ గన్పట్టును. ఉక్తి వైచిత్రి-శబ్దమాధుర్యము-కథాకథననైపుణ్యము నన్నయ కవిత్వము నకు వన్నె తెచ్చిన సుగుణములని ఎందఱో విమర్శకులు తీర్పు చెప్పిరి.

విశేషమైన పదరచనకే 'రీతి' యని పేరు. ఆ రీతిలో 'మాధుర్య-సౌకుమార్యము' లను విశిష్టగుణము లున్నచో ఆ కవిత్వము మిక్కిలి హృద్యమై రసికజనులను మెప్పించును. కవికులగురువైన కాలిదాసమహాకవి గడించిన ఘనతకు అట్టి విశిష్టరచనయే బీజము. అట్టిరచన-అట్టి ప్రసన్నత తెలుఁగు సాహిత్యములో నన్నయ్యకు దక్కినట్లు మఱెవ్వరికిని దక్క లేదు. తెలుఁగులోనే కాదు; సంస్కృతములో సైతము వాల్మీకి-కాలిదాసులపజ్జను గద్దె నెక్కఁగల యోగ్యత నన్న య్యకుఁ గద్దు. తత్సమరూపముగా వెలసిన సంస్కృతభాషా సౌందర్యమును నన్నయకవితలో వేఱుచేసి పరిశీలించినచో-పెక్కుమంది గీర్వాణకవులే నన్నయకు తరువాతిశ్రేణిలోనే ఎన్నికకు వత్తురు.

వృత్తములలో బారెఁడేసి సంస్కృతపదములు ఉప యోగించినను విసువు కలిగింపని రచన నన్నయ్యది. సంస్కృత

వాఙ్మయములో సమస్తపదముల ఆర్భాటము పద్యకావ్యము లలో అంతగాఁ గానిపింపదు. ఆ యాడంబర మంతయు మంచికో చెడ్డకో తెలుఁగు కవిత్వములోనే అవతరించినది. ఒక్కగానొక్క మూఁడక్కరముల తెలుఁగుక్రియను వేసి పద్య మంతయు సంస్కృతసమాసభూయిష్ఠముగ నడపించిన రచనలు తెలుఁగులో ఎన్నో యున్నవి. అందువలన తెలుఁగు సాహిత్యము సుష్ఠుగా-అర్థము కావలెనన్న సంస్కృతభాషా సంప్రదాయము లెస్సగాఁ దెలిసియుండవలసిన పరిస్థితి కలిగినది. అనఁగా సంస్కృతభాష నేర్వనివానికి తెలుఁగులో బండి సులువుగా నడువదని భావము. ఇంచుమించు ప్రబంధకవు లందఱు ఉభయభాషలలో ఆరితేఱిన దిగ్దంతులే యన వచ్చును. వారిరచనలు సంస్కృతకావ్యములకు ఏమాత్రము తీసిపోవని రసగుళికలు.

నన్నయ రచనస్థైతము సంస్కృతపదభూయిష్ఠమయ్యు అది యొక వింత చెలువము గూర్చుకొని హృద్యమై యుండును. అది గుర్తించియే, ఆతఁడు చెప్పినట్లులే ఆతని రచనకు 'అక్షర రమ్యత' ప్రధానలక్షణమని విమర్శకులును నిర్ణయించిరి. పద రచనలోని విశిష్టతయే 'అక్షరరమ్యత' యన వచ్చును. పద రచనకు ప్రాచీనులు 'బంధ' మని పేరు పెట్టిరి. దాని గుణ ములే-ఓజస్సు మున్నగునవి. ఓజస్సు-ప్రసాదము-సమత - మాధుర్యము - సౌకుమార్యము - కాంతి, అన్నవి రచనకు రాణింపు తెచ్చు గుణములు. నన్నయ రచనలో ఈ గుణములే సార్వత్రికముగాఁ గానవచ్చును.

'వందితసూర్యరశ్మిరుచివన్మణిహారచయంబుతోఁ గట
స్యందిసుగంధిదానజలసంపద నొప్పెడువాని దేవకీ
నందనుఁ డిచ్చోఁ బ్రీతిఁ బదునాలుగువేలు గజంబులన్ జనా
నందనకీ ర్తియైన యవనాథతనూజన కిష్టమిత్రుఁడై.'

సభా. 2.111 ప.

ఈ 'నడక' నన్నయది. ఇదియొక భద్రగజము నడచి నట్లే మనస్సునకుఁ దోఁచును. ఇందలి పదములలో కావలసి నంత మాధుర్య మున్నది. అక్షరములలో పారుష్యమే కాన రాదు. దీనినే 'సౌకుమార్య' మను గుణముగా ఆలంకారి కులు పేరొక్కందురు.

'అవనీనాథు లనేకులుండఁగ విశిష్టారాధ్యు లార్యుల్ మహీ
దివిజుల్ పూజ్యులు పల్వురుండఁగ ధరిత్రీనాథ ! గాంగేయ దు
ర్వ్యవసాయంబునఁ గృష్ణుఁ గష్టచరితున్ వార్ష్ణేయుఁ బూజించి నీ
యవివేకం బెటిఁగించి తిందఱకు దాశార్హుండు పూజార్హుఁడే!

సాగరసారవారిరుహశ్రీ క్తికముక్తికవిద్రుమద్రుమై
లాగురుచందనంబులు ప్రియంబున నిచ్చిరి తెచ్చి యున్నత
శ్రీగుణయుక్తమైఁ బరఁగు సింహళకేరళచోళపాండ్యదే
శాగతరాజపుత్త్రులు మహాగుణశాలికజాతవైరికిన్.' [సభా]

ఈ పద్యములలో అక్షరసౌభాగ్యము మేలయిన ఒయ్యారము గల శయ్య చక్కఁగ వ్యక్తమగుచున్నది. ఈ కవిత్వమునకు ప్రసన్నతను గూర్చిపెట్టిన పదములు సంస్కృత పదములు. వీనినిబట్టియే నన్నయకవిత్వమునకు 'మార్గపద్ధతి' యని పేరు పెట్టిరి.

నన్నయ పద్యమే గాదు. గద్యముసైతము విశిష్టమైనది.

తెలుఁగు సాహిత్యములో ఒండురెండు దక్కఁ దక్కినవన్నియు 'చంపూకావ్యము' లే. వానినే మనము పద్యకావ్యములని వ్యవహరింతుము. గద్యము లేని పద్యకావ్యములు హెచ్చుగా లేవుగాని, ఆ గద్యముకూడ గుణములో పద్యములోనే చేరును. కవిత్రయమువారిలో విశిష్ట-నన్నయగద్యలో ఒక హుంకారాతన మున్నది.

వ. 'ఇట్లు దనవలన విలువిద్య గఱచిన పాండవ కౌరవ కుమారులంజూచి ద్రోణుండు నా కవమానంబుసేసిన యప్పాం చాలు నోడించి పట్టుకొని తెండు. ఇదియ నాకు గురుదక్షిణ యగునని పంచిన వల్లెయని యందఱు నాద్రుపపయిం బోయి వానిచేత నిర్జితులయిన నర్జునుండు ద్రుపదుతోడ మహా యుద్ధంబు సేసి వానింబట్టికొనివచ్చి ద్రోణున కొప్పించిన నతండును.' [ఆది. 7. 6 వ.]

ఇది యించుమించు వేయియేండ్లక్రిందటి వచనరచన. నాఁటికి నేఁటికి నన్నయ, వచనరచన చేసినట్లు మఱెవ్వారు చేయలేదు. ఒక్క 'చిన్నయ్య' మాత్రమే ఆ శయ్య నందుకొనెను. దాని సౌరభ మెఱిఁగిన చతురుఁడు కావుననే చిన్నయసూరి తన లక్షణగ్రంథములో పెక్కింటికి నన్నయ పదములనే లక్ష్యములుగా ఇచ్చియున్నాఁడు. తన వచనకావ్యమును సైతము ఆ త్రోవలోనే నడపించి ఆధునికవచన వాఙ్మయబ్రహ్మ అని పేరు గడించెను.

నన్నయ కవితారచనకు ఇది దిక్సూచి. శబ్దార్థగాంభీర్యములకు కావ్యగౌరవముతోఁ గూడిన పురాణశయ్యకు శిశుపాలకథాఘట్ట మంతయు మంచి తారాకాణ. కవితా

తపస్సు చేసి కావ్యరచన కావించి వైదికమతోద్ధరణకై కవి త్రయమువారు దీక్ష వహించిరి. ఆంధ్రభాషా స్వభావమునకు ఆంధ్రసభ్యతాస్వరూపమునకు ఆంధ్రమహాభారతమే శాశ్వత నిదర్శనమని ఎంద రెందరో విజ్ఞులు నిరూపించిరి. అట్టి విశిష్టమైన 'తెలుఁగుభారతమున' కు పునాది వేసినవాఁడు కావున నన్నయభట్టారకుఁడు తెలుఁగు సాహిత్యములో ఆదికవి అయ్యెను. ఆతని ప్రసన్నకవిత్వమే యావదాంధ్రులకు ఆదర్శమయ్యెను.

[1958 — మే]

తిక్కన ప్రకృతివర్ణనము

ప్రాసిన ప్రాఁతలో పలికిన పలుకులో వైచిత్రి లేనిచో - అది వ్యావహారికముగా పనికివచ్చునుగాని కవితాశిల్పముగా సాహితీకళగా రాణింపనేరదు. పద్యముగాని గద్యముగాని హృద్యముగా నుండవలెనన్న-అందు ఉక్తివైచిత్రి ముఖ్యముగా నుండవలెను. ఆ వైచిత్రియే సమయమునుబట్టి 'వర్ణనగా'-'అలంకారములు'గా శోభిల్లును. అలంకారములు-వర్ణనలు, కేవలము ఒంటిమోఁది నగలవంటివే కావు. వానిలోని యౌచిత్యమునుబట్టి ఆ రచనకు ఒక విశిష్టత కలిగి మధురాతిమధురముగ పరిఢవించును.

'ఇట్టివి కావ్యాలంకారములు-ఇట్టివి అష్టాదశవర్ణనలు' అని కావ్యప్రపంచములో ఆలంకారికులు నిర్ణయించి ఒక శాస్త్ర మేర్పఱిచిరి. శాస్త్రముప్రకారము సూత్రముపట్టినట్లు వర్ణనలు చేసి అలంకారములు పెట్టి పాఠకులను విసిగించిన కావ్యములు తెలుఁగులో సంస్కృతములో ఎన్నో యున్నవి. కాని, ఆ వర్ణనలకు ఔచిత్యము చొప్పించి ప్రకృతవస్తువుతో మేళవింపఁజేసి రంజింపఁజేసినవాఁ డొందఱే కలరు. వారిలో సంస్కృతములో 'కనిష్ఠికాధిష్ఠితులు' గా కాలిదాసు, తెలుఁగులో తిక్కనయు పరిగణింపఁబడిరి.

తిక్కన రచనలోఁగూడ తిక్కన భాగము లొకయెత్తు; 'విరాటము' మఱొకయెత్తు. అందును విశిష్య-కీచకఘట్టము

కావ్యముగా మిక్కిలి హృద్యముగా రాణించుచున్నది. అది యొక స్వతంత్రప్రబంధముగా పరిగణింపఁదగియున్నది. ప్రబంధమున కుండవలసిన 'హంగు' లన్నియు 'కీచకవధ'లో మనోహరముగాఁ గానవచ్చును. ఈ దృష్టితో పరిశీలించితిమేని 'ప్రత్యేకప్రబంధము' లని పేరువడిన 'మనుచరిత్రా'దులే కీచకఘట్టముముందు నాసిగై తేలిపోవును. అనఁగా వస్తైక్యములో పొందికగానీ నాయకప్రతినాయకుల స్వరూపనిరూపణముగానీ రసాభ్యుదయముగానీ వర్ణనలుగానీ పాత్రౌచితిగానీ ఈ ఘట్టములో ఉన్నట్టుగా తెలుఁగులో ఏ ప్రబంధములోను లేవనుట నిర్వివాదము. ఈ యంశము లన్నింటిలో ప్రకృతముతిక్కన చేసిన 'ప్రకృతివర్ణన' మాత్రము పరిశీలింతము.

సంస్కృతకావ్యములలోని 'వర్ణనలు' ఏ వాఙ్మయములోను లేవని ఎందఱో ప్రాజ్ఞులు నిర్ణయించిరి. ఆ వర్ణనాభాగమే ఒక 'శాస్త్రము'గా సిద్ధమయినది. ఆ శాస్త్రమే తెలుఁగునకును పునాదిగై ప్రోది కావించినది. దానిపై నిర్మించిన మహాకావ్య సౌధము లెన్నో తెలుఁగులోఁ గలవు. అలంకారశాస్త్రమునుబట్టి వర్ణనావైచిత్రినిబట్టి వసుచరిత్రాది మహాకావ్యములకు ఉన్నతస్థానమే యున్నది. కాని, కాలిదాసుఁడో లె ప్రకృతివర్ణనలో మిక్కిలి నేర్పు చూపిన తెలుఁగు మహాకవి ఒక్క తిక్కన్నసోమయాజియే యనవచ్చును. సూర్యోదయముగానీ, సూర్యాస్తమయముగానీ ఈతని కవితలో కథను, విడిచి నడువవు. అసలు కథకు-ఆ వర్ణనాభాగము అంకితమై ఒకానొక యౌచిత్యమును దెచ్చిపెట్టును. తిక్కన కవులు తాము వర్ణించు కథాభాగమును కొంతసేపు ఆఁపి,

గ్రుక్క పట్టినట్టులు వర్ణనాఘట్టములకుఁ బోయి కొంత వినువు కలిగింతురు. ఆ ఘట్టములలో వైచిత్రియు ఒక విశిష్టతయు ఉండవచ్చునుగాని, తిక్కన చూపెడి చాతుర్యముమాత్రము వారికవితలో అంతగాఁ గానరాదు.

అక్కజమైన చెల్వము గల ద్రౌపదిని గాంచి దుర్విదగ్ధుఁడగు కీచకుఁడు ముగ్ధుఁడై చేయవలసిన ప్రయత్నములను జేసెను. తమ్ముని ఔద్ధత్యమునకు జంకియే సుదేష్ణ, సైరంధ్రిని కీచకునియింటికి కల్లు తేరఁబంచెను. అచ్చట కీచకుఁడు చేసిన ముచ్చటలు-వాని బారినుండి ద్రౌపది తప్పించుకొన్నతీరు-విరాటుని కొలువుముందు ఆమె చేసిన అభియోగము-సుదేష్ణ కావృత్తాంతము నివేదించియు నిరుత్సాహపడిన ధోరణి-భీముని సన్నిధిలో సర్వము విన్నవించు వైఖరి-ఆమె భంగపాటు ఆద్యంతము వర్ణించినపిదప భీముని హెచ్చరికచే ద్రౌపది తన నిద్రించుచోటికిఁ బోయి పర్యంకభాగమున తనువు వైచెను. కనుదోయి మొగిడ్చినను ఆమెకు నిదుర పట్టదు. ఇందఱు భర్తలు ఉద్దండులుండియు ఇట్టి పరాభవము పొందవలసివచ్చెనే యని పరితపించు ఆ యిల్లాలిని ఒక్క భీముఁడే ఇంతవఱకు ఊఱడించెను. ఆపై-ఆమె విషయమయి ప్రకృతికూడ కనికరించెనఁట :—

‘ద్రుపదనందన పరిభవదుఃఖమునకు
నుల్లమున దురపిల్లుచు నున్న సరసి
వేఁడినిట్టూరుపో యన వెడలెఁ గ్రొత్త
తావిమూతులు విచ్చు నెత్తమ్మినిరుల.’

ద్రౌపది పరాభూతికి ‘సానుభూతి’ గా ‘సరసి’ కూడ

ఉల్లములో దురపిల్లుచు వేఁడినిట్టూర్పులు విడిచెనఁట.

కామవికారమున కగపడిన కీచకుఁడు ఉద్యానవన
ములో విహరించు ఘట్ట మంతయు ప్రకృతి వర్ణనలతో
దండిగా నిండి తిక్కన నేర్పును మిక్కిలిగాఁ జూపుచున్నది.

'ఇంపైనప్రియ కాన నిచ్చి నిల్చిన మధు
వాదట నాను మత్తాలివిభుని
జెట్టుపల్ పచరించి చుట్టుఁ గ్రుమ్మరి మనో
రమ నియ్యకొలుపు మరాళవిభుని
ఫలరస మొండొంటి కెలమిఁ జంచుల నిచ్చు
మెయిన చొక్కెడు శుకమిథునములను
గమిఁ బాసి తలిగుజొంపమునకు మెయిమెయిఁ
దాఁకంగఁ జను పికదంపతులను
జూచిచూచి యుల్లంబున నేచి కోర్కి
లడరఁ జిడిముడిపడు ప్రూనుపడు వెడంగు
పడు నెనుంబడుఁ దల్లడపడు దురంత
చింతబారికి నగపడు సింహబలుఁడు.'

ఒక్కచోటనయినను కాలూఁదక లీలోద్యానము కలయఁగ్రుమ్మఱు కీచకుని వలవంతకు దోహద మిచ్చిన ఘట్ట మిది. అందలి గండుఁదుమ్మెదలు మరాళరాజములు చిలుకల జంటలు కోకిలదంపతులు వాని వాని 'సరసము' లచే కీచకుని యుల్లమునకు పెల్లుగ బాధ కలిగించినవఁట. ఆ పక్షులకు ఆ జంటలకు ఉన్న సౌఖ్యముకూడ తనకు దక్కలేదే యని కీచకుఁడు ఆ దశలో వగచినట్లు స్ఫురింపఁజేయుట – అది యొక అద్భుతమైన కవితాశిల్పము.

సైరంధ్రిమాట నిజమని నమ్మి సంకేతవేళకై కీచకుఁ డెదురుచూచును. ఆ దశలో వానికి 'మాయరవి' ఎంత సేపటికిని గ్రుంకఁడాయె. అచ్చముగా 'పగలే' కాని 'రాత్రి' రాదనియే వాఁడు భ్రాంతిపడెను. పర్యంకములో పవ్వళించి వంత తలపోసి వందుగి పొగిలి విషమబాణునిబారిఁ బాఱెనఁట. తుది కెట్లో 'దివసనాథుఁడు' క్రుంకెను.

కం. 'ఇనుఁడు దనకడకు నేతెం
చిన రాగముఁ బొందుటది యుచితమనఁగాఁ గెం
పున మెఱసి పశ్చిమాశాం
గన జనసంభావనముల గౌరవ మందెన్.'

ఉ. చుక్కలు తోడుతోడఁ దల చూపఁదొడంగె మనోభవుండు వి
ల్లెక్కిడి చక్రవాకముల యిక్కలు రోయఁగఁ జొచ్చె నేల కెం
పెక్కుచు వచ్చె దీవియల యేడ్తెఱ సోయగ మందె సందడుల్
దక్కిఁ బురంబువీథుల మదం బొలపెఱ్ఱ విటచిత్తవృత్తులఁ.

కం. పెనుమి ట్రొది పల్లం బిది
యనకుండఁగ నోలమును బయలు నొక్కటిగాఁ
గనువిచ్చుటయును మోడ్చుట
యును సరిగాఁ దమము పర్వె నుర్విం దోడ్తోఁ.'

పశ్చిమదిశ-ఒక యంగనయఁట. ఆమె ప్రియ సమాగమముచే రక్తిమ పొందెనఁట. ఇట 'పశ్చిమాంగన జనసంభావనముల గౌరవ మందిన'దన్నమాటలో ద్రౌపదీభీముల సమావేశము తత్ఫలితము ధ్వనించును. మఱొకవంకను వియోగబాధలో మునిఁగిన కీచకునకు సూర్యాస్తమయము కొంత సహాయపడినట్లు స్ఫూర్తి. ఈ దశలోని నక్షత్రోద

యము – నేల కెంపెక్కుట, ఇత్యాదు లన్నియు అత్యంత హృద్యములై ప్రకృతకథకు రామణీయకతను దెచ్చుచున్నవి. సంకేతసమయము సమీపించుటచే కీచకుని మన్మథోద్రేకము రెచ్చిపోయినది. ఒరులకుఁ దెలియనితీరులో నర్తనశాల కాతఁడు వెళ్ళవలసియున్నది కాన చీఁకట్లు క్రమ్మవలెను. వీధులలో సందడి తగ్గవలెను. ఇచ్చట వర్ణితమైన తమస్సు కేవలము మన మనుకొను భౌతికమైన చీఁకటియే కాదు. నీచుఁడైన కీచకుని తమోగుణము సైతము స్ఫురింపవలెను. 'పెను మిట్టిది పల్గంబిది' – అనుటలో కేవలము నేలలోని నిమ్నోన్నతములే కాదు; జ్ఞానము అజ్ఞాన మనియు దాని ధ్వని. ఇదే ఘట్టములో నడచిన ఈ వచనములోని విశేషములు విందము:—

వ. 'ద్రౌపదీ రమణుఁడు నాట్యశాలకుం జని వివేక రహితు హృదయంబునుంబోలెఁ దమోదూషితంబును విదగ్ధ వనితా ప్రేమంబునుంబోలె దుర్నిరూపంబును ఘోరాటవీ భాగంబునుబోలె నిర్మనుష్యంబును గాపురుషలక్ష్మీవిలాసంబు నుంబోలె ననుపయోగ్యంబును ననభ్యస్త శాస్త్రంబునుం బోలెదుర్గమంబును స్వప్న లబ్ధ పదార్థంబునుంబోలె నదృష్టి గోచరంబును విషమకావ్యంబునుంబోలె నస్పష్టాలంకారం బును బాలిశరాజ్యంబునుంబోలె జారచోరహృద్యంబు నైన యా నర్తనాగారంబు ముఖభాగస్థలంబు సేరి.'

నర్తనాగారముఖభాగము వివేకరహితుని హృద యమువోలె తమోదూషితమై యున్నదఁట. అక్కడ చీఁకట్లు క్రమ్మిన వనియు ఇదమిత్థమని నిరూపింపరానిదయ్యె ననియు

మనుష్యసంచారమే లేనిదనియు ఉపయోగ్యము కానిదనియు చుర్గమ మనియు దృష్టిగోచరము కానిదనియు జారచోరుల కింపు నింపు ననియు కథారూపముగ మనకు ఆ భాగము బోధపడుచున్నది. ఇక – ఇందలి 'ధ్వని' అతి విచిత్రము. ఈ ధ్వనిలో పాత్రల స్వరూపస్వభావములు చిత్రితములైనవి.

మొదటిమాట-కీచకుడు 'వివేకరహితుడ'ట. ద్రౌపది 'విదగ్ధవనిత'యట. విరాటనగరము 'ఘోరాటవి' వంటిదట. వానికి వివేకమే యున్నచో తమోగుణమే అంటియుండదు. ఆమె విదగ్ధవనితకావుననే ఇట్టి యాపదలోనైతము గట్టెక్కి తీరును. పైగా ఆమె వైదగ్ధ్యమువలననే ఆమె పన్నిన మాయాప్రేమవాగురలో ఆ మూఢుడు చిక్కినాడు.

ఆ. 'ఇట్టు లగుట యెటేగి యెల్లభంగుల రహ
స్యంబు గోలుపోనియట్లుగాగ
నడరు నీదుకోర్కి కనురూప మెట్టిది
యట్టి భోగభంగి ననుభవింపు'

నీకోర్కి కనురూపమైన భోగమే అనుభవింపుమని ద్రౌపది అన్నమాటకు కీచకుడు హృదయమున పొంగి నీదయినపంపు చేయువాడనని విధేయత చూపెను. ఇదే నిశ్చయము; నీ వొక్కడవే అక్కడికి రావలెసుమా! లేకున్న అయ్యెడ నేను నిలువను. ఇక పొమ్ము. ఇంత తడ వేకాంతముగ మనము మాటాడరాదు. నాపని నేను జేసెదనని ద్రౌపది ఆతనికి సమయము – సంకేతని కేతనము నిర్ణయించిన దనగా ఆమె 'విదగ్ధవనిత' కాకుండు టెట్లు! నీదుకోర్కి కనురూపమైన భోగమనగా – అక్రమమైన

కోర్కె కోరిన నీకు మరణయు తప్పదురా అనియు సూచన. ఆ నగరము ఘోరాటవివంటిది కావుననే పట్టపగలు – ఆ సైరంధ్రికి దాపరించిన యాపదకు అడ్డుకొన్న నాథుఁడే కానరాలేదు. ఒకవేళ అక్కడక్కడ ఒక్కఁడో ఇర్వ్యారో ఉన్నను 'ఆటవికు'లు వోలె నిలిచి చూచిరేగాని తప్పని చెప్పలేకపోయిరి.

విరాటుఁడు కాపురుషుఁడఁట. ఆతని భార్య సుదేష్ణ, కాపురుషలక్ష్మి వంటిదఁట.

ఆదిలో – అజ్ఞాతవాసమునకు నివాసమును నిర్ణయించునపుడు—

'నాకుఁ జూడ మత్స్యనరపతి సద్ధర్మ
వర్తి సుజనహితుఁడవార్య బాహు
బలుఁడు గాన యతనిపాల నందఱుఁ దగ
వైన పనుల నిలుచు టభిమతంబు'

అని ధర్మనందనుఁడు భావించినది నిజమే. కాని, 'సద్ధర్మవర్తి' అని నమ్మి ఆశ్రయించిన విరాటుఁడు, కీచకుని యుద్ధతిచే ఈ దశలో 'కాపురుషుఁడే' కావలసివచ్చెను. అనఁగా – పరిపాలనకుఁ జాలని వట్టి మూర్ఖుఁడైపోయె నని తిక్కన భావము. అట్టి పురుషుని భార్యయైన సుదేష్ణ విలాసము ఈ తీరుగ 'అనుపయోగ్య' మగుటలో ఆశ్చర్యము లేదు.

'స్వప్నలబ్ధపదార్థ' మనుటచే, కీచకునకు ద్రౌపది కలలో దొరకిన వస్తువే సుమా! అని భావము. 'విషమ కావ్య' మన్నమాటచే కీచకకథలో 'రసాభాసము' కలదని సూచన. విరాటుని రాజ్యము బాలిశరాజ్యము కావుననే

ఆ పట్టణములో పరదారవ్యవహారము ఇట్టిదయ్యెనని సారాంశము.

ఈ తీరుగ తిక్కన, తాను చిత్రించుకథకు పోషకముగా 'ప్రకృతి వర్ణనా' రూపమున ఆవశ్యకములైన అంశములనే స్వీకరించి వానిని దన కవితాశిల్పములో అనుసంధించి తన్మూలమున పాత్రౌచితి పోషించి సహృదయరంజకము కావించి మహాకవి అయ్యెను.

[1958-ఫిబ్రవరి]

విరాటపర్వము - పాత్రౌచితి

సంస్కృతభారత మొక బంగారుముద్దగా- తెలుఁగు భారతము రత్నాలు చెక్కిన ఒక బంగారునగగా- పెద్దలు వర్ణింతురు. హైందవములో మతవిషయకముగా ప్రామాణికమైన గ్రంథత్రయములో 'భారత-భాగవతములు' వేదవ్యాసుని చేతిలో నడచినవి. 'రామాయణము' వాల్మీకుల సృష్టి. అఖిలభారతములో వీనికి అనువాదములు ఎన్నెన్నో వెలసినను, రామాయణమునకు 'తులసీదాసు రామాయణము' భారత భాగవతములకు తెలుఁగువారి 'భారత-భాగవతములు' ఈడు జోడైన అనువాదములని అభిజ్ఞులు నిర్ణయించిరి. అనఁగా- వాల్మీకమును బోలిన రామాయణకావ్యమును దేశ్యభాషలలో ఒక్కతులసీదాసు తక్కఁ దక్కినవారెవ్వరు రచింప లేదనియు, 'ఆంధ్రభారత-భాగవతములు' వోలె అనువాదములలో అత్యంతరమణీయమైనవి మఱి యే భాషలోను లేవనియు పిండితార్థము. కావునఁనే తెలుఁగులో 'కవిత్రయము వారికి బమ్మెరవారికి' విశిష్టస్థానమే దక్కినది.

సంస్కృతభారతము వేదవ్యాసరచితమని వ్యవహారమున్నను, ఆయాయికాలములలో కొందఱు తమతమ భావములను అభిరుచులను సిద్ధాంతములను అందుఁ దూర్చిరనియు, అవియే ప్రక్షిప్తములుగా పాఠాంతరములుగా సిద్ధమై భారతము మహాభారమైన గ్రంథముగా పరిణమించినదనియు

విమర్శకుల భావము. అవి యన్నియు సాకల్యముగా పరిశీలించి లభించిన మాతృకలను ప్రజ్ఞాచక్షువులచే సమన్వయించి, అక్కఱ పట్టినచోట మూలమును తగ్గించియు కుదించియు పెంచియు కవిత్రయమువారు తెలుఁగుభారత మును రచించిరి. కావునఁ దే తెలుఁగుభారతము, కేవలము అనువాదగ్రంథముగాఁ గాక ఒకానొక స్వతంత్ర కావ్యముగా వెలసి హృద్యముగాఁ గానవచ్చును. అందున-తిక్కనసోమ యాజి, పురాణధోరణిలో నున్న మహాభారతమును కావ్య ధోరణికి దించి తెలుఁగులో దీనికి మహోన్నతస్థానమును గలిగించెను. ఆతని యదృష్టము కలసివచ్చినట్లులు 'హరిహ ఓమ్మ'ని ఉపక్రమించిన 'విరాటపర్వము'-ఇతివృత్తమునుబట్టి సర్వాంగసుందరమైన ఒక మహాకావ్యముగా సిద్ధమైనది.

'కవివృషభులు మహాకావ్య' మని భారతమును వర్ణింతురని నన్నయభట్టారకుఁడు పలికెను. అందు-

'ఆదిఁ దొడంగి మూఁడుక్రతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్మ్యుఁడు నన్నయభట్టు దక్షతన్.'

మ. హృదయాహ్లాది చతుర్థ మూర్జితకథోపేతంబు నానారసా
భ్యుదయోల్లాసి విరాటపర్వ మట యుద్యోగాదులుంగూడఁగాఁ
బదియేనింటిఁ దెనుంగుబాస జనసంప్రార్థ్యంబులై పెంపునం
దుదిమొట్టఁ రచియించు టొప్పు బుధసంతోషంబు నిండారఁగన్.'

అని రచనాకౌతుకమున

మన మలరఁగ నీ ప్రబంధమండలి కధినా
థునిగా నే పురుషుని బే
రొకఁనువాఁడనో యను తలంపు గూరిన మదితోన్'

అని తిక్కనసోమయాజులు వచించిరి. ఆదికవి నన్నయ వ్రాసిన మూఁడుపర్వములు మూఁడుకృతులఁట. తాను వ్రాసిన పదునైదు పర్వములు 'ప్రబంధమండలి' యఁట. మహా కావ్యమన్నమాట, సంస్కృతభారతవిషయములో ఎట్లున్నను తెలుఁగు భారతములో విశిష్ట-తిక్కనరచనలో అక్షరాల నిక్కమని చెప్పవచ్చును. అనఁగా, కవితాసౌందర్యాదికములో సంస్కృతభారతమును మించినవి సంస్కృతవాఙ్మయములో 'వాల్మీకము' వంటివి కొన్ని కలవుగాని, తెలుఁగుభారతమును మించినవి తెలుఁగుసాహిత్యములో లేవని కంఠరవేణ చెప్పవచ్చును. కావుననే నాఁటికి నేఁటికి తెలుఁగుభారతమునకు అంత ప్రశస్తి దక్కినది. 'తింటే గారెలే తినవలె; వింటే భారతమే వినవలె.' అని గారెల రుచి ఎఱిఁగిన తెలుఁగువారు పలికిన ఆమెతవంటి ఈ సామెతకు తెలుఁగుభారతమే లక్ష్యము.

'కావ్యేషు నాటకం రమ్యం నాటకేషు శకున్తలా' అన్నట్లు తెలుఁగులో 'భారతము' రమ్యమైనది; అందును 'విరాటము' మఱింత హృద్య మనవచ్చును. అందువలననే తిక్కనమనీషి, విరాటము అత్యంతహృదయాహ్లాది యనియు, ఊర్జితకథోపేతమనియు మెచ్చుకొనెను. నానారసాభ్యుదయములో విరాటపర్వము పేరుపొందుటఁజేసియే ఆ భాగము తిక్కనామాత్యుని మిక్కిలిగా ఆకర్షించినది. ఇతివృత్తములోని యింపుసొంపులకు అనువగునట్లు వస్తైక్యము చక్కగాఁ గూర్చి, ఉపక్రమోపసంహారములలో ఒక యానుపూర్వి ఏర్పఱిచి, కథాభాగమున కన్నయించునట్లు ప్రకృతి వర్ణనాచాతుర్యమును పరిఢవింపఁజేసి భావప్రధానమై ధ్వని

పూరితమైన శబ్దప్రయోగము సంతరించి, కృత్రిమములు గాక సౌందర్యవర్ధకములుగాఁ గానవచ్చు అర్థాలంకారములను అద్భుతముగా సమకూర్చి, మార్గకవితలో దేశికవితలో 'ఉభయకవిమిత్ర' యనిపించుకొని కవిబ్రహ్మ తిక్కన్న గణుతి కెక్కెను.

పురాణధోరణిలో నున్న భారతకథను ప్రబంధముగా చిత్రించె ననుటకు 'విరాటభాగము' మంచి తార్కాణ. తెలుఁగులో విరాటము, ఒక నాటకముగా రసవంతమైన ప్రబంధముగా మధురమైన ఒకమహాకావ్యముగా ప్రతిపద్య మందును ప్రతిగద్యమందును ప్రత్యక్షరములోను ప్రత్యక్ష మగుచుండును.

సర్వాంగసుందరముగా ఈ భాగము కన్పట్టుటలో 'పాత్రౌచితి' యన్నది ఒకముఖ్యమైన సుగుణము. ఒక్క తిక్కన్నను విడిచి చూడఁగా, తెలుఁగులో ఈ యంశములో పెక్కు కావ్యములలో లోపము కానవచ్చునని అధునాతనులు కొంద అందురు. ఆ మాట ఎట్లున్నను, విరాటములో మాత్రము సర్వపాత్రలు మన కెదురుపడి చక్కఁగా పలుక రించుచున్నట్లు భాసించును. అదియే కవిబ్రహ్మ ప్రతిభ. దానినే ఇంచుకంత ఇచ్చట ముచ్చటింతును.

మత్స్యపతికి మఱుందియగు కీచకుఁడు, ఉద్యోగములో దండనాథుఁడయ్యు బలగర్వితుఁడయ్యు - అక్క సుదేష్ణకు ప్రమోక్కవలెనని అంతిపురికి వచ్చెను. మున్ముందు వ్యక్తము కానున్న వానివైఖరికి 'నాంది'గా తిక్కన్న ఇట్లని వానిని చిత్రించెను: - అతఁడు కీచకాగ్రజుఁడు; రూపాభిమాని; నానా

భరణధరణశీలుఁడు; దుర్వినగ్ధుఁడు. ఆపై-బలగర్వితుఁడు. పేరు సింహబలుఁడు.

అట్టి స్వరూపముతో స్వభావముతో ప్రవేశించిన, ఆ పాత్ర, నర్తనశాలలో మృత్యువువాతఁ జొచ్చునందాఁక పోయిన పోకడలు చేసిన చేష్టలు తిక్కనచేతిలో చిద్విలాసములై పరగినవి. వాఁడు వట్టి పామరుఁడు కాదు; 'శకారుఁడును' గాదు. మాసినవేషమే అయ్యు ద్రౌపదీలావణ్యము ఆతని హృదయమును ఆకర్షించినది. కౌంతేయుఁడు కావుననే కర్ణునివిూఁదఁగూడ ద్రౌపదికి మనస్సు పోయినట్లు బలపరాక్రమాదికములో భీమునకు 'ఉజ్జీ' అగుటచేతను భీమునిచేతిలో మరణము ప్రాసిపెట్టి యుండుటచేతను భీమునికి మిక్కిలిగానచ్చిన ఆ ద్రౌపదివిూఁదనే ఆ నీచునకు మనస్సు పోయెనేమో! ఆంతరంగికములగు బంధనము లిట్టివి ఏవేవో ఉండవచ్చును.

అదను చూచి ఆ కీచకుఁడు అంతిపురిలో ద్రౌపదితో అంతసేపు మాటాడి అనాదరణ పొందెను. అప్పు డప్పకుఁ జెప్పి చూచెను. ఆమెయు ముందు వలదని మందలించెను. అది కాదని యాతఁడు స్వతంత్రించి, నావృద్ధి నీవు కోరెదవేని ఈ మాటలు కట్టిపెట్టి ఆ సుందరిని బిలుపింపుమని అక్కకు ప్రొక్కి ఆమెను దన పక్షమునకుఁ ద్రిప్పుకొనెను. ఈ ఘట్ట ములో ఇర్వురి నడక అక్షరాల సూతవంశమునకుఁ దగినట్లే నడచినది.

'ద్రౌపదీరూప మను నురిఁ దగిలి తనదు
హృదయ మను మృగ మత్తతి నుదిలకొనుచుఁ

గాముఁడను బల్లిదపువేఁటకాని బారిఁ
బడుట కెంతయు నా సింహబలుఁడు దలరి.'

కాముఁడను వేఁటకాఁడు ద్రౌపదీరూప మనెడి ఊరిలో ఇఱికించిన సింహబలుని 'భావచిత్రమును' సర్వదశావిశేషము లను ఒక మధురప్రబంధముగా సోమయాజి సృష్టించెను. అందు-ఆద్యంతము కీచకుఁడు ఒక 'ప్రతినాయకుఁడు'గా వర్ణితుఁడయ్యెను. వీరము ప్రధానరసముగా ద్రౌపదీభీములను నాయికానాయకులనుగాఁ జేసి, అక్రమప్రవర్తనుఁడయిన 'ప్రతినాయకుని' మృత్యువున కప్పగించి నాయికానాయకులకు ఇష్టార్థసిద్ధి గావించి, తద్రూపముగ ఆ భాగమును 'మోదాంతకావ్యము'గా రూపించెను.

దుర్వినీతుఁడైన కీచకుని పాత్రకు ఉద్దిగా వనవిహారములు-విరహవర్ణనములు సాగినవి. ఆతఁడు సంకేతనికేతనము నకు పోవలెనని ఎంతో ఉబలాటపడఁగా 'మాయరవి' ఎంత సేపటికిఁ గ్రుంకఁడాయె.

'మాయరవి యేల క్రుంకఁడో
కో యను నిట్టేల తడసెనో యనుఁ గ్రుంకం
బోయెడుఁజూ యిప్పుడ యను
దాయ పటిచె నను మనోజతాపముఁ బేర్మిన్.

దివమ కాని యింక భువనంబునం దిట
వట్టి రాత్రి లేనియట్టుగాఁగఁ
జేసెనొకొ్క విధి విశేషించి నాకకా
నేఁడ దివము సాఁగి నిలిచెనొకొ్క!

అనుఁచుఁ గ్రుంకింపరాని ప్రొద్దరసి యరసి
శిశిరపర్యంకమున మేను సేర్చి చేర్చి
వంతఁ దలపోసి తలపోసి వనరి వనరి
మిగుల వందురి వందురి పొగిలి పొగిలి'
ఈ లోకములో నిఁక—పగలే కాని 'రాత్రి' యన్నది లేదేమో! నాకోసమే ఈ 'కర్మ' మిట్లయ్యెనేమో! అన్నంత యున్మాదము తిక్కన్న కీచకుని తల కెక్కినది. వానికి వలయు శిశిరోపచారములు ప్రబంధయుగములోని ధోరణిలోఁ గాక హృదయరంజకముగాఁ గలిగించెను. తుది కెట్లో తిప్పలు పడఁగా పడఁగా, కీచకుని హృదయపద్మము వికసించెనఁట; తమ్మికొలంకులు ముకుళీభావ మందెనఁట. అనఁగా దివస నాథుఁడు క్రుంకెను.

అ తఱి హుందాగా మేను అలంకరించుకొని కామ వికారము పెల్లుగ రేఁగుచుండఁగా – ఒడలు ఉప్పొంగు చుండఁగా సింగమున్న గుహాలోనికి మాతంగము వచ్చి నట్టులు భీముఁడున్న చీఁకటియింటిలో కీచకుఁడు ప్రవేశించెను. మృత్యుగహ్వారములోఁ జొచ్చి యాతఁడు కల్యాణవార్తలతో కాలక్షేపమున కుపక్రమించెను. ఆ వార్తలు–ఆ విలాసములు వేషములో నున్న భీమునకు రోఁతవేసినవి. పరాక్రమధనమే ఆతనికి పరాయణమయ్యె – ఆతఁడు ద్రౌపదీరమణుఁడుగా అజ్ఞాతవాసిగా పరమవివేకిగా సంభాషణ నడపి రెండవకంటికిఁ దెలియకుండ 'కీచకవధ' జరిపెను.

తిక్కన రచనలో ఈ భీముఁడు ఒకొక్కపట్టున ఒకొక్కరూపుతోఁ గన్పట్టును. ఒకతూరి–యుధిష్ఠిరుఁ డంత

వానిని ఎదిరించినట్లుగాఁ దోఁచి అంతలోఁ గొంత తగ్గి 'సమష్టిసూత్రమునకు' లొంగిపోవును. అరణ్యావాసములో సైతము ఆతని 'యుద్ధతికి' అవకాశము కల్పించెను. కిమ్మీర వైరిగా కీచకాంతకుఁడుగా - కౌరవాంతకుఁడుగా, ఆయాయి ఘట్టములలో ఆతని వ్యక్తిత్వమును విభిన్నముగా తిక్కన్న వర్ణించి ఆ పాత్ర కెంతో ఔచిత్యము సమకూర్చెను.

ముమ్మొదట కీచకుని మాటలు వినియువిననట్లు నటించిన ద్రౌపది నిర్వికారయై నిలిచెను. కీచకుని ప్రవృత్తి దుర్వృత్తిలోఁ జొచ్చెను. 'నా' యన్న దిక్కు లేని ఆ యంతిపురిలో ఆ దుండగీని సంభాషణము ఉపేక్షించి ఏవగించి బతిమాలి భంగపడి 'అన్నా' యని నోరారఁ బిలిచి ఏమేమో చెప్పిచేసి చూచినది. అవి యన్నియు వానియెడ వ్యర్థములే కాఁగా గంధర్వుల పేరు చెప్పి ధిక్కరించి ఆతని నెదిర్చినది. ఆ పరమనీచుని బుద్ధికి అనువగునట్లు నడకలు నడచిన సుదేష్ణతో ద్రౌపది పలికిన మాటలు సామాన్యములు కావు.

కం. 'అతివ! తగునమ్మ నీ గృహా
మతినిర్మలచరితభరిత మని యీ యెడ మ
త్పతుల యసన్నిధినై నను
మతి నూఁడి యున్నచోట మన్నన దప్పన్.

ఉ. సాధులు చేరి నెమ్మిగ నిజస్థిరవృత్తము దుష్టకోటిచే
బాధలఁ బొందకుండఁ దమపాల వసించినఁ బెద్దవారు దీ
క్షా ధరియించి వారి కొక యాపద పుట్టకయుండఁ గాచుటో
పై ధరఁ గీర్తి కెక్కఁదె యపాయము సేసిన నింద పుట్టదే?

ఆ. ఎవ్వరేని యింటి కెద్దియే నొకటికి
నన్నఁ బంపఁదగునె నిన్ను నాఁడ
కొలుచునెడ ననుజ్ఞ గొనన నీచములగు
పనుల కేను జాలకునికి సెప్పి'.

నీ సన్నిధిని బహుమానపాత్రమై చరింపఁదగిన నాకు ఈ నీచమైన పని అప్పగింపవచ్చునా! అని సైరంధ్రి ప్రశ్నించును. మత్పతుల అసన్నిధినైనను ఊఁఅఁడి యుండఁదగిన చోటని నమ్మితినని ఆమె అన్నమాటలో 'ధ్వని' ఉన్నది. ప్రకృతము నా తలిదండ్రులే కాదు; నా భర్తలుకూడ దగ్గఱ లేరు. అట్టి దశలో అండగా దండగా నీవుందువని నమ్మి నినుఁ జేరితినని సామాన్యమైన యర్థము. మత్పతుల అసన్నిధినైనను మతి నూఁఅఁడి యున్న చోట-అనఁగా నీ కంటికి నా భర్తలు కానరారు; నేను బిలిచినచో 'ఓ' యని ప్రత్యక్షమై నన్ను రక్షించుకొందు రన్న 'ధీమా' నాకుఁ గలదనియు భావము. సరే, ఏమైనఁగానీ ఆ నీచుఁడగు కీచకుని కొంపకుఁబోయి కల్లు తేవలసిన పని సైరంధ్రికి తప్పలేదు. అదియే సేవావృత్తి ఫలితము.

కీచక ద్రౌపదుల ద్వితీయ సమావేశములో ఆ యిరువురి స్వభావములు తిక్కన్న వర్ణించినట్లులు మఱెవ్వరు వర్ణింప లేరనుట పొగడ్త కాదు. అంతటి 'విషమ సమస్య'కు పాల్పడిన ద్రౌపది, ఆ నీచుఁడు పలికిన పలుకులు పెడచెవులఁ బెట్టి 'ధీరగావున విగత వికార' అయ్యెనఁట. ఈ భావమే, మహాకవి కాలిదాసు మాటలలో,

'వికార హేతౌ సతి విక్రియన్తే యేషాం న చేతాంసి
త ఏవ ధీరాః'

అని విందుము. వికారమున కనువైనది ఏదేని కారణ
మున్నను ఎవ్వారి మనస్సులు వికారమందవో వారే ధీరులు.
దైవబలముచే - ఆ దారుణమైన యాపదనుండి కడతేఱిన
ద్రౌపది విరాటు కొలువులో నిలిచి చేసిన అభియోగము
చూపిన దిట్టతనము మిక్కిలి శ్లాఘ్యములు. నిజముగా -
ఆ పాత్రల ప్రకృతి అది అయ్యెనో లేదోగాని, కవిబ్రహ్మ
తానుగా ఆ పాత్రలలో చొఱఁబడి హృద్యమైన పాత్రౌచిత్య
మును కవిత్వములో బంధించి మధురప్రబంధము కావించెను.

ఈ తీరుగ-తిక్కన విరాటములో విశిష్య-కీచకకథలో
ఉగ్రసుందరుఁడైన భీముని ద్రౌపదీరమణుఁడుగా చిత్రించి
ఆ 'నాటకము' ను 'రక్తి' కట్టించెను. దాస్యములో మునిఁగి
నైచ్యమున కగ్గము కావలసివచ్చిన ద్రౌపదిని ఆ యాఘట్టము
లలో ఔచిత్యభంగముగాని భంగిమలో చిత్రించి ఆ పాత్రకు
వన్నె తెచ్చెను. మోదాంతముగా ఆ నాటకము ముగిసిన
పిదప 'సింహబలమర్దనుఁడైన' భీముని జూచి ద్రౌపది
ఇట్లన్నదఁట :—

'నీ యుత్తమనాయకత్వ మెఱిఁగి నినుఁ గొనియాడ
నే నెంతదాన, మహితవిస్మయానందనిర్మగ్ననైతి.' అని.

ఈ పలుకులు యుధిష్ఠిరానుజునకు కర్ణరసాయనము
లై నవఁట.

కీచకునిపాత్ర పోషించుటలో తిక్కన సృష్టిని మించిన 'సృష్టి' తెలుఁగులోనే కాదు; నాకుఁ దెలిసినంతలో సంస్కృతములోఁగూడ లేదన వచ్చును. వందమంది 'శకారు' లైనను కావ్యరీతిగా ఇంత అందచందములు కూర్పలేరు. ఇతి హాసముగా ఉపక్రమించిన ఈ కథాభాగము తిక్కన సోమయాజుల చేతిలో రసవంతమైన మోదాంతమైన మధుర ప్రబంధముగా పరిణమించినది. పాత్రౌచితిలో రసానుభూతిలో ప్రబంధధోరణిలో ఈ భాగమును ఈ తీరుగ 'కవిబ్రహ్మ' నడపించి యుండఁగా-పదపడి ఎన్నేండ్లకో వచ్చిన 'అల్లసాని' వారిని 'ఆంధ్రకవితా పితామహ' అనుటలోని యౌచిత్యము ఏమైయుండునో అభిజ్ఞులు గుర్తింతురు గాక!!

[1958 మార్చి]

కీచక నిగమ శర్మలు - వారి అక్కలు

రసవత్కవితా వేశుఁడగు తిక్కనమహాకవి చేతిలో మెలఁగిన కీచకునకు, పదగుంభనములో పేరుమోసిన రామకృష్ణకవీశ్వరుని నిగమశర్మ, తమ్ముఁడుగా స్ఫురించును. ఇరువురు మహాకవులు ఆ యిరువురకు ఇరువురు అక్కలను ప్రసాదించిరి. ఒకరు సుదేష్ణ; మఱొకరు-'అనామిక.'

ఒకవిధముగా కీచకవంశము విచిత్రమైనది. తండ్రి క్షత్రియుఁడు తల్లి బ్రాహ్మణి అయినచో ఆ బిడ్డ సూతవంశ్యుఁడగునఁట. ఏదో ఇట్టి 'ప్రాతిలోమ్యము' లో పుట్టిన కీచకుఁడు మంచిబలవంతుఁడయి బలవంతులయిన నూటయేవురు తమ్ములతో విరాటనగరమున కాపురము పెట్టెను. ఆ దేశమునకు మత్స్యరాజ్యమని పేరు. పేరుసకు విరాటరాజు-రాజు. పెత్తనమంతయు కీచకునిదే. కావుననే అంతిపురిలో సైరంధ్రిని జూచి తారసిల్లిన కీచకుని యుద్ధతి గాంచి సుదేష్ణ,

'అకట దీన నింకేమి యపాయ మగునో
వలదు తగదన్న నుడిగెడువాఁడె వీఁడు
మాయఁడైవమ! యే నేమి సేయుదాన' అని ముమ్మొదట కొంతవట్టు డిల్లయోయి నా నేర్చుకొలందిఁ దగిన తెఱంగున వారించి చూచెదంగాక యని కొంతప్రయత్నము చేసినది. ససేమిరా యని వాఁడు మొఱాయించుటచే పాపమాబిడ, పనివడి ఏదేదో ప్రబోధించెను. తమ్ముఁడూ

నామాట వినవయ్యా. పరసతీసంగమము ప్రాణములమీఁదికి వచ్చుచున్నమాట ఎఱుఁగవా నీవు? అది యధర్మము గదా! ఆమె భర్తకు ఈ నీ చేష్ట తెలిసినచో ఏమి కానున్నదో అన్న జంకు ఒకవంక నుండును గదా! పదిమంది నిందింతురే. కులమువారు వెలివేసెదరే. మిత్రులు దూరమయ్యెదరే. జారపొంచు నీ కేలరా తమ్ముఁడూ! అదియునుగాక, దాని పతులు గంధర్వులఁట. వారేవురఁట. వారందఱు బలపరాక్రమ సంపన్నులఁట. వారి కథలు వినఁగా వినఁగా నాచిత్తము తత్తరపడుచున్నది. కాని తెరువునఁ బోయిననాఁడు ఏమి సౌఖ్యము కలుగునయ్యా! తమకము వీడి నా బుద్ధి వినవయ్యా. అని ఎంతో బ్రతిమాలి భంగపడినది. ఈ బుద్ధులు చెప్పుట మాని నా వృద్ధియే నీవు కోరుదానవేని వెంటనే ఆ సైరంధ్రిని పిలువనంపవలెనని కీచకుఁడు పలికియు బిక్కమొగము పెట్టి దిగ్గన లేచి అక్కగారి కాళ్ళమీఁదఁ బడి ప్రమొక్కినాఁడఁట. అప్పుడు సుదేష్ణ తత్త్వమే మాఱిపోయినది.

పాఱుకొలమునలో పుట్టి పరమనీచుఁడైన నిగమశర్మ కన్న-కీచకుఁడే మెఱుఁగన్నట్లు కొన్ని పట్టులలోఁ గన్పట్టును.

నిగమశర్మ వట్టి నేతిబీరకాయ. ఆతఁడు దైవఘటన వలన తప్పి ప్రొపేలలో 'తిష్ఠ' వైచెను. కవితాశయ్యలో పాత్రస్వరూపస్వభావచిత్రణములో ఈ ఘట్టమున తెనాలి రామకృష్ణుఁడు చూపిన నేర్పు-అద్వితీయము; అత్యద్భుతము. మహోన్నతమైన మహీసురవంశమునకు ఆతని తాతముత్తాతలు కాణాచియై యుండఁగా - తార్తీయపురుషార్థమునకే నిగమశర్మ దీక్ష వహించుట విధివిలాసమే యనవలెను. విరాట

నగరములో కీచకున కెదురు లేనట్టులు నిగమశర్మయింటిలో ఆతనిదే పైచేయి. జాతిమాత్రోపజీవిగా చెలాయించి 'పరపతి' గడించిన నిగమశర్మను ఊరిలో మందలించు నాథుడే లేడు. బంగారువంటి ఆ యింటిలో వైదికాచారములు భ్రష్టమై పోయినవి. తాతముత్తాతలు చీమవోలె కూడఁబెట్టి ఇచ్చిన సొమ్మంతయు హారతి కప్పురమువోలె హరించుకొనిపోయెను. ఇంటిలోని నగలు నాణెములు తాకట్టులలో దిగినవి. పైపరామరిక ఏమియు లేక పొలము పుట్ర తోటలు దొడ్డులు పాడువాటి పోయెను. పండువంటి ఆ సంసారము ఈ పెద్దమగబిడ్డ మూలాన బగ్గము పాడయ్యెను.

ఈ వార్త తెలిసి, ఆతని అక్క, అయ్యోయని అడలి పోయి బిడ్డలతోపాటు వచ్చి పుట్టినింట మకాముపెట్టెను. చుక్క తెగిపడినవడువున ఎక్కడనుండియో ఊడిపడిన తమ్ముని జేరఁజీరి అక్క, చక్కఁగా పలుకరించినది. తాను చేటికానీత పీఠికాసీనయయి కుడివంక, బిడ్డ చనుబాలు త్రావుచుండ తమ్మునితో అక్క ఇట్లన్నదఁట :—

ఏరా! తమ్ముఁడూ! ప్రారంభించిన వేదపాఠములు ఏమైపోవునో యన్న బెంగతో రావాయేమి మా యింటికి? ఎన్నాళ్ళయినదిరా నిన్ను నేను జూచి? కన్నులు వాచి వేచి యున్నవే. ఎప్పుడు వత్తువో ఏమో యని మీ బావయు నీ కోసమె ఎదురు చూచుచుండునే. ఈ యింటిలో ఆఁడు బిడ్డను నేను ఆవలకుఁ బోఁగా బిడ్డలలో పెద్దతలవు నీవేగదా! నీచేతిప్రోపులో నిలఁబడవలసిన అమ్మాయి నాయనయు నీ విట్లైననాఁడు ఎంత బాధపడెదరోగదా! పరమేష్ఠినుండి

నీతరమువఱకు పవిత్రమైన వంశమునుగూర్చి స్మరింపవేమి! కాటికిఁ గాళ్లు చాచిన తల్లిదండ్రులను సంతోషపెట్టవేమి? అగ్నిసాక్షిగ పెండ్లాడిన ఇల్లాలిని ఒల్లవైతివే. శాస్త్రవేత్తలను బిలిచి గౌరవించి విత్తమిచ్చి విఖ్యాతి గడింపవేల? నీ చదివిన చదువు లన్నియు చిలుకపలుకు లయ్యెనేమయ్యా! తోడివారలెల్లరు నినుఁ జూచి నవ్వుచుండఁగా ఈ లీల బేలవై పోయితివేలరా తమ్ముఁడూ!

నా తమ్ముఁడు సజ్జన స్తవనీయనయప్రసక్తిలో బ్రహ్మచులనుసైతము మించియుండును. ఆతని యజ్ఞములో నేను పూజ్యారాలనై వేది నలంకరింతునని పదిమందిలో చెప్పుకొందునే. నీ విజ్ఞైతి వన్నమాట ఎఱుఁగనురా తమ్ముఁడూ! ఏదో ఆవేశము పెరిఁగి ఇంటిలో సొమ్మంతయు గవ్వలుగచ్చలుగా వెచ్చించితివే! ముక్కారుపంటలు పండుచు కండగలిగిన కేదారఖండములను తెగనమ్మితివే. ఇల్లా లేమైపోవును? తమ్ము లేమైపోవుదురు? కులధ్వంసమునకు తలపెట్టితివే!

వెలయాండ్రజోలి నీ కేలరా తమ్ముఁడూ! ఇల్లు-ఒళ్లు గుల్లచేయు వారకాంతల నేస్తము నీ కేలరా! నర్మగర్భోక్తులకు నక్కటక్కులకు నయగారములకు వక్రభావములకు వారయువతులు పెట్టినది పేరుగదా! వారిజోలి మాని ఇఁకనైన నా మాట విని నా చెప్పినపద్ధతిలో నడువుము. నీకుఁ గావలసియున్నచో హరికౌస్తుభమైనఁ దెచ్చి యిచ్చెదను.

అని ఈ తీరున నయాన భయాన చెప్పవలసిన నీతులు రీతులు చెప్పి చూచినది. తమ్మునిసంతృప్తికై, గృహస్థుఁడవై

నీవు వందలకొలఁది కులాంగనలనే వరియించి రమింపరాదా! అన్నంతవఱకు ఉపదేశించినది.

ఔననఁడు; కాదనఁడు. సాదుపలువ. చక్కఁగా వినును. అక్కసన్నిధిలో తల వంచుకొనును. తిండితిప్పలకు వాచివేచి యున్నవాఁడు కావున, మూన్నాళ్ళ ముచ్చటగా-అన్నాళ్లు అక్కగారి యదుపులో ఉన్నట్లు నటించి, ఒకానొకనాఁటి రేయి ఇంటిలో సొమ్ము ఇల్లాలి ఒంటిమీఁదిసొమ్ము అక్కగారినగలు అమ్మసొమ్ములు సర్వస్వము ఊచముట్టుగ దోఁచుకొని అడేపోకగాఁ బోయెను.

తమ్మునికి నీతులు నేర్పి మఱఁదలను సంతోషపెట్టి తల్లిదండ్రులకు సంతృప్తి కలిగించి ఆ యింటికి భద్రత కూర్పవలెనని నిగమశర్మ అక్క ప్రయత్నించినది. నీ యొంటిమీఁద ఈఁగను వ్రాలనీయనన్నట్లు సైరంధ్రికి మాట ఇచ్చిన సుదేష్ణ కీచకుని సంరంభమునకు బుద్ధి మాఁగ్గుచుకొన్నది. సైరంధ్రికి ఏవురుపతులు గంధర్వులు ఉన్నారన్న వార్త సుదేష్ణ మనస్సులో పనిచేసినది. వారిమూలాన తమ్ముఁడు ఏమైపోవునో అన్న బెంగ ఆమెకు లేకపోలేదు. తమ్మునికి ఆపద వచ్చిన దన్నచో మత్స్యదేశమునకే వచ్చినట్లు. ఆ రాజ్యమున కాతఁడే పెట్టనికోట. ఆతని యండదండలవలననే ఆరాజ్యమువీఁదఁ అపకారబుద్ధితో ఈఁగసైతము వ్రాలఁజాలదు. అంతవాఁకి సుదేష్ణ అక్క కావుననే ఆమెవీఁదఁ విరాటరాజునకు అంత మమకారము; అట్టి యనురాగము. సుదేష్ణ, ఆభిజాత్యము గల ఆఁడుదియే అయినచో ఈ ఘట్టములో ఈపని ఇట్లు చేసియుండదు. తాను సుక్షత్త్రియవంశ్య కాదు కావునను,

తమ్ముని శౌర్యదర్పములు తన దేశమున కక్కఱి కావునను, ఈ యనుబంధము మూలమునఁ బోలె విరాటరాజు తన్ను మిన్నగా అభిమానించును గావునను తుదకు తమ్ముని ధోరణికే ఆమె తాళము వైచినది. తనమాట పాటిసేయని తమ్ముని పట్ల - ఏమి చేయను వీలుకలుగక కంటినీరు కనుఁగవలో ఱిమింగి కొంచు

'ఇంత దలరనేల! యెమ్మెయినై నను
గొమ్మ నలవరించి కూర్చు టరుదె!
యుమ్మలంబు దక్కఁ యూఱటతోడ నీ
వేఁగు మసలవలవ దింక నిచట' అని యాతని నూఱడించి పంపివైచెను. ఆబిడ, ఆ కొమ్మను అనఁగా సైరంధ్రిని అలవరించి కీచకునకు కూర్చునఁటు.

విరాటరాజ్యమునకు కీచకుఁడే గుండె అయినట్లు ఆహితాగ్నియైన 'సభాపతి' ఇంటిలో నిగమశర్మయే మూల స్తంభము. మూలస్తంభమే చెదలుపట్టి పుచ్చి పుగుళులుపడి 'మొదలు చెడ్డ బేరము' కాఁగా, ఇఁక - ఆ యింటివాలక మెట్లుండునో యూహింపవచ్చును. వేదములు ఓసిన గాడెలో కామశాస్త్రములు దాఁచుకోనేర్చిన 'ఘనుఁడు' పుట్టినాఁడు. సర్వకళాకలాపములకు కాణాచియైన ఆ యింటిలో 'కామకళ' కే రుచి మఱిగిన 'నవమన్మథుఁడు' అవతరించి నాఁడు. నింగివేల్పులను సైతము అలవోకగా నేలకు దింపఁగల నోములు నోఁచినోఁచి కానకకన్న ఈ 'గారాలకూచి' నేల వేల్పు కొలమునకే 'ఎసరు' పెట్టఁదలపెట్టెను. ఈ చెడిపోయిన తమ్ముని ముమ్మొదటగాఁ జూచిన అక్క, ఆతనిని అంటు

కొనుటకే శంకించినది. ఆమె సన్నిధిలో నిలువను వాఁడును జంకి ఆవలకుఁ బోవ నుంకించెనఁట. ఈ వైఖరి గుర్తించిన అక్క, వాని 'శృంగారతత్త్వము' నకు అనువుగా దీవెన లిచ్చి, ఇడుగో నీ మేనల్లుఁడు తిమ్మ్నిఁడూ! అని తన బిడ్డను వాని చంకను బెట్టి, మీ బావగారి బంతిలో ఆరగింపవలె ఆఁగ వయ్యా యని ఒకానొక 'బంధము' తగిలించెను. తగిలించి వెనుకవైపున ఎడమై నిలిచియున్న మఱఁదలికి కనుసైఁగ చేసెనఁట.

వెంటనే పాప మా ఇంటికోడలు ప్రాణేశ్వరుని పాదార విందములను జల్లనినీటితో కడుగుచుండఁగా ఆ నీరెల్ల ఆమె నిట్టూర్పుల వేడిమిచే ఁకాఁగిపోయెనఁట. కనుగీటినంతలోనే ఆ యింటిలోని వంటకము సర్వము సిద్ధమయ్యెను.

తమ్మునికి తలకుఁబోసి మడుఁగుదోవతి కట్టఁబెట్టి వెండ్రుకలతడి యాఱిచి క్రొవ్వీరులు తెప్పించి తలమోఁదఁ గూర్చి ఒంటికి చందనము పూసి ఇలువేల్పునకు నివేదన కావించి ఇంటిల్లిపాది ఒకే బంతిని గూరుచుండి భోజన మాచరింపఁజేసెనఁట. ఆ బంతిలో ఒక ప్రక్కను వృద్ధులైన తల్లియుఁ దండ్రియు. వేఱొకప్రక్క తనబిడ్డలు-తనబిడ్డల తండ్రియు. భోజనము ముగిసినపిదప ఆచమనము చేసిన ఆ మహానైష్ఠికుఁడైన నిగమశర్మకు ఇల్లాలు తాంబూలము చుట్టి ఇచ్చెనఁట. ఆతఁడది పుచ్చుకొని మహాశిష్టుఁడువోలె చిఱునవ్వు నవ్వుచు తిన్నెపైఁ గూరుచుండఁగా గులగులలాడు తనబిడ్డలు చంట వెంట సందడి దందడి చేయుచుండఁగా-అక్క, తమ్ముని దగ్గఱకు వచ్చి నిలిచి ఆతని జుట్టుముడి తీసి ఈళ్లు గ్రుక్క అంటుసంటులు

చూచి గోళ్ళతో దిగదువ్వి పేలను దిగిచివైచి మెడవిూద పేరుకొన్న మన్ను నలఁచి వెండ్రుకలు ముడివైచి తనచేతులు చక్కఁగా కడిగికొని తనకుసైతము మఱఁదలు తాంబూల మిచ్చి వీవనతో విసురుచుండఁగా అక్కడఁ గూచుండి చెప్పవలసిన మాటలు చేయవలసిన బోధలు వినిపించెను.

హైందవములో 'అనుభవము' గడించిన అక్కలయు మేన త్తలయు పోకడ లిట్లే యుండును. తాను మెట్టిన వంశము నకు ఈడుజోడుగా తాను పుట్టిన వంశముకూడ పేరుపెంపులు నింపుకొనవలెనని 'ఆఁడుబిడ్డ' భావించుట సహజము. ఆడ-మేడలలోఁ గూరుచుండి అందలాలలో ఊరేఁగుచున్ననాఁడు, పుట్టినయింటికి ఏదేని మచ్చవచ్చెనా అది యొక రోఁతయే యగును. ఆభిజాత్యముగల యువతి, ఇరువంకలవారికి ఏ వంకలు లేకుండ చూచుకొనును.

సుదేష్ణ, సూతవంశసంజాత కావునసై రంధ్రికి అప చారము చేయఁగలిగినది. పేరు లేని వంశములో పుట్టి పరా క్రమముచే కీచకుఁడు పేరు తెచ్చుకొన్నాఁడు. పేరు గల దొడ్డవంగడములో పుట్టిన నిగమశర్మ వట్టి నీచుఁడై భ్రష్టుఁడై పోయినాఁడు. ఇరువురిని సంస్కరించుటలో ఆ యక్క లిర్వ్వారు తమతమ శీలముల కనువగునట్లే ప్రయత్నించిరి. వీరి ప్రయత్న మెట్లున్నను వాంద్ర తత్త్వమే వాంద్రను నడపినది; చెఱపినది. ఒకే 'అభిమానవిషయము'లో రేయుంబవలు పాటుపడి ఆ యిర్వ్వారు భ్రష్టులై వికృతపుఁజావు చచ్చిరి.

ఒకానొక 'కృత్రిమమైన' ఘట్టములోఁ జచ్చిన కీచకు నకు వీరమరణమునకుఁ జెందిన స్వర్గము వచ్చునో రాదోకాని,

మహానీచుఁడై పరమపాతకుఁడై మరణించిన నిగమశర్మకు మాత్రము 'పురాణకర్త' మోక్షమే ఇప్పించెను. పరదారవ్యవహారముచే భ్రష్టుఁడైనవానికి భారతకర్త, మరణమే చవిచూపెను. పరదారవ్యవహారములో ఆరితేఱి పరమనీచుఁడై పోయినవానికి పాండురంగమాహాత్మ్యము పుణ్యాలోకమే ప్రసాదించెను. క్షేత్రమహిమ వర్ణించునుబలాటములో పాండురంగకర్త, ధార్మికజీవనములోని యౌచిత్యమును గొంత మఱచిపోయినట్లే తోఁచును.

ఏది యెట్లున్నను, గుంటూరి తిక్కన-తెనాలి రామకృష్ణుల చేతులలో దివ్యముగా మెలఁగిన ఈ 'యక్కలు' ఆంధ్రసారస్వతములో ఆచంద్రతారార్కము అద్భుతముగా రాణింతు రనుట అతిశయోక్తి కానేరదు.

[1958 జనవరి]

శ్రీ నా థు డు

'శిక్షతి ధర్మం రక్షతి శీలం పరిహరతి మానసం తాపమ్
విభజతి సత్యాసత్యే సత్యం సారస్వతసేవా'

నిజమైన సారస్వతసేవ ధర్మమార్గమును బోధించును. శీలమును గాపాడును. మానసికతాపమును పరిహరించును. సత్యాసత్యముల స్వరూపమును జక్కఁగాఁ జూపును.

'ఇద మన్ధంతమః కృత్స్నం జాయేత భువనత్రయమ్
యది శబ్దాహ్వాయం జ్యోతి రా సంసారం న దీప్యతే'

అజ్ఞానమనెడి పెంజీఁకటిని పటాపంచలు చేయవలెనన్న శబ్దజ్యోతియే మంచిసాధనము. అనఁగా ఆ జ్యోతి లేనినాఁడు జగము లెల్ల అంధకారబంధురములైనట్లే.

సారస్వతస్వరూపమే శబ్దజ్యోతి. ఆ జ్యోతికి మూలము కవితాసిద్ధి. ఆదిలో అది ఆగ్నము కావచ్చును. శ్లోకమే శ్లోక రూపమై ఆదికావ్యమై ప్రపంచములో ప్రథమావతారముగా పరిణమించినది.

గైర్వాణికి సర్వవిధాల సన్నిహితమైన బిడ్డవంటిది ఆంధ్రి. దాని పుట్టుపూర్వము లిటీవలివే అయినను సర్వాంగ పరిపుష్టమై సాటిచెలులలో మేటిదిగా ఆంధ్రి వన్నెకెక్కినది. ప్రాజ్ఞన్నయయుగములోని ఆంధ్రి, మనకంటికిఁ గానరాని దశలో అంతరించుటఁజేసి నన్నయ్యభారతమే మనకు ఆది

కావ్యమై వెలసినది. వైదికపరిజ్ఞాన సంపన్నమైన మార్గములో నన్నయ్య ఆంధ్రిని సృష్టింపఁగా, ఆధ్యాత్మికసాధనతో లోకానుభవము మిశ్రము చేసి అపూర్వమైన శిల్పముతో జాతీయత ప్రోదిచేసి తిక్కనసోమయాజులు తెలుఁగునకు వెలుఁగు తెచ్చిరి. అన్నింటను వారిరువురకు ఈడు జోడు కాఁగల ఎఱ్ఱాప్రెగ్గడ, ఆంధ్రభారతమును పూరించి కవిత్రయములోఁ జేరి ఘనత కెక్కెను.

కవిత్రయమువారి తరువాత యుగకర్తగా కీర్తి గాంచిన విద్వత్కవి – శ్రీనాథమహాకవి. అయిదాఱు వందలయేండ్ల క్రిందట – ఆ మహాకవి ఆంధ్రదేశములో చేసిన సంచారములు చూపిన అధికారములు అనుభవించిన అఖిలైశ్వర్యములు వ్రాసిన మహాకావ్యములు సంస్మరించినచో – అది మధుర మైన సాహిత్యసేవగా హృద్యమైన దేశచరిత్రగా పరిఢవించి, తన్మూలమున మనము కృతార్థుల మయ్యెదము.

ఆయనపేరు శ్రీనాథుఁడఁట. అవురా! ఎంత కమ్మని పేరు! ఆ రోజులలో ఆంధ్రులలో విద్వాంసులలోనే 'ఎఱ్ఱన్న–తిక్కన్న–మారన్న – పోతన్న'లు ఉండఁగా, శ్రుతి మధురమైన 'శ్రీనాథ' నామధేయము వచ్చుటకు ఆయన తండ్రితాతలే కారణము కావచ్చు. వారు అందఱి తండ్రుల వంటివారు కారు. తండ్రిపేరు మారన. తాతపేరు కమల నాభుఁడు. కమలనాభుఁడే శ్రీనాథుఁడుగా అవతరించెనేమో! ఆస్తిపాస్తులలో గుణగణములలో తండ్రికొడుకులకన్న తాత మనుమలకే గట్టి యనుబంధ ముండునని శాస్త్రముకూడ చెప్పుచున్నది. 'పద్మపురాణ సంగ్రహకళాకావ్యప్రబంధాధిపుఁ

డనియు-కవితావిద్యాధరుఁ డనియు భీమఖండములో శ్రీనాథుఁడు పితామహుని బేరొక్కనెను. అనఁగా-అది విద్వద్వంశమన్నమాట.

అందనుక బీజప్రాయమైన పురాణగ్రంథనిర్మాణదక్షత, శ్రీనాథునిలో మహావృక్షమై కొమ్మలు రెమ్మలు వైచి చిలవలు పలవలు పుట్టి చెలు వొందినది. ఆయనది ఏ దేశము? ఆయన కులగోత్రము లేవి? ఆయన ఉనికి మనుకు లెక్కడ? ఆయన వృత్తిప్రవృత్తు లేవి? జీవయాత్ర ఎట్టిది? ఇత్యాద్యంశములు వినవలెనని ఆయన ప్రఖ్యాతినిబట్టి మనకు నోరూర వచ్చును. కాలిదాసాదికవిపుంగవులు అట్టి స్వీయప్రస్తావమే ఎత్తుకొనక 'అస్తి-కశ్చిత్-వాగ్విశేషః' అని దైవికముగా ఏదో స్ఫురించి 'అస్త్యుత్తరస్యాం-కశ్చిత్కాంతా-వాగర్థివ-' ఇత్యాదిగ కావ్యోపక్రమణము కావించి ఆ తీరుగమనకు ఆశాభంగము కలిగించిరి. తెలుఁగుకవులు చాలవఱకు తమ తమ జీవితములను ఏదో రూపులో దేశచరిత్రల కందించిరి. వానిలోఁ గొన్నింట వైవిధ్య మున్నను కావలసిన అంశములు మనకు సూటిగా లభించి కొంత సంతృప్తి కలిగించుచున్నవి.

శ్రీనాథుఁడు కన్నడదేశీయుఁడని బలమైన ఒక వాదము లేకపోలేదు. అది కాదు; ఆయన తాతతండ్రులు తెలుఁగుదేశములో ఉద్యోగులై తెలుఁగువారిలోఁ గలసిపోయిరని మఱొక తీర్పు ఉన్నది. నన్నయ్య మొదలు ఎందఱో మహాకవులు ఆంధ్రకర్ణాటకములు రెండింట పరిశ్రమ చేసి ఆంధ్రమహాకవి శ్రేణిలోఁ జేరినవారు ఉన్నారు. సంస్కృతాంధ్రముల కున్నట్లే ఆంధ్రకర్ణాటభాషలకుఁగూడ ఆయాయి ఘట్టములలో అనేక

విధాల అనుబంధ మున్నది. తెలుఁగువారిలో పెక్కుఱు కన్నడ కవులై వన్నె కెక్కిరి. శ్రీకృష్ణదేవరాయలు- శ్రీనాథమహాకవి వారి కోవనుబట్టి కన్నడులే అయినను హారికృషి యంతయు తెలుఁగులోనే కావున ఆ యిర్వురు మన మహాకవులలోనే పరిగణన. పైగా - ఈ దేశములో 'దేశభాషలందుఁ దెలుఁగు లెస్స' అన్నదియు వారిర్వురే. ఇట్లే అజువదేశములో నిలిచి తెలుఁగునకు వెలుఁగు కూర్చిన మహాకవులు- రాజకవులు-కవి రాజులు- త్యాగరాజాదులు ఎందఱో మహానుభావు లున్నారు.

సకలవిద్యాసనాథుఁడైన శ్రీనాథుఁడు ఏ గురువుల సన్నిధిలో ఏ యే విద్యలు నేర్చెనో తెలియదుగాని 'ప్రపేదిరే ప్రాక్తనజన్మవిద్యాః' అన్నట్లు సర్వవిద్యలు ఆయనను ఆశ్రయించినట్లే ఆయన కావ్యములు వేనోళ్ల చాటుచున్నవి. కవిత్రయమువారి త్రోవలోనే శ్రీనాథుఁడుసైతము నడచి పురాణకవిగా కవిత్వమును ప్రారంభించెను. ఆయన చెప్పిన పద్యమునుబట్టి ఏ యే వయస్సులో ఏ యే కావ్యమును వ్రాసెనో విమర్శకు లూహించిరి. మన మాటలలోఁగాక, ఆ మహాకవి వాక్యములలోనే ఆ యంశములను విందము :—

సీ. చిన్నారిపొన్నారి చిఱుత కూఁకటినాఁడు
రచియించితి మరుత్తరాట్చరిత్ర
నూనూఁగుమీసాల నూత్నయౌవనమున
శాలివాహనసప్తశతి నొడివితి
సంతరించితి నిండు జవ్వనంబునయందు
హర్షనైషధకావ్య మాంధ్రభాషఁ

బ్రౌఢనిర్భరవయఃపరిపాకమునఁ గొని
యాడితి భీమనాయకుని మహిమఁ

బ్రౌయ మింతకు మిగులఁ గైవ్రాలకుండఁ
గాశికాఖండమను మహాగ్రంథ మేను
దెనుఁగుఁ జేసెదఁ గర్ణాటదేశకటక
పద్మవన హేళి శ్రీనాథభట్టకవిని.' (కాశీ)

'సీ. వినిపించినాఁడవు వేమభూపాలున
కఖిలపురాణ విద్యాగమములు
కల్పించినాఁడవు గాఢపాకంబైన
హర్షనైషధకావ్య మాంధ్రభాష
భాషించినాఁడవు బహుదేశబుధులతో
విద్యాపరీక్షణ వేళలందు
వెదఁజల్లినాఁడవు విశదకీర్తిస్ఫూర్తి
కర్పూరములు దిశాంగణములందు

పాకనాటింటివాఁడవు బాంధవుఁడవు
కమలనాభుని మనుమఁడ వమలమతివి
నాకుఁ గృపసేయు మొక ప్రబంధంబు నీవు
కలితగుణగణ్య! శ్రీనాథకవివరేణ్య!' (భీమ)

'సీ. వచియింతు వేములవాడభీమనభంగి
నుద్దండలీల నొక్కొక్కమాటు
భాషింతు నన్నయభట్టు మార్గంబున
నుభయవాక్ప్రౌఢి నొక్కొక్కమాటు

వాక్రుత్తు తిక్కయజ్వప్రకారము రసా
భ్యుచితబంధముల నొక్కొక్కమాటు
పరిఢవింతు ప్రబంధపరమేశ్వరుని తేవ
సూక్తివై చిత్రి నొక్కొక్కమాటు
నైషధాదిమహాప్రబంధములు పెక్కు-
చెప్పినాఁడవు మాకు నాశ్రితుఁడ వనఘ!
యిపుడు చెప్పఁదొడంగిన యీ ప్రబంధ,
మంకితము సేయు వీరభద్రయ్యపేర.'

ఈ మాటలలో ఆయన ప్రకృతి-ప్రవృత్తి సర్వము చిత్రింపఁబడినది. ఆయన వ్రాసితినన్న కావ్యములలో నేఁడు మనకుఁ గొన్ని కన్పింపవు. కవిత్వతత్త్వములో కవిత్రయము వారే శ్రీనాథునకు ఆరాధ్యులు. ఆయన చెప్పినట్లు బహు దేశసంచారము సేయుట-నానారాజన్యసమ్మానము లందుట-విద్వాపరీక్షలలో విజయలక్ష్మిని వరించుట, ఇత్యాదు లన్నిం టికి చరిత్రలో తారకాణములు దండిగా ఉన్నవి.

'కవితా యద్యస్తి రాజ్యేన కిమ్' అను సూక్తి, శ్రీనాథునివిషయములో అక్షరాల లక్ష్యమైనది. ఆయనకు సమకాలికులైన సంపన్నులుగాని రాజులుగానీ మహారాజులు గానీ ఆయనప్రాపకమునే కోరి ఆయన 'హస్తవాసి' వలననే ఇప్పటికిని బ్రదికియున్నారు. రామాదు లుండిరో లేదో భౌతిక ముగా మనకుఁ దెలియదు. ఆ మహాకవి వాల్మీకి గంటములో అంటుకొన్న జీవు లెల్లరు అక్షరులై శాశ్వతముగ బ్రదికిరి. అదేగదా 'కవిబ్రహ్మ' ఘనత! జగత్సృష్ట చేయు సృష్టికి

వంకరటింకరలు-పుట్టుటలు గిట్టుటలు ఉండవచ్చునుగాని కవి బ్రహ్మసృష్టిలో అట్టివి యుండనేరవు. పదునాలుగు పదునేను శతాబ్దులలో 'ప్రముఖు' లెవ్వారో మన కెవ్వారు చెప్పిరి? వారిని శ్రీనాథుడు చిత్రించి మన కిచ్చిపోవుటచే పూసలలో దారమువోలె వారును లోకములో గణనీయులై కీర్తి కెక్కిరి.

కాంచీపట్టణములోని అవచి తిప్పయ్యసెట్టిని మించిన శ్రేష్ఠులు ఎందఱు లేరు? వాణిజ్యములో వైభవప్రాభవములలో రాజాశ్రయములో తిప్పయ్యసెట్టిని మించినవారు ఎందఱున్నను వారిపేరైన మనము స్మరింతుమా? రాజులు మహారాజులు ధనధాన్యము లిచ్చి గ్రాసవాసము లొసంగి కవీశ్వరులను పోషింపఁగా-ఆ కవీశ్వరులు ఆ మహేశ్వరులకు అక్షర రూపమైన సంపద యిచ్చి ఆ ఋణము తీర్చుకొందురు. ఈ సంపద క్షరము కానిది. దీని ననుభవించిన ఆ వ్యక్తులు అమర జీవులగుటయే ఈ సంపదలోని విశిష్టత. అశాశ్వతమైన సంపద యిచ్చి శాశ్వతమైన కీర్తిధనము గైకొన్న కృతిపతులే కృత కృత్యులన్నమాట.

కవిరాజులు, రారాజుల కంకితము లిచ్చి కావ్యములతో పాటు కృతిభర్తలను జిరంజీవులను జేసినవారిలో తెలుఁగులో నన్నయభట్టే ముమ్మొదటివాఁడు. ఆవల శ్రీనాథుఁడే ఈ బాటలో బాహాటముగా నడచి అర్హులైనవారికి అడిగినదే తడవుగ అంకితము లిచ్చి అఖిలైశ్వర్యము లందుకొని కృతికర్తలయు కృతిభర్తలయు సంప్రదాయమును జక్కఁగా పోషించినవాఁడు.

తెలుఁగులోని పంచకావ్యములలో లెక్కకు వచ్చి శ్రీనాథుని రచన లన్నింటిలో మిన్నయని వన్నెకెక్కినది శృంగారనైషధము. దానికి కృతిభర్త మామిడి సింగన్న. ఆతఁడు రాజమహేంద్రవరమును బాలించిన వేమారెడ్డికి మంత్రి. సింగన్న అన్నగారిపేరు ప్రెగ్గడయ్య. ఆతఁడు వేమారెడ్డి సేనానాయకుఁడు. ఆతనికిని శ్రీనాథుఁడు 'పండితారాధ్యచరిత్రము' అంకితము చేసెనఁట. బెండపూడి అన్నయ్య భీమేశ్వరపురాణమునకు కృతిపతి. అవచి తిప్పయ్యసెట్టి 'హరవిలాసము' నందుకొనెను. వీరభద్రారెడ్డికి కాశీఖండ మిచ్చెను. క్రీడాభిరామమునకు భర్త వినుకొండ వల్లభామాత్యుఁడఁట. వీరిలో ఇర్వురు మహామంత్రులు; ఒకరు సేనాని. ఆ నాఁటి రెడ్డిరాజుల కొలువులో దొడ్డ పలుకుబడి గడించిన ప్రముఖులగుటచే వారు శ్రీనాథుని మన్ననకు పాత్రులైరి. అవచి తిప్పయ్యసెట్టి ఆ నాఁటి కొమరగిరి భూపాలునికి సుగంధద్రవ్యభాండాగారాధ్యక్షుఁడఁట. 'త్రిపురారి' యన్నది ఈతని కింకొక పేరు. ఈ కృతికర్త కృతిభర్త లిర్వురు కొండవీటి ప్రభువునకు సన్నిహితు లగుటచే బాల్యమిత్రులుకూడ. ఈ కృతిభర్తల ఉద్యోగవైభవములు దేవేంద్రభోగములు భౌతికముగా నశించినను శ్రీనాథుని చేతిలో వీరు చిరంజీవులై వెలసిరి.

శ్రీనాథుఁడు లేఁబ్రాయమందే సంస్కృతాంధ్రపాకృత భాషలలో సంపూర్ణమైన సాహిత్యశక్తిని కవితాశక్తిని సంపాదింపఁగలిగెను. శ్రీనాథుఁడు కేవలము సాహిత్యదీక్షాపరుఁడే కాదు; అధ్వర్యువేదశాఖాధీతి నిష్ణాతుఁడును. కృష్ణ

యజుర్వేదమునకే అధ్వర్యువేదశాఖ యని వ్యవహారము. శ్రీనాథుని శాఖకు తద్వేదశాఖాధ్యయనము శాస్త్రసమ్మతము కావున ఆ సూత్రము నాతఁడు పాటించెను. ఆతని కృతులను బరిశీలించి చూడఁగా సర్వవిద్యలు శ్రీనాథుఁడు కబళించినట్లే కన్పట్టును.

ఒక వైపున—అఖిలపురాణ విద్యాప్రవీణుఁడు

ఇంకొకమూల—ఆగమజ్ఞాననిధి

వేఱొక ప్రకేవ— 'శ్రుతిపురాణాగమస్మృతిసాంఖ్యసిద్ధాంత కబళనవ్యుత్పత్తి గౌరవంబు' గలవాఁడు.

మఱొకచోట — 'సంస్కృతప్రాకృత శౌరసేనీ ముఖ్యభాషా పరిజ్ఞానపాటవంబు' నేర్చినవాఁడు.

వీనియన్నింటికిఁ దోడు పతంజలిమహాభాష్యమును శ్రీనాథుఁడు ఆపోశనము పట్టినట్లు కన్పట్టును. ప్రతిఘట్టములో ప్రగాఢమైన వ్యాకరణపాండిత్యము బాఢముగా వ్యక్తమగు చుండును. ఈ యంశమే ఆయన మాటలలో ఇట్లని స్ఫురించు చుండును :—

'పన్నగపతి సార్వభౌమభాషితమహా
భాష్య విద్యాసమభ్యాసబలము' — అని

మఱొకచోట—'అక్షపాద కణాదపక్షిలో దీరిత న్యాయకళా కౌశలాతిశయము'—

ఈ పాదములో మువ్వురు శాస్త్రకర్తలున్నారు. న్యాయదర్శనకర్త గౌతముఁడే అక్షపాదుఁడు. వైశేషికదర్శన

కర్తనే కణాదుఁ డందురు. గౌతమన్యాయభాష్యకర్త వాత్స్యాయనుఁడే పక్షిలుఁడు.

న్యాయవైశేషికములలో శ్రీనాథుఁడు గడించిన పాండిత్యము కాశీఖండాదులలో ఖండితముగాఁ గన్పించుచుండును. ఆపై, దేశసంచారము చేసి విద్యాపరీక్షలలో వివిధదేశపండితులతో వాదింపవలయునన్న తర్కశాస్త్రప్రజ్ఞయు ఉండితీరవలెను. ఇట్టి సర్వశాస్త్రపాండిత్యము దండిగా ఉండుటచేతనే శ్రీనాథుఁడు డిండిమభట్టారకాదులను ఢీకొని జయింపఁగలిగెను. సకలవిద్యాసనాథుఁడై శ్రీనాథుఁడు, సర్వజ్ఞచక్రవర్తియన్న బిరుదము గడించిన వేమారెడ్డి రాజ్యములో విద్యాధికారి కాఁగలిగెను. ఆ పదవి సామాన్యము కాదు; ఆ వేమారెడ్డి ఏలుబడిలో అపూర్వసమ్మానములు పొందిన మహాపండితులు అగ్రహారము లందుకొన్న మహాకవులు శ్రీనాథుని పరీక్షకు మున్నిందుగా ఆఁగి నిలువవలెను. ఆ జేఁడు చేసిన దానములను శాసనములుగా నిర్మించుటలో శ్రీనాథునిదే పెత్తనము. 'విద్యాధికారీ శ్రీనాథో వీరశ్రీవేమభూపతేఃʼ-అన్న శాసనములోనిమాట శ్రీనాథుని హోదాను చాటుచున్నది.

రెడ్డియుగము - శ్రీనాథయుగము - ఈ రెండును పరస్పరము 'మణినా వలయం వలయేన మణిఃʼ అన్నట్లు జంటగా రాణించినవి. ఆ యుగములో శ్రీనాథునివంటి మహావిద్వాంసులను అనేకులను ఆదరించి పోషించి యుండుటచే రెడ్డియుగము సాహిత్యపరముగా స్వర్ణయుగమైనది. ఆంధ్రదేశములో రెడ్డిరాజులు ప్రఖ్యాతమైన పరిపాలనము చేసినది నూఱేండ్లుమాత్రమే అయినను-ఆకల్పము మఱువరాని మంచి

పను లనేకములు చేసిరి. వారిలో-కొందఱు స్వయము పండితులు; సంస్కృత కావ్యవ్యాఖ్యాతలు; సర్వజ్ఞబిరుదాంచితులును. వారి ప్రాపువలననే ఎట్లాప్రెగడ - శ్రీనాథునివంటి మహాకవులు మనకు మహాకావ్యము లీయఁగలిగిరి. 'నిరాశ్రయా న శోభంతే పండితా వనితా లతా' అన్నట్లు— ఆ యుగములో ఆదరించిన కొలఁది ఆంధ్రగీర్వాణములలో వైదుష్యము గడించిన విద్వాంసులు వెలువడిరి. పరాశ్రయము కోరుటలో పరాఙ్ముఖుఁడైన బమ్మెర పోతన్న ఆ కాలము వాఁడే యన్న ప్రతీతి ఉన్నది. దగ్గుఁబల్లి దుగ్గన్న శ్రీనాథుని బావమఱఁదియఁట. అనఁగా భార్యాసోదర్యుఁడు. శ్రీనాథుని యండదండలవలననే ఈతఁడును కవీశ్వరుఁడై 'కాంచీమాహాత్మ్యము' వంటి కావ్యములు ప్రాసి పేరు గడించెను. విక్రమార్కచరిత్ర ప్రాసిన జక్కనకవి శ్రీనాథుని సమకాలికుఁడు. ఆ రోజులలో 'డిండిమభట్టారక' బిరుదాంకితులు నలువురు ఉండెడివారఁట. వారిలో ఒకరు, సర్వతంత్రస్వతంత్రులై విశిష్టాద్వైతమును పెంపు గావించిన వేదాంతదేశికుల ప్రత్యర్థియఁట. రెండవ డిండిమునిఁడే శ్రీనాథుని ప్రత్యర్థియని విమర్శకులు నిర్ణయించిరి. ఆతఁడు కవిసార్వభౌమ బిరుదాంచితుఁడు. ఓడిపోయిన ఆ డిండిమభట్టారకుని 'కవిసార్వభౌమ' బిరుదము జాతిపోయి జయించిన శ్రీనాథునకు సంక్రమించినది. అది మొదలు శ్రీనాథుఁడు కవిసార్వభౌమునఁడయ్యెను. ఆ దెబ్బలో 'డిండిమాడంబరము' కూడ ఎగిరిపోయినది. ఈ భావమే మనకు 'పగులఁగొట్టించి తుద్దబటవివాదప్రౌఢి గాడడిండిమ భట్టు కంచుఢక్క' అనెడి పాదములో స్ఫురించుచున్నది.

నవనాథచరిత్ర యను ద్విపదకావ్యము రచించిన గౌరనకవి సరిగా శ్రీనాథునికి సమకాలికుఁడు. వాణి నా రాణి యనఁ గలిగిన పిల్లలమఱ్ఱి పినవీరభద్రుఁడు శ్రీనాథుని శిష్యుఁడని కొంద ఱందురు. జంటకవులుగా వెలసిన నంది మల్లయ్య ఘంట సింగయ్యలు శ్రీనాథుని కించుకంత తర్వాతివారఁట. తిరుమల వేంకటేశ్వరుని భక్తశిఖామణియైన తాళ్ళపాక అన్నమయ్యయు ఆ నాఁటివాఁడే యని ఇటీవల తేలినది. ఇట్టి ప్రసిద్ధులైన తెలుఁగుకవు లెందఱో శ్రీనాథయుగములో వెలసి ఆయన కవితాప్రతిభను గుర్తించి తమతమ రచనలలో ఛాయగా స్వీకరించిరి.

తెలుఁగుదేశములో జన్మించి యావద్భారతములో సంస్కృతమహాకవులుగా – వ్యాఖ్యాతలుగా ప్రఖ్యాతి వహించిన మహనీయు లనేకులు శ్రీనాథుని సమకాలికులలో ఉన్నారు. వారిలో వామనభట్టబాణుఁడు – కాటయ వేముఁడు – డిండిమభట్టారకుఁడు ముఖ్యులు. సంస్కృత వ్యాఖ్యాతలలో సర్వతంత్రస్వతంత్రుఁడైన మల్లినాథుఁడు శ్రీనాథుని సమకాలికుఁ డనుట మనము మఱువరాదు.

శ్రీనాథయుగమనఁగా పురాణయుగము జ్ఞప్తికి వచ్చును. అష్టాదశపురాణములే గాక రామాయణభారతభాగవతములు గూడ పురాణాంతర్గతములుగా వ్యవహార మున్నది. సంప్రదాయపరిజ్ఞానము లేనిచో సంస్కృతభాషలోని పురాణఘట్టములు కొన్ని సంస్కృతపండితులకుఁగూడ దురవగాహములుగా నుండును. ఈ రహస్యము గుర్తించియే నన్నయ్య మొదలు శ్రీనాథునివఱకు పురాణములను ప్రధానముగా అను

వాదము చేసి తెలుఁగులో పురాణయుగమును సృష్టించిరి. ఈ యుగములో నన్నయ్య గోదావరీప్రాంతమునను, తిక్కన్న పినాకినీతీరమునను, శ్రీనాథుఁ డాంధ్రదేశమందంతటను పురాణ బీజములను వెదఁజల్లి దివ్యకావ్యసస్యములను పండించిరి.

శ్రీనాథుఁడు ఆంధ్రమునం దంతట సంచారము చేసి ఆంధ్రుల ఆచారవ్యవహారములను భోజనభాజనములను కట్టు బొట్టులను రూపురేకలను జక్కఁగా వర్ణించెను. గోదావరీమండలములోని గుళ్ళను గోపురములను తీర్థములను క్షేత్రములను జక్కఁగా అభివర్ణించి ఆ తీరుగా దేశభక్తిని అగ్గలముగాఁ జూపిన పూర్వకవులలో శ్రీనాథుఁడే ముఖ్యుఁడు. తాను మహాపండితుఁడయ్యు ప్రజాసామాన్యమునకు అందు పాటుగ దిగివచ్చి, నెఱిగొల్లలు – పిచ్చుగుంటులు మున్నగు జాతులవారికి కాటమరాజుకథలు లోనగు గొల్లసుద్దులు వ్రాసిపెట్టి వారిజీవికకు దారి యేర్పఱిచి ఈ రూపముగ దేశ భక్తిలోఁ దానుగూడ భాగము పంచుకొనెను. ఇఁక – శ్రీనాథుని చాటువులలోని సారస్యము చెప్పఁదరము కాదు. పరిహాసప్రాగల్భ్యముతో సద్యస్స్ఫూర్తిని జూపఁగలవాఁడే చాటువులను సృష్టించును. ఈ గుణములో శ్రీనాథుని మించినవారు సంస్కృతాంధ్రములలో ఎందఱో లేరు. 'దీనార టంకాలు – కవిరాజుకంఠంబు – కాశికావిశ్వేశు' ఇత్యాదు లన్నియు శ్రీనాథుని చాటూక్తులే. ఈ చాటువుల సొగసు చవి చూడవలెనన్న శ్రీనాథుని 'వీధినాటక'మని వ్యవహరింపఁ బడు 'క్రీడాభిరామము'ను జదువవలెను. తెలుఁగుభాషలో పుట్టిన మొట్టమొదటి 'హాళనకావ్య'మిదియే యని కొంద

అందురు. దీనిలో సాంఘికవ్యవహారములు చక్కఁగా వర్ణించు టయే గాక మానవులలోని లోపములను ఎగతాళిగా ఎత్తుకొని సుకుమారముగా మందలించిన ఘట్టము లనేకము లున్నవి. ఈ కులము - ఆ కులము, అన్న విభాగమే లేక నియోగులను వైదికులను రాజులను వైశ్యులను వైష్ణవులను శైవులను సర్వజనమును - అందును ఆడు - మగ భేదము లేక అందఱిని మతము లన్నింటిని సొగసుగా వర్ణించుచు దేశ చరిత్రకుఁ గావలసిన అంశము లనేకములు చిత్రించి హృద్యము లైన పాటలు పాడించి కమ్మనిపదములు పలికించి ముద్దు వచ్చు సుద్దులు వినిపించి శ్రీనాథుఁడు దేశికవియు నయ్యెను. ఈ నాటకములో వివిధజాతులలోని శాఖలును వారివారి నగలును నాణెములును నడకలును చిత్రవిచిత్రములుగ వర్ణించి తన్మూలమున ఒకవిధమైన దేశచరిత్ర వ్రాసియుంచెను. ఆ చరిత్రలో నాలుగు కొలములలోని కాంతల వృత్తాంతములు వింతలు వినోదములు వర్ణించెను. వేపారిమచ్చికంటులు నియోగి భామలు-కర్ణాటకన్యలు - కాసలనాటి కలువకంటులు-వైష్ణవ వనితలు-నంబిపడుచులు-పూజారిపూబోడులు-అగసాలి యతి వలు-బొందిలీముద్దియలు - జంగముజవ్వనులు - లింగబలిజె యంగనలు-సాతాని యువిదలు - భోగభామినులు-ఒడ్డెయువ తులు-రెడ్డిస్త్రీలు - కుమ్మరికొమ్మలు-జాలరిమిటాగులు-శబర కాంతలు-చాకెతలు-సాలెతలు-బిబ్బీలు - పింజారీలు, ఇట్టివా రెందఱెందఱో ఈనాటకములో వత్తురు. ఈ వర్ణనలచే ఈ మహా కవికి స్త్రీ లోలుఁడు - జారుఁడన్న, అపవాదము సైతము అంటుకొన్నది.

శ్రీనాథుని రచనలలో మనకు నేఁడు దక్కినవానిలో శృంగారనైషధము–భీమఖండము – కాశీఖండము – హరవిలాసము ముఖ్యములు. నిండుజవ్వనములో సంతరించిన శృంగార నైషధమునుగూర్చి కొంత పరిశీలింతము.

సంస్కృతపంచకావ్యములలో మంచి కావ్యముగా పేరు వొందిన నైషధమునుగూర్చియే 'నైషధం విద్వదౌషధమ్' అన్న ఆభాణకము పుట్టినదని కొంద అందురు. కాశీఖండము–నైషధము, ఈ రెండింటిని తెలుఁగుచేసిన శ్రీనాథుని కవితాప్రౌఢినిబట్టియే 'కాశీఖండ మయఃపిండం నైషధం విద్వదౌషధమ్'అన్న ప్రతీతి, ఈ తెలుఁగుకావ్యములు పుట్టినపిదపనే కలిగెనని మఱికొంద అందురు. సంస్కృతనైషధమును వ్రాసినది శ్రీహర్షమహాకవి. అతఁడు చింతామణీమంత్రోపాసకుఁడు. 'శ్రీహర్ష–శ్రీనాథ' నామధేయములలోని విశిష్టతను బట్టికాఁబోలు శ్రీహర్షునకున్న 'చింతామణీదివ్యమంత్రసిద్ధి' అన్న బిరుదమును శ్రీనాథున కన్వయించి ఏనుఁగు లక్ష్మణ కవి యంతవాఁడే తన 'రామేశ్వరమాహాత్మ్యము'లో ఇట్లని భ్రాంతిపడెను:

'మహితచింతామణీ దివ్యమంత్రసిద్ధు
నైషధాదిప్రబంధసందర్భనిపుణు
సకలవిద్యావిశారదు సత్కవిత్వ
పట్టభద్రుని శ్రీనాథుఁ బ్రస్తుతింతు.'

శ్రీహర్షుఁడు సంస్కృతసాహిత్యములో ఎంతవాఁడో శ్రీనాథుఁడు ఉభయభాషలలో అంతవాఁడు. ఆతఁడు చింతామణీదివ్యమంత్రోపాసకుఁడు కాఁగా ఈతఁడు బ్రాహ్మదత్త

వరప్రసాదుఁడు. తన ఆంధ్రీకరణమును గూర్చి శ్రీనాథుఁడే నైషధములో ఇట్లన్నాఁడు:

'భట్టహర్ష కవీశ్వరుండు కవికులాదృష్టాధ్వపాంథుండొన
ర్చిన నైషధశృంగారకావ్యం బాంధ్రభాషావిశేషంబున నశేష
మనీషిహృదయంగమంబుగా...శబ్దం బనుసరించియు నభిప్రా
యంబు గుఱించియు భావం బుపలక్షించియు రసంబు పోషిం
చియు నలంకారంబు భూషించియు నౌచిత్యం బాదరించియు
ననౌచిత్యంబు పరిహరించియు మాతృకానుసారంబునం జెప్ప
బడిన యీ భాషానైషధకావ్యంబు...విలసిల్లు నాచంద్రా
ర్కంబు':—

ఈ చేసిన ప్రతిజ్ఞను శ్రీనాథుఁ డెట్లు నిర్వహించెనో విమర్శకు లనేకులు అనేకవిధాల ప్రస్తావించిరి. శృంగారరస ప్రియుఁడైన శ్రీనాథుఁడు సంస్కృతములోని 'నైషధమును' తెలుఁగున 'శృంగారనైషధము'గాఁ గల్పించెను.

'పరిభవింతుఁ బ్రబంధపరమేశ్వరుని నేవ' అని శ్రీనా థుఁడు తాను పలికిన ధోరణిలో ఎట్టాపెగ్గడ రచనను అక్క డక్కడ అనుకరింపఁగా, ఆయన యనంతరము అల్లసాని పెద్ద నాదు లెందఱో ఆయన యడుగుజాడలలో నడచి తమతమ రచనలకు అందచందములు కూర్చుకొనిరి. అనువాదధోరణి లోనేగాక ప్రబంధరచనలోఁగూడ పెద్దనాదు లందఱకు శ్రీనా థుఁడే ఓనమాలు దిద్దిపెట్టెను. లోకానుభవముగా ఎన్నెన్నో విచిత్రఘట్టములను ఆశువులో వర్ణించి నోరూరించుటలో శ్రీనాథుని మించినవారు లేరు. శాస్త్రరహస్యము లనేకములు అలవోకగా తెలుఁగులో మలచి వినిపించుటలో శ్రీనాథునిది

అందె వేసిన చెయ్యి. ఆయన చేతిలో 'సీసాలు' మైనము వోలె కరగి ఒకతూగులో ఆయన కిష్టమైన నడకలో నడచినవి. సీసము లకు శ్రీనాథుడే మొనగాడని తెలుగు వచ్చిన ప్రతివ్యక్తి మురిసిపోవగా ఆధునికులలో ఒకానొకడు శ్రీనాథునిచేతిలో సీసాలు చెడెనని ఘోషించెను.

ఆంధ్రమహాకవులలో అంతటి భోగపరాయణుడు ఇంకొ కడు లేడు. నిచ్చలు ఇచ్చవచ్చినట్లు హాయిగా ఆరగించి నిర్వి చారముగ కావ్యములు రచించుటయే శ్రీనాథుని మనో రథము. 'ఆ హేమపాత్రభోజనములు-ఆ దీనారటంకాల తీర్థ మాడుటలు - ఆ జాంబునదాంబరాభరణధారణంబులు - ఆ కస్తూరికాసుగంధాంగరాగానులేపనములు - ఆ యుద్యానవన విహారములు' నిత్యము జరుపుకొన్న మహాభోగి ఆతడు. ఆ భోగములకోసమే శరపరంపరగా కావ్యము లెన్నో నిర్మించి కవిసార్వభౌముడయ్యెను. అదేమి విశేషమోగాని కర్ణాటకుడని పేరు పడిన శ్రీనాథుడు 'దేశభాషలందుం దెలుగు లెస్స' అని ముమ్మొదట తెలుగును మెచ్చుకొనగా-కన్నడీడనుకొన్న కృష్ణరాయలుసైతము అదే పల్లవిలో ఆ సూక్తినే ఆముక్తములో అనుకరించెను.

ఒకానొకదశలో సమర్థులైన సమకాలికు లెల్లరు పోయి ధనార్జనము చేయవలసివచ్చి శ్రీనాథుడు పల్నాటిలో సంచా రము చేసెనట. ఆ సంచారములలో సరియైన ఆహారమే అందక ఆ ప్రాంతములో సభ్యత తఱుగైయుండుటఁజేసి 'రసి కుడు పోవఁడు పల్నా'డనుచు చాటువు లెన్నెన్నో వెదఁ

జల్లెనఁట. ఈ ఘట్టములోనివి పట్టుమని నాలుగు పద్యములైన వినవలెనని మనవి.

'అంగడి యూర లేదు, వరియన్నము లేదు, శుచిత్వ మేమి లే,
దంగన లింపు లేరు, ప్రియమైన వనంబులు లేవు, నీటికై
భంగపడంగఁ బాల్పడు కృపాపరు లెవ్వరు లేరు, దాత లె
న్నంగను సున్నగాన పలినాటికి మాటికిఁ బోవనేటికిన్ ?

దోసెఁడు కొంపలోఁ బసుల ద్రొక్కిడి, మంచము, దూడ రేఁయిమున్
బాసిన వంటకంబు, పసిబాలుర శౌచము, విస్తరాకులున్
మాసిన గుడ్డలున్, దలకుమాసిన ముండలు, వంటకుండలున్
రాసెడు కట్టెలున్ దలఁపరాదు పురోహితులింటికృత్యముల్'.

జొన్నకలి జొన్నయంబలి
జొన్నన్నము జొన్నపిసరు జొన్నలె తిప్పన్
సన్నన్నము సున్నసుమీ
పన్నుగఁ బల్నాట నున్న ప్రజ లందఱికున్.

చిన్నచిన్న రాళ్లు చిల్లరదేవళ్లు
నాగులేటినీళ్ళు నాఁపరాళ్లు
సజ్జజొన్నకూళ్లు సర్వంబులును దేళ్లు
పల్లెనాటిసీమ పల్లెటూళ్ళు'.

ఇక్కడ శ్రీనాథుని ఇంకొక్క సంచారమునుగూర్చి బహుశః కొందఱి కప్రియమైనను వినిపింపక తప్పదు.

కర్నూలుప్రాంతములో 'మొరసరాళ్ళు' విస్తారముగా ఉండునఁట. ఈ రాళ్ళవలన ఈ ప్రాంతమున కొకప్పుడు 'మొరసరాజ్య'మని పేరు వచ్చెనఁట. అనఁగా కర్నూలు మండలమును మొరసరాజ్యమని (మసరరా) పూర్వులు వ్యవ

హరించిరి. ఈ ప్రాంతమునకు వచ్చినప్పుడు శ్రీనాథుఁడు చెప్పిన చాటువు లివిగో విందము.

'గొంగడి మేలుపచ్చడము కుంపటి నల్లలు కుక్కమంచమున్
జెంగట వాయుతైలము లజీర్ణపుమందులు నుల్లిపాయలున్
ముంగిట వంటకట్టియలమోపులు దోమలు చీఱిపోతులున్
రంగ! వివేకి కీ మొరసరాజ్యము కాపుర మెంత రోఁతరా!

వంకరపాగలున్ నడుము వంగిన కత్తులు మైలకోకలున్
సంకటిముద్దలున్ జనుపశాకములున్ బలుపచ్చడంబులున్
డెంకగు నోరచూపులును దేఁకువ దప్పిన యేసబాసలున్
అంకులబ్రహ్మ యీ మొరసరాజ్యము నెట్లు సృజించె నక్కటా!'

ఇత్యాది.

'పడమటిసీమ వ్యాపారులు'

శా. 'దస్త్రాలున్ మసిబుట్టలున్ గలములున్ దార్కొన్న చింతెంబళ్ళుల్
పుస్తుల్ గా రెడు దుస్తులున్ జెమటకంపుం గొట్టు నీర్కావులున్
అస్తవ్యస్తపుఁగన్నడంబును భయంబై తోఁచు గడ్డంబులున్
వస్తూ చూస్తిమి గోస్తిమిన్ బడమటన్ వ్యాపారులన్ గ్రూరులన్.

'రేనాటిని గూర్చి'

కం. గరళము మ్రింగితినంచుం బురహర! గర్వింపఁబోకు పో!పో!పో!నీ
విరుదింకఁ గానవచ్చెడి మెఱసెడి రేనాటి జొన్న మెదుకులుతినుమా!

'గురిజాలసీమ'లో 'పులిపాడు'

గీ. ఊరు వ్యాఘ్రనగర మురగంబు కరణంబు కాపు కపివరుండు కసవు
(పుల్ల) నేఁడు (రెడ్డి)
గుంపుగాఁగ నిచట గురిజాలసీమలో నోగు లెల్లఁగూడి రొక్కచోట.

పులిపాడు (ఊరు) శేషయ్య (కరణము) హనుమయ్య (కాపు) పుల్లయ్య (రెడ్డి) వీరు శ్రీనాథుని అనాదరించిరఁట.

'నెమలిపురిని' గూర్చి

కం. నెమలిపురి యమపురముగా యముఁ డాయెను బసిరిరెడ్డి యంతకు మిగులన్
యమదూతలైరి కాపులు క్రమ మెఱుఁగని దున్నలైరి కరణా లెల్లన్.'

ఈ కథలో విషాదాంతముగా శ్రీనాథుని అవసాన దశనుగూర్చియు వినవలసివచ్చుచున్నది.

"సీ. 'కవిరాజు కంఠంబుఁ గౌఁగలించెనుగదా
పురవీధి నెదురెండఁ బొగడదండ
ఆంధ్రనైషధకర్త యంఘ్రియుగ్మంబునఁ
దగిలియుండెనుగదా నిగళయుగము
వీరభద్రారెడ్డి విద్వాంసు ముంజేత
వియ్య మందెనుగదా వెదుఱుగొడియ
సార్వభౌముని భుజాస్తంభ మెక్కెనుగదా
నగరివాకిట నుండు నల్లగుండు

కృష్ణవేణమ్మ గొనిపోయె నింతఫలము
బిలబిలాక్షులు దినిపోయెఁ దిలలుపెసలు
బొడ్డుపల్లెను గొడ్డేటి మోసపోతి
నెట్లు చెల్లింతుఁ డంకంబు లేదునూర్లు.

సీ. కాశికావిశ్వేశుఁ గలసె వీరారెడ్డి
రత్నాంబరంబు లే రాయఁ డిచ్చుఁ?
కైలాసగిరిఁ బంటమైలారువిభుఁ డుండె
దినవెచ్చ మే రాజు తీర్పఁగలడు?
రంభఁ గూడెఁ దెనుంగురాయరాహుత్తుండు
కస్తూరి కే రాజుఁ బ్రస్తుతింతు?
స్వర్గస్థుఁడయ్యె విస్సన్నమంత్రి మఱి హేమ
పాత్రాన్న మెవ్వని పంక్తిఁ గలదు?

భాస్కరుఁడు మున్నె దేవునిపాలి కరిగెఁ
గలియుగంబున నీక నుండఁ గష్టమనుచు
దివిజకవివరు గుండియల్ దిగురనఁగ
నరుగుచున్నాఁడు శ్రీనాథుఁ డమరపురికి.'

రాజాధిరాజులను సైతము మించి కవిరాజుగా కవిసార్వభౌముఁడుగా శ్రీనాథుఁడు ఎంతలేసి వైభవములను అనుభవించెనో అంత దుర్దశలో ఆయన జీవితమును ముగిసినట్లు ఆయన చాటువులే చాటుచున్నవి; పరిశీలింపఁగా–అది ఆయన దుర్గతి కాదు. అది ఆ నాఁటి ఆంధ్రదేశ ప్రజల దుర్గతి. పోత్స్రిలో దాహిత్రులో ఉండియు ప్రయోజకులు ఒక్కరును లేక సంసారభార మంతయు ఆ వార్ధకదశలో శ్రీనాథుఁడే మోయవలసివచ్చెనఁట. ఆయనను అంతదనుక ఆదరించుటలో నేను నేనని ముందునకు దూఁకిన రాజు లందఱు గతించిరి. కొండవీటిరాజ్యము కూలిపోయెను. రాజమహేంద్రవైభవము

రాలిపోయెను. ఎడ్డెతనమునకు పేరువడ్డ ఒడ్డెరాజులు దేశ ములో వచ్చిపడిరి. వాఁడ్రధోరణి వాఁడ్ర దే గావున సాహిత్య గోష్ఠులు చటుబండలయ్యెను. తెలుఁగులోని తియ్యఁదనము ఒడ్డెరాజుల కేమి తెలియును? కవిసార్వభౌముని ఘనతను గూర్చి వాఁడ్ర కేమి పట్టును? ఆదరించెడి ఆంధ్రరాజులే లేని ఆ రోజులలో ఏ పురుషోత్తమగజపతియో-ఏ కపిలేశ్వరగజ పతియో ఏ పాత్రులో అపాత్రులో మహాపాత్రులో ఏలిక లైననాఁడు శ్రీనాథునిగూర్చి ఎవ్వఁడు పట్టించుకొనును? ఆ బ్రదికినరోజులలో ఆయనయే స్వయముగ, విద్వత్కవీంద్రులకు వివిధశాస్త్రనిష్ణాతులకు రాజులచే అగ్రహారము లిప్పించెనే గాని తానుగా మడిమాన్యములు కావలసినవి గైకొనలేదు. రాజ్యము సర్వస్వము తనచేతిలో ఉన్నట్లు-సచివోత్తము లందఱు స్వకీయులన్నట్లు తన భోగభాగ్యములు జరుగు చుండఁగా ప్రత్యేకముగ ఆస్థిపాస్తులు ఆయన గడింపకపోవు టచే ముప్పున ఈ ముప్పును ఆయనకుఁ దప్పలేదేమో!

జరుగుపాటు తగ్గి, కవితావ్యవసాయములో పండఁ బాతిన ఆ జ్ఞానవృద్ధుఁడు పొలాలలోఁ దిరుగవలసివచ్చెను. అదియు'బాపనసేద్యమా'యెను. ఆపైని ఆ చేలను కృష్ణవేణమ్మ ముంచఁగా పంటయే కొట్టుకొనిపోయెను. పోఁగా మిగిలిన ఆ నాలుగు గింజలు బిలబిలాక్షులు తినిపోయెనఁట. తుదకు సిస్తు దస్తుచే గిట్టక కట్టక ఒడ్డెరాజులవలన శ్రీనాథమహాకవి సిలుగు లకు పాల్పడవలసివచ్చెను. ఆయన పడ్డ బాధలు శాశ్వతములు కావుకాని ఆయనను ఆ వయస్సులో బాధపెట్టిన ఆ ఎడ్డెతనపు చేలికల అపకీర్తి శాశ్వతముగ నిలిచిపోయినది.

ఇక్కడ 'వేటూరి' వారి మాటలు రవ్వంత స్మరించి ఈ ఘట్టము ముగింతును.

'బహు దేశములు తిరిగి బహు శాస్త్రము లెఱిఁగి రసవత్కవిత రచించి రాజాధిరాజుల పూజలు గొని విద్వద్గోష్ఠులం దారితేఱి విద్యావివాదములందు విజయము లంది భువనభరిత కీర్తియై పూర్ణపురుషాయుషజీవియై దివిజకవివరు గుండియలు దిగ్గురనునట్లు స్వర్లోకప్రస్థానము సల్పిన మన కవిసార్వభౌముని వంటివాఁడు ప్రఖ్యాతచరిత్రకుఁ ఆంధ్రకవీశ్వరులందు ఇంకొకఁడు లేఁడు.'

శ్రీనాథుని జీవితచరిత్రయనఁగా పదునైదవశతాబ్ది లోని ఆంధ్రదేశచరిత్ర అనియే చారిత్రికు లందురు.

1964-డిసెంబరు

రాయలవారి కావ్యములు

తెలుఁగువాఙ్మయములో నికరమైన చారిత్రికపువిలువ నిలుపఁ జాలిన వేయి సంవత్సరాల 'పరిధి'లో ఒకానొక స్వర్ణ యుగమునకు శ్రీకృష్ణదేవరాయలు ఆయువుపట్టనుట తెలుఁగు వారు మఱువలేరు. ఆతఁడు మహేశ్వరుఁడే కాదు; మహాకవీశ్వ రుఁడును. ఆపై సాహితీసమరాంగణసార్వభౌముఁడు. సామ్రా జ్యమండలిలో విజయనగరసామ్రాజ్యమునకు ఎట్టి విశిష్టత యున్నదని వింటిమో అట్టిదే వాఙ్మయప్రపంచములో రాయల యుగమునకును గలదనుట అక్షరాల నిజము. భౌతికముగ ఆతఁడు బ్రతికినది నలువది యాఱేండ్లే కావచ్చు. ఆతని పరా క్రమ క్రమమునకు సాహితీసంపదకు కవితావైభవమునకుఁ గావలసినంత బలమైన సాక్ష్యము ఆకల్పము నిలువఁగలిగినది అగ్గలముగాఁ గలదనుట నిజము.

విజయనగరసామ్రాజ్యమునకు రాజధానియై వెలసిన ఆ ప్రాంతమును నేఁడు మనము దర్శించుచు-ఆ యవశేషము లను జూచి విస్మయానందములు పొందురీతిగా, రాయలవారి 'ఆముక్తమాల్యదను' జదువఁగా అద్భుతానందములే గాక ఒక సంతాపముగూడ అనుభవింపవలసివచ్చును. భాషారీతిలో వర్ణనాప్రౌఢిలో సంస్కృతాంధ్రప్రబంధములలో తలమా నికమై తెలుఁగున పంచకావ్యములలో పైస్థాయిలో ప్రస్తుతి గన్న 'ఆముక్తము'లో రాయలవారు ప్రాసితినని చెప్పిన

కావ్యములు ఈ నాఁడు కొన్నియైన మనకు దక్కకపోవుట విధివిలాసమే కావచ్చును. సంస్కృతాంధ్రములు రెండింట ఇంతటి ప్రౌఢకావ్యములు వ్రాసిన కవీశ్వరులు మఱెవ్వరును లేరు. గీర్వాణములో ఆరితేఱిన మహాకవు లుండవచ్చును. తెలుఁగులో పేరు వెలసిన మహామహులు కన్పింపవచ్చును. ఉభయభాషాకవులనియు ఉభయకవిమిత్రులనియు వ్యవహారములో వినఁబడువారేగాని ఉభయభాషలలో ఈ తీరుగ కావ్యరచన చేసి పేరు పొందినవారు వేఱెవ్వరును లేరు.

రసజ్ఞులు మెచ్చుకొనురీతిలో ఉత్ప్రేక్షోపమలు-స్వభావోక్తి, 'మదాలసచరిత్రలో' రాయలు వర్ణించెనఁట. 'సత్యావధూవ్రీణనప్రబంధము,' భావము-ధ్వని-వ్యంగ్యము ఇత్యాదులకు కేంద్రమైనదఁట. పేరునుబట్టి చూడఁగా 'పారిజాతాపహరణ' కావ్యమునకు దీనికి సంబంధబాంధవ్యములు ఉండవచ్చునని తోఁచుచున్నది. మూఁడవది 'సకలకథాసారసంగ్రహము'. వేదములు-పురాణములు-ఉపసంహితలు ఏర్చి కూర్చి రాయలు దీనిని రచించెనఁట. పాఠకులయు శ్రోతలయు పాపపుంజములు పటాపంచలగునట్లు మంచిమాటలలో నేర్పు చూపుచు 'జ్ఞానచింతామణిని' ఆతఁడు వ్రాసెనఁట. మధురాతిమధురమైన 'రసమంజరి' వంటి కావ్యము లెన్నింటినో రచించెనఁట. ఇట్టి ప్రబంధములను గీర్వాణములో వ్రాసిపెట్టించుకొన్న నీకు ఆంధ్రభాషలో వ్రాయుట అసాధ్యమా! యని భగవదాజ్ఞాక్యముగా ఆతఁడే 'ఆముక్తము'లో వ్రాసికొనెను.

ఈ కావ్యము లన్నియు ఏమైనవి? తాను వ్రాయ

కయే వ్రాసికొన్నట్లు వ్రాసిన కవీశ్వరుని నాఁటి స్వర్ణయుగ ములో ఎవ్వరైన క్షమింతురా? విజయనగరసామ్రాజ్య పతనముతోపాటు తెలుఁగుజాతికి దురపిల్లిన దుర్గతిలో ఇది యొక దుర్గతికాఁబోలు!

పైగా - ఆము క్తమాల్యదపైతము ఆతని వ్రాఁత కాదన్న వదంతులు దేశములో లేకపోలేదు. ఆ వదంతులే నమ్మి పద్యాలలో బిగించిన పెద్దలు పైతము మనకుఁ గలరు. ఈ దురవస రాయల కొక్కనికే కాదు; జాతిద్వేషదూషిత మైన ఈ దేశములో శ్రీహర్షాదిసంస్కృతకవీశ్వరులకే కాక 'నన్నెచోడుఁడు-చిన్నయసూరి' వంటివారికిపైతము ఈ 'అల్లికలు' తప్పలేదు.

రసమయమైన మహాకావ్యమగు 'వసు'వును వ్రాసిన రామరాజభూషణకవిసార్వభౌముఁడు 'నానాసూనవితాన వాసనల' వంటి ఒకానొక పద్యమును వ్రాయలేక ఒకానొకని వద్ద 'అప్పు' తెచ్చుకొన్నట్లు తప్పుడు వ్రాఁతలు వ్రాసినవారు మనకుఁ గలరు. మధురాతిమధురమైన కావ్యములను 'చేమకూర' వ్రాసెననఁగా ఆహా! అతఁడు నియోగి వంశ్యుఁడు' గాదా యని కథలు కల్పించి వెంకన్నను వెంకటరాజుగాఁ జేసిన పుణ్యాత్ములు మనకుఁ గలరు.

'ఉపమ గలిగిన శయ్యల నొప్పియున్న
నంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు;
పాయసంబైన సంస్కారపక్వమైనఁ
గాకజుష్టంబు హవ్యంబు గానియట్లు'

అని శాసించిన దుష్టలాక్షణికులు మనకుఁ గలరు. రామరాజభూషణునిరత్నఖచితమైనచారుమ స్తకమును దన్నిన వానిని బెక్కుభంగుల గణుతింతునని మొత్తుకొన్న దురహం కారులు మనకుఁ గోకొలలు.

ఇట్టి వాతావరణముతో దండిగా నిండిన మన దేశ ములో 'ఆముక్తమును' ఎవ్వఁడో వ్రాసి రాయలపేరు పెట్టె నని వార్త పుట్టించుటలో అబ్బుర మేమున్నది ?

ప్రబంధ మొకటి నాపేరఁ జెప్పవయ్యా? ఉత్తరోత్తరాభి వృద్ధి నీ కగునని రాయలవారికి కలలో ఆంధ్రవిష్ణువు చెప్పి అంతర్ధానమయ్యెనఁట. తెల్లవాఱినపిదప పేరోలగముండి రాయలు ఎల్లవారికి స్వప్నవార్త వినిపింపఁగా పలువురు పలు తీరులలో ఈ విషయమై ముచ్చటించిరఁట.

'దేవదేవుఁడే కలలో వచ్చుటఁజేసి సర్వశుభప్రాప్తి-స్వప్నసాక్షాత్కారముచే భక్తిప్రపత్తి-ప్రబంధనిబంధనము కావింపుమనుటచే అద్భుతసారస్వతోద్బోధనము-దేవీసమాగ మమనుటచే అఖండభాండాగారసమృద్ధి, ఇత్యాదిశుభపరం పర లెన్నో యున్నవని సభాసదులు నిర్ణయించిరి. ఇట్టి యంశము లన్నియు అక్షరాల వ్రాసి ప్రబంధనిబద్ధము చేసిన రాయల వారిని 'ఆముక్తమునకు' కర్త కాఁడేమోయని సందేహించుటలో ఏవేవో అంతరార్థము లుండవచ్చును.

ఆముక్తమునకు బృహద్వ్యాఖ్య వ్రాసి త్రవ్వి తఱచి అందలి సుధారసమును జుబ్బనజూఱక జుఱ్ఱి లోకమున కందించిన 'వేదము'వారుసైతము ఈ వాదములో వ్రేలు వెట్టియు గట్టి తీర్పు చెప్పకపోవుట కాలవైపరీత్యము. రాయలు దాసీ

పుత్త్రోడుగదా! ఆతనికి వేదాంతఘట్టము లెట్టు తెలియును? తెలిసినను కవితలో ఎట్టు వ్రాయఁగలుగును? ఇత్యాదిశంకలు తెచ్చిపెట్టి వాని కెన్నో సమాధానములు చెప్పి రాయలు సర్వజ్ఞుఁడనియే 'వేదము'వారు తేల్చిరి. తేల్చియు, పెద్దన్న ఆముక్తమును వ్రాయలేదనుటకు లాఁతివారు చెప్పిన కారణములు కారణములు గావని ఖండించిరి. ఒకవైపు రాయల వారి ఆంధ్రగైర్వాణకావ్యాది వాఙ్మయపాండితీప్రాభవమును గుణాతిశయమును పరమభాగవతతత్త్వమును ప్రాతిభచక్షుస్సును సర్వాంకషపాండిత్యస్ఫోరకమైన కవనగుణములను మేలైన నానుడులను సంప్రదాయాదులను 'వేదము' వారు సోదాహరణముగ బోధపఱిచియు 'ఆముక్తమునకు' రాయలే కర్తలని ఘంటాపథముగ నిర్ణయింపలేదు. ఆ ఘట్టములో శాస్త్రిగారన్న మాట లివి:

'రాయలవారు తొంటి భర్తృహరివోలె మహాప్రతిభలు-కలావంతులు - కవితాస్త్రీలోలురు. కానిచో అష్టదిగ్గజములను ఏల చేర్చుదురు? వారి నేల నిరంతరము బహూకరింతురు? అట్టి కవితారసమగ్నులు కవనమును సహవాసబలము చేతనేనియు అల్లనుగూడ సమర్థులగుదురు. వారే రచించినట్లు గ్రంథములో నున్నది. కొండంత స్వప్నకథ నిబద్ధము. కావున దీనిని పెద్దన్నగారి తోడ్పాటున రాయల వారు రచియించి యుందురనియు నెన్నవచ్చును.

ఇక్కడ మఱొక్క చిన్నకథ జ్ఞప్తికి వచ్చుచున్నది. ఈ 'వేదము'వారి తండ్రిగారి పేరు వేంకటరమణశాస్త్రిగారు. ఆయనయు చిన్నయసూరియు సహపాఠులఁట. చిన్నయ

సూరి ప్రఖ్యాతి, తమ తండ్రిగారిమూలమున వేదమువారికి లెస్సగాఁ దెలియునఁట. అసలు-సూరి బాలవ్యాకరణమును వ్రాయలేదనియు, 'శిష్టు'పండితు లెవరో వ్రాసిన సంస్కృత కారికలకు 'సూరి' తెలుఁగుమాత్రమే చేసెననియు ఒకానొక ప్రవాదము దేశములో పొక్కఁగా - అది తప్పనియు, సూరియే బాలవ్యాకరణమును వ్రాయఁగా ఆ'శిష్టు' పండితుఁడే సంస్కృతానువాదము చేసెననియు పండితగోష్ఠిలో వేదమువారు చెప్పినట్టు కథలు విందుము. పైగా - ఈ శాస్త్రిగారి మనుమఁడు ఇటీవల వ్రాసిన తాతగారి జీవిత చరిత్రలో ఈ మాటలు వ్రాసి పెట్టిరి.

'నాయనగారు (వేంకటరమణశాస్త్రిగారు) శిష్టు కృష్ణమూర్తిగారికి గుంటూరు కాకినాడలలో పరిచితులు. కృష్ణమూర్తిగారికి చిన్నయసూరిగారితో కాళహస్తి - వేంకటగిరి సంస్థానములలో ఘర్షణ, కృష్ణమూర్తిగారు బాలవ్యాకరణమును 'హరికారిక' లను పేర సంస్కృతమున అనువదించుట, వారి యసత్యవాదము, అట్లు చేయఁగూడదని మా నాయన గారు కృష్ణమూర్తిగారిని హెచ్చరించుట'

—[వేదము వేంకటరాయశాస్త్రులవారి జీవితము 9 పుట]

ఇట్టి గట్టివార్త తెలిసియున్న వేదమువారు బాలవ్యాకరణమునకు చిన్నయసూరియే కర్తయని ఒక్కమాట తమ గ్రంథములలో ఎక్కడేని వ్రాసెనా? లేదు లేదు. వాదోపవాదములలో సత్యము తెలిసియు లోకమునకుఁ జెప్పక పోవుటయు ఒక నేరమికాదా? ఇంచుమించు ప్రత్యక్షముగా సర్వము తెలిసికొనియున్న ఈ ఘట్టములో ఈ వేదనువారు

ఈ త్రోవలో నడువఁగా, ఆముక్తమును రాయలే వ్రాసె నని అంతరాత్మలోఁ దెలిసియు ఏల నిర్ణయింతురు ? పాండిత్యమునకు స్వభావమునకు సంబంధము ఏముండునుగనుక ? 'ప్రకృతిః దుస్త్యజా' అని భారవి మహాకవి చెప్పనే చెప్పెను గదా !

ఆముక్తమును - మనుచరిత్రమును ఒకచేతిలో పెట్టుకొని చదివిన రసజ్ఞుఁ డెవ్వఁడు, ఆముక్తమునకు పెద్దన కర్త యని గుండెమీఁద చేయి వేసి చెప్పలేఁడు.

వెనుక కొందఱు చెప్పిరికదా ? చాటువులలో బంధించిరిగదా ! అన్నదానికి సమాధానము - ఈ దేశములోని జాతిద్వేషాది దుష్టవాతావరణమే మూలమనుటలో సందేహమే లేదు.

రాయలు 'జాంబవతీపరిణయ' మను నొక కావ్యమును వ్రాసెనని 'ఆంధ్ర'లో ఒకప్పుడు 'భావరాజు'వారు మచ్చునకు కొంతభాగ మిచ్చిరి. భవభూతి - జగన్నాథుఁడు - విద్యానాథుఁడు మున్నగు మహామహులువోలె యావద్భారతములో పేరు మోయఁదగిన గీర్వాణకవి రాయలవారి కావ్యములను ఎవ్వరేని అచ్చునకుఁ దెత్తురా యని పత్రికామూలమున దేవురింపవలసిన దుర్దశ తెలుఁగువారికిఁ బట్టినది. ఇతర సంస్కృతకవులలో ఎవ్వరుగాని దేశ్యభాషలలో ఇట్టి పేరు పెంపులు గడించినవారు లేరనుట మఱొకసారి మనము స్మరింపవలెను. మూఁడు నాలుగు భాషలలో సిద్ధహస్తుఁడై గీర్వాణములో పెక్కు కావ్యములు రచించి 'ఆముక్తము' వంటి మహాకావ్యమును సృష్టించి యిచ్చి 'దేశభాషలందుఁ

దెలుఁగు లెస్స' యని మురిసిపోయిన ఈ మహామహుని తెలుఁగు నేలలో 'వర్ధంతులు' చేసియు 'జయంతులు' కావించియు స్మరింపవలదా ?

ఈతని వంశములోని 'అంశము' వారము మేమని ఉవ్విళ్ళూరుచు ఈతని విగ్రహము నింట నుంచుకొని నిచ్చలు నారాధించుచు, ఏవేవో రాచపోకడలలో ఉన్న ఈ నాఁటి 'ఆనెగొంది' రాజవంశ్యులైనను ఈ మాత్రము వాఙ్మయసేవ చేయుటలో ముందునకు రావలదా? బద్ధదీక్ష యున్నచో ధనముమాట ఒక యాటంకమా? పోనీ, ఆంధ్రవిశ్వవిద్యాలయమువారు తంజావూరికిఁ గొందఱను దరలించి ఏవేవో మాఱుమూల కావ్యములు తెప్పించి యిచ్చిరే! ఆ పాటి సుకృతమునకు రాయలవారి వాఙ్మయము నోఁచుకొనలేదా? ఆ కావ్యము లెల్లను జూచి చదివి ఆనందించు అదృష్టము ఆంధ్రులకు లేదా!

[1960-డిసెంబరు]

'ఆముక్తము' లోని వర్ణనావైదుష్యము

కాకతీయసామ్రాజ్యలక్ష్మీ వైభవమునకు మాఆకుమోలె పొడమి, అనుస్యూతమై సాగిన విద్యానగరసామ్రాజ్యములో విశిష్య-స్మరింపఁదగిన దివ్యమూర్తి శ్రీకృష్ణదేవరాయలు. ఆతఁడు సాహితీసమరాంగణసార్వభౌముఁడు. ఆతని ఏలుబడిలోని ఘనత ఒక యెత్తుగా, 'భువనవిజయ' విశిష్టత ఒకయెత్తుగా చరిత్రలో నిలిచినవి.

'కాకే రాజులు రాజ్యముల్ గలుగవే' అన్నట్లు ఒకవేళ భౌతికముగా విద్యానగరచరిత్రనుగానీ రాయలవారి జైత్రయాత్రావృత్తాంతమునుగానీ మనము మఱచినను - ఆతఁడు తెలుఁగుసాహిత్యక్షేత్రములో తెప్పించి నెలకొల్పిన 'పారిజాతమును' గానీ, ఆతని యండదండలచే అనారతము అపూర్వగౌరవ మందిన పెద్దనగారి 'మనువును' గానీ మఱచిపోలేము. ఆ రెండింటిని జక్కఁగాఁ జవి చూచినవాఁడు 'ఆముక్తమును' జదివికాని ముక్తి పొందనేరఁడు. తీర్థము స్వార్థము అన్నట్లు సాహిత్యముగా ఒక ధోరణిలో ఆధ్యాత్మికముగా మఱొక ధోరణిలో మన్నింపఁదగిన మహాకావ్యము 'ఆముక్తమాల్యద'.

ఆ మహాకావ్యములోని సొబగులు గుచి చూడవలెనన్న సాహిత్యములో పుష్టి చాలినంత సంపాదింపవలసియుండును. 'మనువు' కుదిరి 'వసువు' కూడఁబెట్టి గృహస్థుగాఁ గొంత

జ్ఞానము గడించినవెనుక 'ఆముక్తమాల్యదను' సేవించి ఆ జీవి తరింపవలెనని ఒక చమత్కార మున్నది. అట్టి 'ఆముక్తము' లోని వర్ణనాఘనతకు ఈడుజోడు కాఁగల కావ్యములు తెలుఁగులో సంస్కృతములో రెండో మూఁడో మాత్ర ముండును. మురారిభట్టు-నన్నెచోడుఁడు-కంబరామాయణకర్త, ఇట్టివారుమాత్రమే వర్ణనావైదుష్యములో రాయలవారి పంక్తిలోఁ గూరుచుండఁదగినవారు.

అట్టి 'వర్ణనాప్రౌఢి' గుర్తింపవలెనన్న మున్ముందుగ ఆ భాగములో కొంతవఱకు వర్ణనలను నా మాటలలో వ్రాసెదను. ఆవల వీలునుబట్టి ఆ వైదుష్యమును బరిశీలింప వచ్చును.

ఆముక్త మనఁగా ధరించినది. తాను ధరించిన మాల్యమును మన్నారుస్వామికి సమర్పించినది కావున గోదాదేవికి 'ఆముక్తమాల్యద' యని పేరు గలిగినది. ఆమె తండ్రిపేరు విష్ణుచిత్తుఁడు. ఆయన కృష్ణస్వామికి మహాభక్తుఁడు. పాండ్యదేశమందలి నగరము లన్నింటికిని విలుబుత్తూరుపట్టణము నాయకమణివంటిది. ఆ పట్టణమందలి మన్నారుస్వామి కోవెలలో విష్ణుచిత్తుఁడు పూజారి. ఆయన భక్తిప్రపత్తులను వర్ణించినది కావున ఈ కావ్యమునకు 'విష్ణుచిత్తీయ' మని మఱొక పేరు వ్యవహారములో వచ్చినది.

ఈ మహాకావ్యములో రాయలవారు 'పురవర్ణన' చేయుచు మున్ముందు పేర్కొన్న ప్రధానాంశము లివి :—

1. పురిలోని మేడలు మిద్దెలు
2. వీధులు

3. ఉద్యానంపు లోత్రోవలు
4. ఉద్యానవనములు
5. లక్ష్మీనారాయణ రథద్వయము
6. వారాంగనలు
7. ద్రవిడాంగనలు
8. పొలాలు
9. కోవెల
10. విష్ణుచిత్తుని దినచర్య

ముందుగ ఒకసారి ఈ యంశములను మనమాటలతో ముచ్చటించుకొందము.

విలుబుత్తూరులో ఎక్కడఁ జూచినను బంగారు మేడలు శృంగారములు కులుకుచు మిన్నంటి యుండును. వానివాని చూరులలో శుకపికాదుల బొమ్మలు పురకతమాణిక్యములతో చక్కఁగాఁ జెక్కిపెట్టిరి. ఆ ప్రక్కగా నున్న ఉద్యానవనము లోని శుకపికాదుల కూఁతలు విని వీధిని బోవువారు ఆ బొమ్మలే కూయుచున్నవని భ్రమపడెదరు.

ఆ పట్టణములో నీధు లన్నియు సూత్రము పట్టినట్లు వంకరటింకరలు లేక తిన్నగాఁ గానవచ్చును. ఆ వీధులలో ఒకవంక మంచిమంచి కొబ్బరిచెట్లు కనిపించును. రత్నస్థగితములైన ఆ ముంగిళ్ళలో నిండారఁబూచిన ఆ కొబ్బరిచెట్లు ప్రతిబింబింపఁగా-ఆ పూవులు ముగ్గుగా, మట్టలు ఆకులు గోమయ మలికిన తావులుగా చూపఱకుఁ దోఁచి, ఇంటివారి ప్రయత్న మేమియు లేకయే 'అలికి ముగ్గులు వెట్టినట్లు' అలంకారములు కూర్చుచున్నవఁట.

ద్రావిడస్త్రీలు పసుపుపూఁతతో చక్కఁగా స్నానము చేసి, చెంగల్వాడిగ్గియలో స్వామి యభిషేకార్థమై మంచినీరు ముంచుకొన్న బిందెలను రొండియందు గీలించి, పూజకోసమై కోసి, కేలఁబట్టిన తామరపూవులు ఆ తీర్థపుబిందెలమీఁద తడబడుచుండఁగా, ఆ సన్నని నడుముమీఁద బరువైన చందోయి ఊఁగుచుండఁగా 'ద్రావిడప్రబంధమును' జదువు కొంచు వీధులలో జనసమ్మర్దమునకు జంకి ఉద్యానములోని లోత్రోవలలో నడచుచుందురు.

ఆ పట్టణములోని వారాంగనల వైభవము అత్యద్భుతము. ప్రధానవీధులందు అరుగులమీఁదఁ గూరుచుండి ఆ యాటవెలఁదులు జూదమాడుతరుణములో దారిని బోవుచు ఒకసారి ఆ గాజులమ్మోత వినెనా సన్న్యాసియైన అమాంతము గుండె జల్లుమని అట్టె రాపడి వాండ్రకు లొంగిపోవునఁట. ఎంతవారు ఎదురైనను మొగ మెత్తిచూడని వాండ్ర పరాకుఁదనము మన్మథుని సైతము పిచ్చిబికారినిగాఁ జేసివైచును. ఆ యాటలో అంత తమకము చూపినను, భక్తు లెవ్వరైనఁ గన్పించిరా అమాంతము దోసిలి యొగ్గి వాండ్రు జోహారు సేయుటలు చూచి దేవేంద్రుఁడంతవాఁడు వాండ్ర కొలువు కోసమై కావలెనని కులుకుచుండును. కోవెలలోని పూజా సమయమునుబట్టి వినఁబడుచున్న శంఖధ్వానమునకై ఆ యువతీబృందము వీనులు త్రిప్పి ఆ వంక చూడఁగా ఆ చూపులు మలుకులై చూపఱుకుఁ దగిలి హృదయములు కలఁతవెట్టును.

తాంబూలచర్వణమువలన ఎఱుపెక్కిన పలువరుసను వరిగింజతో తోముకొని తెల్లగాఁ జేసికొనుట వాండ్ర విద్య

లలో ఒక విద్య. ఒరసికొన్నను రవ్వంతైన వలువకు అంట నీయక, ఒంటియండె లీనమై నిగ్గులు దేఱునట్లుగా పసుపు పూసికొని చక్కఁగా స్నానము చేయుట వారి దినచర్యలలో ఒకటి. ఎవఁడు ఏ కొలమువాఁడో అట్టె చూచి త్రుటిలో గ్రహింతురఁట. అన్నాళ్లు తమ్మె ఆశ్రయించిన విటులలో ఎవ్వఁడేని ఎత్తుపడిపోయెనా వానిని వాండ్రే ఆదరించి పోషింతురు. ఒక 'రాణివాసముగా' హుందాతనముతో నుందురు. కావ్యములు చెప్పవలెనన్న వ్రాయవలెనన్న – ఆ వెలఁదులు సాహిత్యములో సైతము చేయి తిరిగినవారే.

ముత్యాలహారము లన్న ముత్యాలవలయము లన్న ఆ యంగనలకు మిక్కిలి మక్కువ. చిలుము పట్టునేమో యని బంగారునగలను అంటుకొనరు. జవ్వాది జిడ్డుగా నుండునని తోఁచి కస్తూరి ఒంటికిఁ బూసికొందురు. పూవులు చెమ్మగా నుండునని వానిని ద్రోసివైచి ధూపము వేసికొందురు. ఎప్పుడును జిలుగువలువలేగాని ముదుక గుడ్డలను దరికి రానీయరు.

తక్కువజాతివాఁడో కుంటియో గ్రుడ్డియో ముసలియో ముతకయో ఎవ్వఁడో వచ్చి ఎంతో సొమ్మ్ము ఇత్తుమని బులిపించినను, ఆ మాటలకు మురిసిపోయి వాండ్రు చెలికత్తెలు ఆ గుబ్బగ ఆ వార్తలు వినిపించినను ఆ యంగనామణుల చెవుల కవి బొత్తిగా సోఁకవఁట. ఎందువల్ల? ఆ చెవులు 'శ్రీ'లు కాఁబట్టి. అనఁగా 'శ్రీ' కారతుల్యాకారము లనుట.

ఆ పట్టణములో ఇంటింటను మంచిమంచి సరస్సులుండును. అవయల్లాండ్రు ఆ సరస్సులలో జలకమాడుచు,

పై మెట్టుపై పసుపుకొమ్మ అఱుగఁదీయఁగా-ఆ పసుపు నీరు మెట్టుక్రిందికి జాఱి ఆ క్రింద నిద్రించు అంచల పెక్కలపైఁబడి పసిమిరంగు పూయఁగా, ఆ బంగారురంగుల పెక్కలతో ఆ యంచలు ఊరిలో సంచరించుచుండఁగా - వానిని జూచి ఊరివారు 'ఒహో! ఇవి ఆకాశగంగలోని బంగారుపెక్కల హంసలే సుమా' అని భ్రమింతురఁట.

ఆ పట్టణమున కానుకొని మేలైన తోఁటలు విలువ గల మాగాణిభూములు ఎన్నో ఉన్నవి. వరిమళ్లకు నీరు పాఱించు పంటకాలువలలలో ఉదయవేళలలో బాతులు చేరి పెక్కలలో తల దూర్చుకొని నిద్రవోవుచుండును. ఊరి కాపరి వాండ్రు-ఆ ప్రాంతమునకు వచ్చి అంతకుముందే అక్కడ స్నానము చేసిపోయిన బ్రాహ్మణుల 'పిండినగుడ్డలే' సుమా! యని భ్రాంతిపడి, వానిని దీసికొనిపోయి వారి కిత్తుమని తలంచి రేవులలో దిగిరో లేదో ఆ సందడికి దందడికి ఆ బాతులు అదరి బెదరి లేచి బుఱ్ఱున ఈఁదుకొంచు ఆవలికిఁ బోవుచుండఁగా పైరుకాపరి పడంతులు పకపక నవ్వెదరఁట.

ఊరి వెలుపలి తోఁటలకు మాగాణిభూములకు గుణ గణములలో 'పోటీ' వచ్చిపడినది. పూఁదోఁటలలో తీగ మల్లియ లున్నవి. ఖర్జూరపుఁబువ్వ లున్నవి. మామిడిపూ గుత్తులకు లెక్కలేదు. సంపెంగలు పచ్చగన్నేరులు పోఁక పూవులు లోనగువానికి అంతు లేదు. సరిగా ఈ పేరులతోనే పిలువఁబడు వరిపైరు లన్నియు ఆ మాగాణులలో దండిగా ఉన్నవఁట. పైగా వానిలో నున్న 'రాజనాల' వంటివి తోఁట లలో లేవు. కాన తూకములో ఈ చేటే ఆ చేలకన్న ముల్లు

సూపినవి. క్రొత్తసుముల్లు క్రొమ్మొగ్గినవై పే జయ మన్నమాట. పైపై గా 'రాజనాల' వరికి ముల్లు జొ స్తి. ఈ పోటీలో ఓడిన తోఁటలను జూచి మాగాణిభూములు నవ్వుచున్నవి. వానికి 'దాఖలా' ఇదిగో! మాగాణిభూములలో బెగ్గురు పిట్టలు నిండియుండుట. అవి తోఁటలవంకకుఁ బోవు. ఆ వాలిన పక్షులవరుసను జూడఁగా, ఈ భూములు ఆ భూములను జూచి 'ఓహో! రాజనాలు మీకు లేవుగదా!' అని హాస్యమాడు చున్నట్లును, ఆ లోపము మీకుఁ దప్పదని అన్నట్లును స్ఫురించును. కాఁగా ఆ దేశము నానాపుష్పశాలిసమృద్ధమై సుభిక్షమై యున్నదని సారాంశము.

నీటి 'ఒనరు' చక్కఁగా ఉన్న ఆ పొలాలలో పంటలు సమృద్ధిగా పండుచున్నవి. వరిచేలకు చుట్టును మంచి పంట కాలువలు, వానిలో చెంగల్వాలు దండిగా నున్నవి. అదనులో రైతులు కోఁతల కెగఁబడి చేలలో నీటిని వెలుపలికి వెళ్ళఁ గొట్టిరి. ఆ పైరు లప్పుడు పండి, ఎన్నుల బరువుచే ఒఱిగి గాలిదెబ్బకు కాలువలలోని చెంగల్వలపయి తమతలలు జాఱి వైచి జుంజుమ్ముండ్లను అటునిటు రాచుకొనుచున్నవఁట. దానికి కారణమిది :— అయ్యో! ఇన్నాళ్ళుగా నీళ్ళలో నిలిచి నీరు కడుపారఁ ద్రావితిమే. ఇప్పుడు క్రొవను ఒక్క చుక్కైన లేదే. అని డప్పిగొని స్రుక్కిసోలి, అందాఁక నీరు క్రొవ్వుటకై సాధనముగా నుండిన తమ వేళ్ళను నెత్తిమీఁదికిఁ దెచ్చుకొని వానివలన హాయిగా చెంగల్వాలలోని మకరంద మును ద్రాగుచున్నవఁట.

ఒకప్రక్క తోఁటలలో సుగంధిఅరటులు వేసిరి.

కాయలు తెగఁగాచి పైనుండి క్రిందికి దండిగా గెలలు దిగి నేలకు పొడుచుకొనుచున్నవి. ఆ వైఖరి చూడఁగా పెద్దపెద్ద సంపెంగపూలతోఁ గట్టిన లావుపాటి 'మాలలు' వోలె కంటి కింపుగాఁ గానవచ్చును. ఆరబ్రుగ్గిన ఆ పండ్లచివర నల్లగా నున్న ఆ భాగము, సంపెంగలమీఁద వ్రాలి మూర్ఛించిన తేటిగుంపులను జ్ఞప్తికిఁ దెచ్చుచున్నది.

ఇంకొకవైపు చెఱుకుఁదోఁటలు. ఆ తోఁటలలోనే పోఁకవ్రాఁకులు – తమలపాకు తీగలు పెరుఁగుచున్నవి. ఈ తీవెలు పోఁకవ్రాఁకుల కల్లుకొని తుదిదాఁక వ్రాఁకి నిగిడి యున్నవి. పోఁకమట్టలు ముదిరిపోయి బరువెక్కి, క్రిందగా నున్న చెఱుకుగడలమీఁదఁ బడుచుండును. ఆ దెబ్బకు ఆ గడలు విఱిగి, వానిలో ముత్తెములు చెదరి, దగ్గఱగా బెల్లము కాఁచుచున్న ప్రొయ్యిలోఁ బడి చిటపట చిటిలి సున్న మైపోవును.

ఇది యొక విచిత్రవర్ణనము. తమలపాకుతీవె ఒక నాయిక. పోఁకచెట్టు ఒక నాయకుఁడు. ఆ నాయిక ఈ నాయకుని మెడ కౌఁగిలించుకొని ఈ క్రిందనున్న చెఱుకులలోని ముత్తెముల సున్న మే సుమా మన ప్రేమను పెంచు మందు- అని హెచ్చరించినట్లును, నాయకుఁ డట్లే యని సమ్మతించి ఆ పని చేసినట్లును అర్థస్ఫూర్తి. పోఁకచెక్కలు – తమల పాకులు-సున్నము కలిసినచో ఎఱుపు కలుగుట సహజము. మూలికలు చూర్ణము చేసి తాంబూలములోఁ గలిపి ఇచ్చి వశీకరించుకొనుట లోకములో ఒక ఆచారముగదా! చెఱుకులోఁగూడ ముత్తెము లుండునని రత్నశాస్త్రములో చెప్పిరి.

మన్నారుస్వామి కోవెలలోనున్న ధ్వజస్తంభము చాల పెద్దది. దాని కొన నున్న చిఱుగంటలు రాత్రులలో మలయ మారుతము వీచినప్పుడు ధ్వని చేయుచుండును. ఆ ప్రక్కగా కోవెల ప్రాకారపుటంచులలో సంపెంగచెట్లమీఁద నిద్రించు పక్షులు-ఆ ధ్వని విని బిత్తఱపోయి వేఁకొక్కని రొదచేయును. ఆ రొదను విని వేకువజామయ్యెనని ఊరిలోని ఆలుమగలు భ్రమపడి అలుకలు మాని కలసెదరఁట.

కోవెల వీధిలో ఇండ్లముంగిళ్ళ ధాన్య మెండఁబోసి ద్రవిడకన్యలు కావలి యుందురు. అంతలో కోవెలలోని దుప్పిపిల్ల అదాటుగా వచ్చి ఆ గింజలు నాలుగు బొక్కిళ్లు పట్టి చుండఁగా దానిని వారు కఱ్ఱులతో గడ్డలతోఁ గొట్టరఁట. అప్పుడే పల్లెటూరి అమ్మి, ప్రేఁపగంపలలోఁ బెట్టుకొని చెంగల్వదండలు అమ్మకమునకుఁ దెచ్చును. వానిని దమ కొండెలమీఁద ధరింపవలెనని తమకపడి ఆ కన్నెలు వానిని విలిచికొనియు, సమయములోఁ దమకు లేకపోయిన మానె యని, దుప్పిపిల్లమీఁద విసిరి దానిని త్రోలుదురు. కోవెల లోని దుప్పిపిల్ల కావున దానిమీఁద వారికి అంత మమ కారము.

అట్టి వైష్ణవభక్తి అగ్గలముగా నెలకొనియున్న ఆ పట్టణములో కారణజన్ముఁడుగా పుట్టియున్న విష్ణుచిత్తుఁడు సామాన్యుఁడాయెఁ! మొగమున బ్రహ్మవర్చస్సు ఉట్టిపడు చుండును. ఆతఁడు సుఖదుఃఖాదిద్వంద్వములకు అతీతుఁడు. ధ్యానయోగముచే శ్రీహరిని సాక్షాత్కరింపఁజేసికోఁగలిగిన మహాభక్తుఁడు. ఆ ప్రాంతమునఁ బోవు వైష్ణవుల కందఱకు

న్యాయార్జితవిత్తముతో నిత్యము విందులు కుడుపుచుండును. నిష్ఠాగరిష్ఠుఁడైన ఆ విష్ణుచిత్తుని యింటిలో అర్ధరాత్రము లందుసైతము హరికథలు ఆలకింపవచ్చును. అచ్చముగా స్వచ్ఛముగా ద్రావిడవేదపారాయణము మాఱుమ్రోగు చుండును. తీర్థయాత్రకు వచ్చిన భాగవతులలో ఎవ్వరి కేది కావలెనో అయ్యది వారికి భక్తిప్రపత్తులతో సమర్పించు కొనుటయే విష్ణుచిత్తుని నిత్యకృత్యము.

రాయలవారి వర్ణనాపైచిత్రికి ఇది దిక్సూచి. మహా రాజాధిరాజు అయ్యు తనదేశములో ఏ మూల ఏ వీధిలో ఏ యింటిలో ఏమి జరుగునో తెలిసికోఁగలిగి నేర్పు గడించిన శ్రీకృష్ణదేవరాయలు తన మహాకావ్యములో జానపదుల కృత్యములనుగూడ చిత్రించియుండుట గమనింపఁదగ్గ ఘట్టము.

సంస్కృతాంధ్రాదిభాషలలో పాండిత్యము గడించి ప్రౌఢకవితావైభవముతో భక్తిప్రపత్తులతో ఆముక్తమాల్యదను రచించి ఆంధ్రుల కిచ్చిన రాయలవారు తెలుఁగుసాహిత్యములో మహోన్నతస్థాన మధిష్ఠించియుండుట మనము మఱువలేము. తెలుఁగు సాహిత్యములో ఆయనకున్న మక్కువ – ఆ సాహిత్యములోని విలువ ఆయన పలికిన పలుకులతో విందము :—

‘ తెలుఁ గదేల యన్న దేశంబు తెలుఁ గేను
దెలుఁగువల్లభుండఁ దెలుఁగొ కండ
ఎల్లనృపులు గొలువ నెఱుఁగవే బాసాడి
దేశభాషలందుఁ దెలుఁగు లెస్స. ’

[1960 సెప్టెంబరు]

V.R. NARLA MEMORIAL LIBRARY
V.R.NARLA
D.P.R.I.
Acc. No.

వసుచరి

ం

'సంగీత మపి సాహిత్యం సరస్వత్యాః స్తనద్వయం
ఏక మాపాతమధురం అన్యదాలోచనామృతమ్'—

చతుష్షష్టికళలలో మిక్కిలి ముఖ్యములైన సంగీత సాహిత్యములు రెండును సరస్వతీ స్తనద్వయమఁట. అనఁగా—ఆ స్తన్యమును గ్రోలి విద్వత్త గడించిన వ్యక్తులే సరస్వతీ పుత్త్రులు. వారే వాఙ్మయములో చిరంజీవులగు దివ్య మూర్తులు. వారి మూలమునఁనే లోకవృత్తము ఆకల్పాంతము నిలిచియుండును.

లక్ష్మీసరస్వతులు దూరదూరముగ నుండునట్లు సంగీత సాహిత్యములు సైతము ఆశ్రయభేదము గలిగియుండును. చక్కని సంగీత ముండుచోట సాహిత్యము కఱువైపోవును. సమగ్రమైన సాహిత్య మున్నచోట సంగీతము మృగ్యమై యుండును. రెండును గలిగివవారు నూటికిఁ గోటికి—ఒక్కఁడు; అఱు. అందును విశిష్ట-కవితాపీఠ మెక్కిన మహామహులలో ఇది అపూర్వమైన ఘట్టము. 'వాణి నా రాణి' యన్న ధీమా గల కవిత్వవీరులు గలరు. 'కోఽహం రండే!' యని ప్రశ్నించి, 'త్వ మే వాహమ్మ' ని సంభావింపఁబడ్డ సరస్వతీ స్వరూపులు గలరు. కాని 'ఇదం క్షాత్త్రి మిదం బ్రాహ్మ్య'

169

మన్నట్లు, ఇదిగో! ఈ చేతిలో కవిత్వదీప్తి; ఈ చేతిలో సంగీత చాతురి. అని చెప్పి చూపి పంచి ఈయనేర్చిన మహావ్యక్తి తెలుఁగునేలలో ఒక్క 'రామరాజభూషణుఁ' డే యన్నచో అది అతిశయోక్తి కాదు; వక్రోక్తి కాదు; స్వభావోక్తియే.

వసుచరిత్ర మున్నగు మహాకావ్యరత్నములను సృష్టించి యిచ్చిన 'భట్టుమూర్తి' యే తన ప్రతిభవలన 'రామరాజ భూషణుఁ' డయ్యెను.

ఏ దేశములోఁగాని ఏ భాషలోఁగాని కానరాని అపూర్వ కావ్యసృష్టి మన 'ప్రబంధయుగములోఁ' గాన వచ్చును. ఆ స్వర్ణయుగమునకు విజయనగరసామ్రాజ్యమే మూలబంధము. చారిత్రికముగా ఆ సామ్రాజ్యమునకు ఎంత ప్రతిష్ఠ యున్నదో సాహిత్యముగా దానికి ద్విగుణీకృతప్రతిష్ఠ ఉన్నదనవచ్చును. తెలుఁగులో 'పంచకావ్యము' లన్న సంప్రదాయము తెచ్చినది ఆ యుగమే. అందు-తొలిపూవు మనుచరిత్ర; మలిపూవు వసుచరిత్ర. అవి సంతరించి యిచ్చిన వ్యక్తి లిర్వురు గురుశిష్యు లగుట మఱింత వింత గూర్చు ఘట్టము. పైగా 'మనువు' రూఢియైనపిదప 'వసువు' గడింపవలె ననుట లోకవృత్తము. అనఁగా కావ్యవైచిత్రి చూడవలెనన్న-చూపవలెనన్న సాహితీసౌరభ్యము గుబాళింపఁజేయవలెనన్న 'మను-వసుచరిత్రలు' విధిగాఁ జదువవలె నన్నమాట. ఆ ధోరణిలోనే 'పిల్లవసుచరిత్ర' లెన్నో వెలసినవి.

సంస్కృతసారస్వతములోసైతము చవిచూడని ఎన్నో కవితారీతులు వసుచరిత్రలోఁ గలవు. ఆ వాఙ్మయములో

గోచరింపని ధ్వనివిశేషము లెన్నెన్నో వసుకావ్యములోఁ గానవచ్చును. ఇట్టి విశిష్టత చూచియే ప్రాచీను లెందఱో రామరాజభూషణుని భూషించుటయే గాదు; అనుసరించిరి; అనుకరించిరి; అనువదించిరి. ప్రాయికముగా మాతృకవంటిది సంస్కృతమనియు పుత్రికవంటిది తెలుఁగనియు ఒక సంప్రదాయము ఈ దేశములో ఉన్నది. దాని కపవాదసూత్రమును 'భూషణుఁడు' సృష్టించెను. కావుననే 'కాళహస్తి' మహాకవి, ఈ తెలుఁగు వసుచరిత్రను జదివి ముగ్ధుఁడై 'సంస్కృతవసుచరిత్రను' సంతరించెను. ఈతఁడు సామాన్యుఁడు కాఁడుసుమా! జగమెఱిఁగిన మహాపండితుఁడైన అప్పయ్యదీక్షితులవారికి ఈతఁడు శిష్యుఁడఁట. కావ్యరీతిగా వసుచరిత్రవైభవమునకు, మురిసిపోయి 'అంబలత్తాడు మయ్యన్' అను అజ్ఞాతకవి అజ్ఞాతములో ఈ వసువును అనువదించెనఁట. కవులచరిత్రలో కొంత కొంత ముమ్మొదట వ్రాసి మనకు రుచి చూపిన కావలి వేంకట రామస్వామి, వసుచరిత్ర పద్యములను గొన్నిటిని ఆంగ్లములో అనువదించుటయేగాక, రామరాజభూషణుని దివ్యజీవితమును గూర్చి ఆంగ్లములో వ్రాసిపెట్టెను.

'సూరి' యను పేరు గల ఒకానొక కవీశ్వరుఁడు ఈ వసుచరిత్రను జదివి మురిసిపోయి, దీని ననుకరించుచు 'వసుమంగళనాటకమును' సంస్కృతములో వ్రాసెనఁట. లింగమువేంకటరాయమంత్రి ఈ కావ్యమును జదివి 'వసుగిరికాపరిణయ' మని యక్షగానము వ్రాసెను.

సంస్కృతవాఙ్మయములో 'వ్యాఖ్యానఘట్టము'ల కున్న ప్రశస్తి ఏ భాషకును లేదనుట నిర్వివాదము. వ్యాఖ్యానము

లేని మంచికావ్యము సంస్కృతములో లేదు. అనఁగా సంస్కృతములో ప్రసిద్ధకావ్యమునకు ఎక్కడనో ఎవ్వఁడో ఏదో యొక వ్యాఖ్యానము వ్రాసియే యుండును. ప్రసిద్ధకావ్యమునకు ఒక్కరు కాదు; ఇర్వురు కాదు; ఎంద రెందరో వ్రాసిన ఘట్టములు అనేకము లున్నవి.

కాలిదాసమహాకవి వ్రాసిన రఘువంశాదికావ్యములను గూర్చి వ్యాఖ్యాతృచక్రవర్తి మల్లినాథసూరి ఇట్లన్నాఁడు:

'మల్లినాథకవిః సోఽయం మందాత్మానుజిఘృక్షయా
వ్యాచష్టే కాలిదాసీయకావ్యత్రయ మనాకులమ్'

'కాలిదాసగిరాం సారం కాలిదాసః సరస్వతీ
చతుర్ముఖోఽథవా సాక్షా ద్వేదు ర్నాన్యేతు మాదృశః.'

'తథాపి దక్షిణావర్త-నాథాద్యైః ఘూర్ణవర్త్మసు
వయం చ కాలిదాసోక్తి ష్వవకాశం లభేమహి'.

మందబుద్ధులకు సహాయపడునట్లు కాలిదాసకావ్యత్రయమునకు వ్యాఖ్యానము వ్రాసెదనని మల్లినాథుఁడు తన సంకల్పమును వివరించి, 'అహో! కాలిదాసవాక్యముల సారము గుర్తింపవలెనన్న కాలిదాసే కావలెను. లేదా-ఆ చతుర్ముఖుఁడో సరస్వతియో దిగిరావలెను. మావంటివారికి సాధ్యమగునా! అయినను 'దక్షిణావర్తాదు'లు చూపిన మార్గములో నడచి మేముకూడ ఏదో కొంత అవకాశము తీసికొందుము' అని వినయము చూపెను. అనఁగా ఆయన 'రఘువంశమునకు' వ్యాఖ్యానము వ్రాయసంకల్పించుటకు మున్నే సంస్కృత

ములో ఆ కావ్యమునకు ఎన్నో వ్యాఖ్యానము లున్నవన్న మాట. వానిలో-ఇవిగో కొన్ని :—

1 హేమాద్రి 2 చారిత్రవర్ధన 3 దక్షిణావర్త 4 నాథ 5 సుమతివిజయ 6 వల్లభ 7 ధర్మమేరు 8 విజయగణి 9 విజయానందసూరిచరణసేవక 10 దినకరమిశ్ర.

ఇందఱు వ్రాసిన వ్యాఖ్యానములు పరిశీలించి వానికన్న విశిష్టమైన తీరులో 'కోలచల మల్లినాథసూరి' 'సంజీవినీ' వ్యాఖ్య వ్రాసెను. ఇట్లే 'అభిజ్ఞానశాకుంత'లాదిరూపకములకు-చంపువులకు - విద్వత్సార్వభౌములైనవారే 'వ్యాఖ్యానాను పానములు' సిద్ధము చేసి, అమృతభూతమైన కావ్యరసాయన మును మన కందించిరి.

ఈ 'భిక్షు' తెలుఁగు సాహిత్యములో చాలఁ దఱుగై యున్నది. ఒకప్పుడు తెలుఁగుభారతములో కొంతభాగమునకు గచ్చదాఖ్యగా కొందఱు పండితులు వ్రాసిరికాని, ఆ ప్రతు లిప్పుడు కఱవైపోయినవి. ప్రాచీనాంధ్రకావ్యములలో ఒక్క వసుచరిత్రకుమాత్రమే సంస్కృతసంప్రదాయముగ వ్యాఖ్యా నములు వెలసినవి. అందొకటి 'విద్వజ్జనరంజనీ' వ్యాఖ్య. అది వ్రాసినది సోమకవి. ఈతఁడు కేవల మొక వ్యాఖ్యాతయే కాదు; గొప్పకవియు-మంచి భక్తుఁడును. ఈతఁడు తన వ్యాఖానములో రామరాజభూషణునిగూర్చి-

'కారణజన్ముఁడై కవినికాయము మెచ్చుఁగఁ గావ్యకర్తయై
భూరికళాకలాపుఁడయి పొల్పు వహించిన భట్టుమూర్తిచే'

ఇత్యాదిగ భూషించెను.

ఈతని వ్యాఖ్య మూలకావ్యమువోలె సామాన్యజనుల

కందుపాటులో లేదని తోఁచి మఱొక పండితుఁడు 'ప్రతిపదార్థ ప్రకాశిక' అని మఱొక వ్యాఖ్య వ్రాసెను. ఆతని పేరు ములుపాక బుచ్చయ్యశాస్త్రి. బ్రౌనుదొర ఆశ్రితులలో ఆతఁడొకఁడు. వసుచరిత్ర కాతఁడి వ్యాఖ్యానము వ్రాసి దానిని బ్రౌనుదొర కంకిత మిచ్చెననఁగా ఆ నాఁడు వసుచరిత్ర కున్న గౌరవము–పండితులకు బ్రౌనుదొరకున్న సంబంధము, విదేశ్యుఁడైన బ్రౌనుదొర కున్న ఆంధ్రభాషాభిమానము నేఁటి ఆంధ్ర యువజనము గుర్తింతురుగాక!

ఈ వ్యాఖ్యానమువంటిదే జూలూరి అప్పయ్యపండితుఁడుకూడ వ్రాసెనఁట. బ్రౌనుదొర సన్నిధానవర్తులలో ముఖ్యుఁడైన ఈతఁడు వసుచరిత్రకు వ్యావహారికధోరణిలో 'సప్రతిపదటీక' వ్రాసెను. దీని యచ్చుకూర్పులో అందచంద ములు తెచ్చుటలో బ్రౌనుదొర చేయి మిక్కిలిగాఁ గలదఁట. ఇవి యన్నియు నొక యెత్తు; శిష్టు కృష్ణమూర్తిపండితుని వ్యాఖ్య మఱొకయెత్తు. ఈతఁడు పేరు మోసిన పండితుఁడే కాదు; విద్వత్కవియు, ఆపై సంగీతనిష్ణాతుఁడఁట. ఇతఁడు తిమ్మని బ్రహ్మని, నందిని పందిని జేయఁగా వలంతి యని వదంతి యున్నది. చిన్నయసూరి శ్రమపడి వ్రాసియిచ్చిన తెలుఁగు వ్యాకరణమునకు సంస్కృతములో ఈతఁ డొక రచన చేసి, 'ఇదియే మూలము, సూరిరచనయే ఆంధ్రానువాదము' అన్నంతవఱకు సాగిన ఒకానొక అపవాదమునకు సృష్టికర్తగా పేరుమోసెను. ఇట్టి మోసములకు ఈ మహాపండితుఁడు పెట్టినది పేరని కవులచరిత్రలు ఘోషించినవి. అంతవాఁడు వసుచరిత్రకుఁగూడ వ్యాఖ్యానము వ్రాసెనన్నమాట ఆనందమును

గలిగించును. అదియు సామాన్యము కాదఁట. ఒక్కొక్క ఘట్టములో రామరాజభూషణుని పద్యమునకు ఎనిమిది అర్థములుసైత మున్నవని నిరూపించెనఁట. రామరాజభూషణుని పద్యములలో ఏది ఏ రాగమునఁ జదువవలెనో నిర్ణయించెనఁట. ఆ నిరూపించినట్లు ఆ యర్థవైచిత్రి వ్యక్తమగునట్లు ఆ సంప్రదాయమునుబట్టి వసుచరిత్రను బోధించువారు నేఁటికిని గొంద ఱున్నారు. కాని శిష్టువారి జన్మవిశేష మేమోకాని, ఆయన వ్రాసిన మహాకావ్యములువోలె ఈ వ్యాఖ్యానము సైతము పదిమందికంటిలోఁ బడక ఎక్కడనో మాటుమణఁగిపోవుట ఆయన దార్ఢ్యమే గాదు, ఆంధ్రుల దౌర్భాగ్యమును.

నవీనులలో దేవరాజసుధీమణి యని పిలువఁబడు శ్రీ తేవప్పెరుమాళ్ళయ్య, వసుచరిత్రకు సర్వలక్షణలక్షితమైన వ్యాఖ్యానమును వ్రాసెను. ఈ వ్యాఖ్యలేగాక ఈ మహాకావ్యమునకు ఎందఱెందఱో ఎన్నెన్నో విమర్శనములు చేసిరి. హరికథాపితామహులైన శ్రీ ఆదిభట్ల నారాయణదాస పండితుఁడు వసుచరిత్రలోని పద్యములను విశిష్య-అందలి సీసములను హాయిగా పాట పాడుచు శ్రోతలను తన్మయచిత్తులనుగాఁ జేసెడివారని పెద్ద లందురు.

అష్టావధానశతావధాన వైఖరిలో-ఆశుకవితా వైభవములో-ధ్వనికావ్య నిర్మాణములో-సాహితీసంపదలో - సంగీత శాస్త్ర సంప్రదాయ సమ్మేళనములో జ్యోతిశ్శాస్త్ర పాండిత్యములో యోగశాస్త్రప్రావీణ్యములో రామరాజభూషణకవి సార్వభౌమున కున్న ప్రశస్తి సంస్కృతాంధ్రకవులలో ఎవ్వరికిని లేదనవచ్చును. వీని కవిత్వమునుగూర్చి బ్రౌనుదొర

యాస్థానపండితుఁడైన బుచ్చయ్యశాస్త్రి ఏమని వర్ణించెనో మచ్చుగా నిచ్చట నిచ్చెదను :—

సీ. 'అది శారదామూర్తి యగు మూర్తి చెప్పిన
కావ్యరత్నము జగత్కల్మషఘ్న
మఖిలలక్షణలక్ష్య మతిభావగర్భిత
మలఘుశ్లేషైకవాచ్యార్థమయము
శబ్దార్థచిత్రితచ్ఛక్తి ప్రశస్త మ
లంకారవృత్యనుప్రాసపాక
శయ్యాదికల్పనాశ్లాఘ్య మనేకకో
శాజయ్యశబ్దార్థ సంయుతంబు

వ్యంగ్యమూలంబు నవరసవ్యంజకంబు
గాన, సులభము గా దట్టి కావ్యమునకు
సులభమగు టీక చేసి భూతలమునందు
ఖ్యాతిఁ గైకొమ్మ్ము విబుధు లందంద మెచ్చ.'

శ్రీనాథుఁడు చెప్పినట్లు సోమరిపోతులు కొందఱయ్యలు-జొనని ఈ కావ్యమును గొనియాడ నేరకపోవచ్చును.

'ఉపమ గలిగిన శయ్యల నొప్పియున్న

నంఘ్రిభవుని కావ్యంబు గ్రాహ్యంబు గాదు—' అని కులద్వేషపిశాచగ్రస్తుఁడైన అప్పకవివంటి అల్పుఁడు ఈసడించిన ఈసడింపవచ్చునుగాని, ఈ మహాకావ్యములోని విశిష్ట గుణములను గుర్తింపని పండితుఁడే లేఁడు. అనుకరింపని కవియే లేఁడు. శబ్దార్థముల వైచిత్రి-అనన్యసాధ్యములైన

శ్లేషభంగికలు - ముద్దుమురిపములు గూర్చు వింతవింతలగు సుద్దులు-అర్థశ్లేషము నాపాదింపని మృదుపాకసౌభాగ్యము-శ్లేషబంధము విడనాడని లలితపదగుంభనము-అక్షరాక్షరము అనుస్యూతమైన అనుప్రాససౌభాగ్యము - అపూర్వమైన అర్థచమత్కారవైఖరి - అవయవవర్ణనా సౌందర్యరసానుభావము-నిరర్గళశ్లేష కవితాప్రవాహపరీవాహము - నాటక కథా వైచిత్ర్యసంవిధానచాతుర్యము - చిత్రవిచిత్ర సందర్భ నిర్మాణ ప్రాగల్భ్యము-అనుక్షణ మింపు నింపు నుడికారముల పొంకము - అర్థద్వ్యయరచనాగుంభితములైన వాజ్ఞైపుణములు - చంద్రోదయాదివర్ణనావైశిష్ట్యము - ఏవంవిధసుగుణగణములకు ఈ మహాకావ్య మొక నిక్షేపమువంటిది. ఈ నిక్షేపము త్రవ్వి ఇందలి యమూల్యరత్నముల నేరి ఎంద రెందఱో తెలుఁగునేలలో వెదఁజల్లిరి.

ఇప్పటికిని ప్రాచీనసంప్రదాయముగ పాండిత్యము గడించినవారి నోట వసుచరిత్రపద్యములు విన్నచో వాని వైఖరి మనోజ్ఞమై నోరూరించును. ఇందలి కొన్ని సీసపద్యములకు రాగాలాపములను జోడించి అర్థవైచిత్రి చెడకుండ అద్భుతముగాఁ జదువుట నాగకమ్మన్యులకు క్రొత్తవార్త కావచ్చును. ప్రతిపదరసస్ఫోరకమైన ఈ మహాకావ్యమందలి పద్యములను వందలకొలఁది కాకపోయినను-పదులకొలఁదియైన ప్రత్యక్షరము పరిశీలించి వల్లింపవలసిన బాధ్యత నేఁటి విద్యా

ర్థుల కున్నది. నవలగా నాటకముగా ఒకతూరి చదివి ఆవలఁ బాఱవేయవలసిన కావ్యముగాదిది. దీనిని జదివి ఆనందింప వలెనన్న, కొంత భాషాసంస్కారము – చిత్తైకాగ్రత–ప్రతిభ ఉండవలెను. పాఠ్యగ్రంథమన్న భావముతోనైన పదేపదే దీనిని పఠించి ఇందలి మెఱుఁగులను గుఱుతించి ఉత్తమ సాహిత్యమును గడింతురుగాక ! !

[1959-సెప్టెంబరు]

వసుచరిత్ర

'ఆంధ్రకవితా పితామహ' అన్న బిరుదములో ఆంధ్రకవిత యనఁగా 'ఆంధ్రప్రబంధకవిత' యని యర్థము. పెద్దనకు పూర్వము ప్రబంధకవిత్వము లేదని కాదుగాని ప్రబంధకవిత్వ ములో పెద్దనకు పెద్దఱిక మున్నదని విమర్శకుల సిద్ధాంతము.

ఆతని కావ్యము పుట్టిన 'రాయల' యుగ మంతయు తెలుఁగుసాహిత్యములో ఒక బంగారు యుగ మనవలెను. ఆ జాతివాఙ్మయము – ఏ దేశములోను ఏ జాతిలోను లేదని ప్రాజ్ఞు లందురు. సంస్కృతవాఙ్మయమందుసైతము ఆ 'జాతికావ్యములు' లేవనుట సాహసము కాదు. విశిష్య-వసుచరిత్రవంటిది 'న భూతో నభవిష్యతి' కావుననే ఆ మహాకావ్యమును సంస్కృతమందే కాదు; అఱవములోను ఆంగ్లములోను అనువాదము చేసికొనిరి.

ఒకానొక కవి ఒక కావ్యమును నిర్మించెననఁగా – ఆ కావ్యమందు ఆతని గుణశీలములు కవితాధర్మములు నాఁటి సాంఘికపరిస్థితులు ప్రతిబింబించి తీరును. ఈ విషయములో ప్రబంధయుగ మంతయు ఒకే మూసలోఁ బోసినట్లు పెక్కు-విశేషములలో సంవాద మున్నదని కొందఱి భావము. ఆ యుగమునకు చక్రవర్తివంటి వసుచరిత్రకర్త, ఇతివృత్తవిష యమై ఇట్లని సిద్ధాంతము చేసెను :—

‘ కేవలకల్పనాకథలు కృత్రిమరత్నము లాద్యసత్కథల్
వావిరిఁబుట్టు రత్నము లవారితసత్కవికల్పనావిభూ
షావహపూర్వ్యవృత్తములు సానలఁ దీరిన జాతిరత్నముల్
గావున నిట్టి మిశ్రకథగా నొనరింపుము నేర్పుపెంపునన్ ’

పురాణములలో లేని కేవలకల్పనాకథలు నిక్కముగా గాజుపూసలక్రింద లెక్క. ఉన్నవి యున్నట్లు వర్ణించు పూర్వ రాజుల కథలు పుట్టినవి పుట్టినట్లే కన్పట్టు వజ్రముల వంటివి. సత్కవుల కల్పనావిశేషములచే అందచందములు పొందిన పూర్వవృత్తములు సానలు దీటిన జాతిరత్నములవంటివఁట. ఆ కథలే మిశ్రకథలనియు అవియే హృద్యములనియు భట్టుమూర్తి భావము.

అందువలననే ఆతఁడు పవిత్రమూర్తులైన భరతవంశ రాజులకు మూలపురుషుఁడైన వసురాజు కథను గైకొని తన కావ్యములో కావలసిన మార్పులు కూర్పులు చక్కఁగాఁ గావించుకొనెను.

కథావిధానములోఁ గైకొన్న మార్పుకూర్పులుగానీ నాటకరీతిగా పాత్రలను నడిపించుటగానీ ఈ కావ్యములో గౌణముగా ఉండవచ్చునేమోగాని అవియే ఆ మహాకవికి ప్రధానములు కావు. సాహిత్యములో సంగీతము జతపఱిచి మధురమంజులవాగ్విలాసములను జూపుచు రసానుభూతికి ప్రాముఖ్యమొసంగుచు శ్లేషభంగికలచే చమత్కృతి కూర్చుచు మృదుమధురబంధములో ఈ ప్రబంధమును భట్టుమూర్తి సృష్టించెను. శబ్దయోజనలో ఆతఁడు చూపిన శక్తియుక్తులు

ఉభయకవులలో ఎవ్వఁడును చూపలేదు. 'బట్టువాని శ్లేష ముక్కలు' - అన్న గిట్టని వట్టి రోఁతమాటకు, మాత్సర్య గ్రస్తమైన అట్టి వదంతికి చెంపపెట్టుగా చెప్పదెబ్బగా -ఆతఁడు చూపిన శ్లేషభంగికలు తెలుఁగులో సంస్కృతములో ఇంత వఱ కెవ్వరును జూపియుండలేదు. ఎక్కడనో యొకెక్కడ ఏదో కొంత ధ్వని యున్నంతమాత్రాన ఆ కావ్యము మహా కావ్యముగా ఆలంకారికు లంగీకరింతురు. వసుచరిత్రలో ప్రతి పద్యములో అడుగడుగునకు అన్ని ఘట్టములలో ఆద్యంతము ధ్వనివిశేషము కానవచ్చునని ప్రాచీనులైన వ్యాఖ్యాతలే పదింబదిగ ప్రస్తుతించిరి. కేవల మాతఁడు కథను నడపించుకొని పోవుటయే ప్రధానముగాఁ జూడఁడు. పద్య మెత్తుగడలోనే ఏదో యొక ధ్వనియో శబ్దవైచిత్త్రియో అలంకార ప్రాభవమో వర్ణనాచమత్కారమో సారస్యవిశేషమో ఉండి తీరవలెను.

శ్లేష యనఁగా సామాన్యముగా రెండు అర్థములు వచ్చుట. ఒకే పదములో లేదా-పదముల విఱుపులో లేదా-భాషనుబట్టియో కావలసిన యర్థములు రావలెను. అందొకటి ప్రకృతముగా రెండవది అప్రకృతముగా సాగిపోవలెను. ఆ శ్లేషను కథలో మేళవించి రసస్ఫోరకముగా నడపించిన-చో అదియే ధ్వనిగా పరిణమించును. ఆ ధ్వనికావ్యమే మహాకావ్య మని ఆలంకారికుల మతము. అట్టి ధ్వనివిశేషములకు వసు చరిత్ర పెట్టినది పేరు.

ఈ కావ్యములో పర్వతములకు నదులకు మానవత్వా మారోపించి రసౌచిత్యమును గూర్చెను. శ్లేషభంగికలో-కోలా

హాలుఁడు ఒక పర్వతరాజు. ఆతని రాచఱికముఁదీవి ఆభిజాత్య సంపద ఒక శ్రేణిలో నడచుచుండును. రెండవ వైపున-అది యొక పెద్దకొండ. ఆ కొండకు దాపుగ ఒక పేరుగన్న ఏరు. నదీపర్వతముల కలయికలో వింతలు విశేషములు. శ్లేషలో-శుక్తిమతి ఒకానొక లావణ్యవతి. ఆబిడను వలచినవాఁడు కోలాహలుఁడు. వారిరువురి కలయికవలన గర్భధారణము. ఒక వైపు శరదృతుశోభయు వేఱొకవైపు గర్భిణీలక్షణములు స్ఫురింపవలెను. కల్పనలు కావించి వానిలో శ్లేషభంగికలు ఇమిడ్చి అందు పొందికగా రసౌచిత్యమును బొదివి ఆ కథకు ఉదాత్తత గూర్చినవాఁడు తెలుఁగులో రామరాజభూషణుఁ డొక్కఁడుఁడే. సంస్కృతములోసైతము ఒక్కరో ఇర్వ్వురో మాత్రము అట్టివారుందురు.

కావ్యమునకు శోభ కలిగింపవలెనన్న కవిత్వములో శయ్యారీతులు ప్రధానముగా నుండవలెను. శయ్య-అనఁగా కవనములో ఒకానొక గమనము. దానిలో శబ్దగౌరవమిచ్చువారు కొందఱు; అర్థగౌరవమాదరించువారు మఱికొందఱు. అల్పాక్షరములే ప్రయోగించి అనల్పార్థములు చూపనేర్చినవారు వారిలో ముఖ్యులు. నన్నయాదులు ఆ శ్రేణిలో ఎన్నిక గన్నవారు. రామరాజభూషణుఁడు ఆ విద్యలో సిద్ధహస్తుఁడు. అసలు ఆతఁడు ప్రయోగించు పదములోనే అర్థసౌభాగ్యముతోపాటు 'నాదమహిమయు' మిశ్రమై మనస్సున కింపునింపును. దానికిఁ దోడుగ సందర్భశుద్ధియు కావలసినంత. అప్పుడా గమనము యమకమై ఒకపాటగా పాడుకొనుటకును శ్రావ్యముగా వినుటకును కారణమై యుండును. 'ప్రాయేణ

యమకే చిత్రే రసపుష్టి ర్నవిద్యతే' ప్రాయికముగా యమకము-చిత్రకవిత్వము ఉన్నచోట రసపుష్టి కానరాదఁట. ఈ సూత్రమునకు వసుచరిత్రలోని యమకము అపవాద మనుటలో సంశయమే లేదు. ఈ నడకనే మఱియొక తీరులో ఆలంకారికులు 'రీతి' యని పేరుపెట్టి పిలిచిరి. రీతి యనఁగా కావ్యమున కాత్మయనియే కొందఱు సూత్రించిరి. వారి త్రోవలో విశిష్టమైన పదరచనయే రీతి యగును. పదరచనలో విశిష్ట మనఁగా వైదర్భిప్రముఖ కావ్యగుణములు కలిగియుండుట. వైదర్భి - గౌడీయ - పాంచాలి, యని వానికి పేరులు పెట్టి వానిలో వైదర్భికి ప్రాముఖ్య మిచ్చిరి. దానినే ఒకానొకరు

'అస్పృష్టా దోషమాత్రాభిః సమగ్రగుణగుమ్భితా,
విపంచీస్వరసౌభాగ్యా వైదర్భీరీతి రిష్యతే' అని వర్ణించిరి.

అసాధుత్వాదిదోషములు లవలేశమేని పొరయకుండ ఓజఃప్రసాదాదులచే గుంభితమై విపంచీస్వరమును వినిపించునది వైదర్భీరీతియఁట. ఈ దృష్టితోఁ జూచినచో వసుచరిత్రలో ప్రతిపద్యము ఇదే త్రోవలో నడచి రసోత్పాదకమై ఒప్పియున్నదనవచ్చును.

ఉండవలసిన తావులలో నగలు నాణెములు ఉన్నచో ఆ దేహమున కందముచందము కలుగును. అలంకారములు కూర్చుటలో భట్టుమూర్తిని మించిన చేయి తెలుఁగులో లేదు. శ్లేషకవిచక్రవర్తియయ్యు అర్థాలంకారములలో ఆతఁడు చూపిన నేర్పుకూర్పులు అత్యద్భుతములు. ఆతని ప్రతిపద్యమును ఎన్నో 'కోణవుల'తో సరిచూచి అర్థము చేసి

కోవలసియుండును. పద్యములో ప్రతిపదములో ఆఁగియాఁగి, వేచివేచి ఆలోచించి మఱిపరిశీలింపవలెను. అప్పుడుగాని ఆ సారస్యములు అనంతముగా స్ఫురింపవు.

ఆతని కావ్యములో నాలుగింట ఒకవంతుమాత్రమే కథాచమత్కృతికి అవకాశ మిచ్చును. తక్కిన మూఁడు వంతులలో, పదలాలిత్యము- అర్థగౌరవము - అలంకారవైభవము-రసస్ఫూర్తి మధురశయ్యా-ధ్వనివిశేషములు పరువులిడుచుండును. ఆ పరువు లందుకొనుటలో 'పరువు' దక్కనివారు, వానిలోఁ గొన్నింటిని మూచూడనైనఁ జేతఁగానివారు, సారస్యవిశేషములలో అరసికులైనవారు, కథాభాగముతోనే కాలక్షేపము చేయఁదగిన 'తాహతు' గలవారు, 'వసుచరిత్రలో కథాకల్పన లేదు; జీవకళ లేదు.' అని పలుకుటలో ఆశ్చర్యము లేదు. ఆ వసుచరిత్ర యను రత్నాకరములో- అంతర్నిహితమైన అమూల్యరత్నరాశి విలువ - అట్టివారి కుఱుచబుద్ధులకు-కొలఁతబద్దలకు అంతవఱకే అంతుపట్టును. అర్థము గాని భాగములకు ఎవ్వఁ డే పేరు పెట్టినను రామరాజభూషణుని రసపోషణమునకు రవ్వంతేని లోపము వాటిల్లనేరదు.

'పిల్లవసుచరిత్ర' లెన్నో బయలుదేరినవన్నను-సంస్కృతాదిభాషలలో అనువాదములు సాగినవన్నను - వీణానినాదమే కవితలో వీనులవిందుగా వినవచ్చునన్నను- పంచకావ్యములలో ఒక మంచి కావ్యముగా పరింతురన్నను-రామరాజసభకే భూషణ మయ్యెనన్నను-శ్లేషకవిత్వములో చక్రవర్తిగా పట్టము గట్టిరన్నను-సాహిత్యరసపోషణుఁడని పేరుప్రతిష్ఠలు

గడించెనన్నను-రామరాజభూషణకవిచంద్రా! నీకే తగును;
నీ కావ్యమునకే తగును.

గీర్వాణాంధ్రములలో ఈ మహాకావ్యము మకుటాయ
మాన మన్నమాట ఈ నాఁటిమాట కాదు. సాహిత్య
ప్రపంచములో కవితాసామ్రాజ్యములో ఆచంద్రార్కప్రశస్తి
అద్భుతముగా గడింపనేర్చిన రామరాజభూషణకవి సార్వ
భౌమా! నీకు నీ సంగీతసాహిత్యములకు నీ శాస్త్రపాండితికి
ఇవే మా నమోవాకములు!!

[1959-అక్టోబరు]

నన్నయ్య - చిన్నయ్యలు

తెలుఁగువాఙ్మయము సాంగోపాంగముగ పరిశీలించితిమేని పద్యగద్యములలో 'నన్నయ్య-చిన్నయ్య' లకే ప్రథమస్థాన మీయవలెను. 'వాగనుశాసనుఁ' డనఁగా నన్నయభట్టారకుఁడే కనిష్ఠిక కెక్కును. సూరి యనఁగా చిన్నయసూరియే గణనకు వచ్చును. అవి రెండును నవీనులు పెట్టుకొను బిరుదములవంటివి కావు. తల్లిదండ్రులు పెట్టినవియుఁ గావు. ఆ యిర్వురికీర్తిమూర్తికి అవి దీపస్తంభములు. వారి భాషాసేవలో అవి సాగకములు.

నన్నయ్యకు మున్ను పద్యరచన లేదనికాదు. చిన్నయ్యకు మున్ను వచనము పుట్టలేదని కాదు. గాసటబీసటగానున్న వాఙ్మయములో ఆంధ్రకవిత్వమును ఒకదారికిఁ దెచ్చినవాఁడు నన్నయ్య కావున ఆంధ్రకవిత్వ విశారదుండని ఆతఁడనిపించుకొన్నాఁడు. సంస్కృతవాఙ్మయములోని గద్యపద్యములు కేవలము దండాన్వయముగా దిగి గజిబిజిగా సాగియున్న తెలుఁగువచనమునకు ఒకదారి తెన్ను చూపినవాఁడు కావున చిన్నయ్య, వచనగచనలో యుగకర్త అయ్యెను.

అదేమివిశేషమోగాని తెలుఁగువాఙ్మయములో వారిర్వురకు ఒకానొక యనుబంధము అనుస్యూతమాయెను. పేరులోఁగూడ అతఁడు నన్నయ్య కాఁగా ఈతఁడు చిన్నయ్య అయ్యెను. అతఁడు 'భట్టు' కాఁగా - ఈతఁడు 'సూరి'

అయ్యెను. చాళుక్యుల దర్బారులో ఆతఁడు మన్నన పొందఁగా కుంఫిణీకొలువులో ఈతఁడు ఎన్నిక కెక్కెను. నన్నయ్య వంశము చాళుక్యభూపతులకు 'కులబ్రాహ్మణులు' కాఁగా, చిన్నయ్యవంశము వైష్ణవమతములో కులబ్రాహ్మణస్థాన మధిష్ఠించెను. అనఁగా చిన్నయ్యతండ్రి వేంకటరంగయ్య సంస్కృతప్రాకృతద్రావిడాంధ్రములలో విశేషపాండిత్యము గడించి ధర్మశాస్త్రనిష్ణాతుఁడై విద్వచ్చిరోభూషణమై రామానుజులకు జన్మవాసమైన శ్రీ పెరుంబూదూరు పట్టణ ములో కోవెలలో ద్రవిడవేదపారాయణాధ్యాపకపదవిలో నియమితుఁడై వైష్ణవుల కెందఱికో మంత్రములను మంత్రార్థ ములను బోధించుచు పంచసంస్కారములను ప్రసాదించెడి వాఁడఁట. నన్నయ్య 'అపారశబ్దశాస్త్రపారగులైన వైయా కరణులును భారతరామాయణాద్యనేకపురాణప్రవీణులైన పౌరాణికులును మృదుమధురరసభావభాసురనవార్థవచన రచనావిశారదులైన మహాకవులును వివిధతర్కవిగాహిత సమస్తశాస్త్రసాగరగరీయఃప్రతిభులైన తార్కికులును నాదిగాఁ గలుగు విద్వజ్జనంబులతో నిండియుండిన రాజ మహేంద్రపురంబునందు వన్నెకెక్కియుండెను. చిన్నయ్య తండ్రివద్దనే ద్రావిడాంధ్ర ప్రాకృతములను నేర్చి దురవగాహము లైన తర్కాలంకారవ్యాకరణమీమాంసలలో కూలంకష పాండితిని సంపాదించి సాహిత్యచక్రవర్తియై శమదమాదిగుణ విరాజితుఁడై కవియై ఉద్యోగియై చెన్నపురిపౌరులలో పేరు ప్రతిష్ఠలు గడించెను. నన్నయ్య ఉన్ననాఁటికి తెలుఁగులో పద్యకావ్యముల పరిస్థితి ఎట్లున్నదో చిన్నయ్య వచ్చునాఁటికి

వచనకావ్యముల పరిస్థితియు అట్టిదే యగుట ఆశ్చర్యము. నన్నయ్య, తెలుగు భారతమును వ్రాసి సంస్కృతములో తెలుఁగు వ్యాకరణమును రచించినట్లు చిన్నయ్య నీతిచంద్రికను వ్రాసి తెలుఁగు వ్యాకరణమును సంస్కృతములో నిర్మించి యిచ్చెను. నన్నయ్య భారత రచనతో పూర్వాంధ్రవాఙ్మయము సర్వము అణఁగిపోయినట్లే చిన్నయ్య వచనరచనచే పూర్వాంధ్ర వచనరచన మాటుమణగెను. చిన్నయ్య ఉపాధ్యాయుఁ డగుటఁజేసి తెలుఁగువ్యాకరణము తెలుఁగులో నుండుట మంచిదని తోఁచి తాను వ్రాసిన సంస్కృతభాషలోని తెలుఁగువ్యాకరణములో కొంతవఱకుఁ దీసికొని 'బాలవ్యాకరణము'ను సిద్ధపఱిచెను. సంస్కృతభాషలో పాణినీయము ముందు సర్వవ్యాకరణములు మాటుమణఁగినట్లే తెలుఁగు వ్యాకరణము లన్నియు చిన్నయ్య బాలవ్యాకరణము ముందు చిన్నవై చిన్నవోయెను.

నన్నయ్య చెప్పినదే చిన్నయ్యకు వేదము. అతఁడు 'చింతామణి' వ్రాయఁగా, ఈతఁడు 'బాలవ్యాకరణమును' వ్రాసెను. అదేమి చిత్రమోగాని నన్నయ్య వ్రాసిన 'చింతామణికి' అన్యకర్తృత్వ మంటఁగట్టినట్లే 'బాలవ్యాకరణము'నకును అన్యకర్తృత్వము అంటఁగట్టిన పాక్షికబుద్ధులు పుట్టిరి. ఇతరమతముల తాకిడికి బక్కచిక్కి అకటావికటము కానున్న ఆర్షమతమును ప్రచారము సేయుటకయి నన్నయ్య ఆంధ్ర భారతమును సృజించి యిచ్చెను. ఆంగ్లభాషాప్రాభవమువలన విదేశ్యపరిపాలనము మూలమున ఎత్తువడ్డ తెలుఁగును ఉద్ధరింపవలెనని చిన్నయ్య ఎంచి, శాస్త్రముతోపాటు సాహిత్య

మును నవ్యమార్గములో నడపించెను. 'వింటే భారతమే వినవలె'నన్న ఆమెతవంటి సామెత నన్నయ్య రచననుబట్టియే పుట్టినట్లు, వచనముగాని వ్యాకరణముగాని చిన్నయ్య చెప్పినదే మనకు శిరోధార్యమన్నంత సంప్రదాయము పుట్టినది.

కాకతాళీయమో కాలకర్మవశమోగాని, నన్నయ్య ప్రవాసిన భారతములో మూడుపర్వముల కావల 'కవిబ్రహ్మ' కావలసివచ్చెను. చిన్నయ్య ప్రవాసిన నీతిచంద్రిక శేషమునకు 'గద్యకవిబ్రహ్మ'రావలసి వచ్చెను.

'ఆదిఁ దొడంగి మూడుకృతు లాంధ్రకవిత్వవిశారదుండు వి
ద్యాదయితుం డొనర్చె మహితాత్ముఁడు నన్నయభట్టు దక్షతన్'

అని 'కవిబ్రహ్మ' తిక్కనసోమయాజి, నన్నయభట్టును సుతింపఁగా—

'చిన్నయసూరి, ధీరు లెదఁ జేరిచి సారెకు నాదరింపఁగా
మున్ను రచించి మించె సగమున్ వచనంబుగ నీతిచంద్రికన్'

అని 'గద్యకవిబ్రహ్మ' కందుకూరి పంతులు చిన్నయ సూరిని అభినందించెను.

నన్నయ వలికిన పలుకు లెల్ల తెలుఁగునకు లక్షణభా గమై రాణించినట్లు, చిన్నయ్య చేసిన రచన లన్నియు ప్రామా ణికములై పరిఢవించినవి. ఆతడు పద్యరచనలో యుగకర్త కాఁగా ఈతడు గద్యరచనలో యుగపురుషుఁ డాయెను. చాళుక్యుల అండదండలచే నన్నయభట్టు పంచమవేదమును తెలుఁగునకుఁ దెచ్చి వైదికసభ్యత నిలఁబెట్టినట్లులు, చిన్నయ్య చెన్నపురిలో ప్రాచ్యవిజ్ఞానము గల భారతీయోద్యోగులు

పెక్కు-మంది ప్రోత్సాహముచే బలము చేకూర్చుకొని స్వసంఘ సమావేశ మేర్పఱిచి విశిష్టాద్వైతమతమును బోధించెను. నన్నయ్య కేవలము కులబ్రాహ్మణుఁడే కాదు; అవిరళజప హోమతత్పరుఁడు, విపులశబ్దశాసనుఁడు, సంహితాభ్యాసుఁడు, బ్రహ్మాండాదినానాపురాణవిజ్ఞాననిరతుఁడు, లోకజ్ఞుఁడు, ఉభయ భాషా కావ్యరచనాశోభితుఁడు, సజ్జనుఁడును. చిన్నయ్య సైతము సర్వశాస్త్రవేత్త, సాహిత్యచక్రవర్తి, మహా వ్యాకర్త, నిగర్వచూడామణి, హయగ్రీవమంత్రోపాసకుఁడు, విద్యావినయభూషితుఁడు, సుందరాకారుఁడు, సరస్వతీమూర్తి, లోకజ్ఞుఁడు, ఉభయభాషాకావ్యరచనావిరాజితుఁడు, మహా మహోపాధ్యాయుఁడును.

నన్నయ్య ప్రారంభించిన మహాభారతము ఏ కారణము వలననో మూఁడు పర్వములతో ఆఁగిపోఁగా, చిన్నయ్య ప్రారంభించిన 'ఆంధ్ర నిఘంటువు' రెండు సంపుటములతో ఆఁగిపోయెను. ముత్యాలను బోలు చేతిప్రాలతో తానుగా ఎన్నో పదములను ఎత్తి ప్రాసి వానికి పూర్వమహాకవి ప్రయోగముల మూలమున క్షుణ్ణముగ అర్థనిర్ణయము చేసి ఒక దారికిఁ దెచ్చిన 'అకారాద్యాంధ్ర నిఘంటువు' రెండు సంపుటములను, ఆయన మరణానంతరము ఆఁడువాండ్ర నడిగి పుచ్చుకొనిపోయి అక్కఱ పడినంత వఱకు చక్కఁగా అందలి యంశములను సేకరించుకొని సొమ్ము చేసికొన్నవారు కొందఱు కాఁగా- ఆ ప్రాఁతప్రతినే చేతికిఁ దెచ్చుకొని అమ్మినవారు అమ్మఁగా విలిచినవారు విలిచికొని ఎట్లో తుదకు కాకినాడకు చేర్చిరఁట. అది నేఁడు కోవెలలో విగ్ర

హాముఓలె సురక్షితముగా ఉన్నదని వినికిడి. ఇటీవల వెలసిన తెలుఁగు కావ్యము లన్నింటికి నన్నయ్య భారతమే మూల పీఠమైనట్లు చిన్నయ్య కేవల వెలసిన నిఘంటువు లన్నింటికి చిన్నయ సూరి నిఘంటువే మేలుబంతి అయినది.

అక్షరరమ్యత నాదరించి ప్రసన్నకథాకవితార్థ యుక్తిలో పేరు వడసి నన్నయభట్టు, నానారుచిరార్థ సూక్తులకు నిధి యైనటే – చిన్నయసూరి, ఛందోగర్భిత వచనరచన చేసి లలితోక్తులతో వ్యాకరణమును లోకో క్తులతో నీతిచంద్రికను రచించి రుచిరార్థసూక్తులకు నిధి యయ్యెను. నన్నయ్య అన్న మాటలు పెక్కులు చిన్నయ్య 'లక్షణ భాగమునకు' లక్ష్యములు. 'అతి మానుష మత్యద్భుత మతిదుష్కర మయిన కేశవార్జున కృతి' వంటి నన్నయ్య పలుకులు దొరకినంతవఱకు 'లక్ష్యము' చేసికొనుటయే చిన్నయ్య లక్ష్యము. చిన్నయ్యను పరిశీలించి చూడఁగా నన్నయ్య భాషకే చిన్నయ్య వ్యాకరణము ప్రవాసెనా – అన్నట్లు స్ఫురించును. నన్నయ్య యెన్నుకొన్న తెన్నులే చిన్నయ్యకు శిరోధార్యములు. నన్నయ్య రచన– అనఁగా చిన్నయ్యకు చెవులపండువు. నన్నయ్య, కేవలము పద్య కవనములోనే ఆద్యకవి కాదు; మహాసముద్రమువంటి ఆ భారత రచనలో వచనమును వేఱుగా మనము రుచి చూడము గాని, ఆ వచనము వంటి వచనమును తెలుఁగులో ప్రవాసినవాఁడు – ప్రవాయఁగలవాఁడు ఈ చిన్నయ్య ఒక్కఁడే యనుట సత్యేతరము కాదు.

'విద్వజ్జనంబుల యనుగ్రహంబునం జేసి నా నేర్చు విధం
బున నిక్కావ్యంబు రచియించెద నని నన్నయ్య,

'హరి హరాజ గజాననార్క షడాస్యమాతృ సరస్వతీ
గిరిసుతాదిక దేవతాతతికిన్' నమస్కృతి చేసి మహాభారత
సంహితారచనబంధురుడైనట్లు,

చిన్నయ్య —

'కరుణ తెఱంగున హరి యెద
నిరవుకొని యఘాళి నరయనీక యతనిచే
నిరతము సంశ్రితజనులం
బరిరక్షింపించు తల్లి భజియింతు మదిన్'

ఇత్యాదిగ ప్రస్తుతి – ఆదికవిస్తుతి చేసి,
'ఒనరఁగాఁ బంచతంత్రహితోపదేశ
ములను బరికించి వానిలో వలయు నంశ
ములను గొని కొంత యభినవంబుగను గూర్చి
కృతి యొనర్చెద నీతిచంద్రిక యనంగ' – అని

'నీతిచంద్రిక'ను ఉపక్రమించెను.

బాలవ్యాకరణప్రారంభములో,
'శ్రీలతకుం బ్రాఁకయి వృష
శైలంబున వెలసి తనదుచాయ కెలయు ధ
న్యాళి దగ మాన్చి కోర్కులు
చాలంగా నొసఁగు కల్పసాలమును గొలిచి,

లలితోక్తులతో నొనరుపడునట్లు ఆంధ్రమునకు లక్షణ మొనర్తునని చెప్పుకొనెను.

అల్పాక్షరములు గల వృత్తములలో మధురమైన నడకలో నన్నయ్య మనకు 'చింతామణిని' సృష్టించి ఈయఁగా- అల్పాక్షరములు గల రచనలో అనంతమైన యర్థము నిమిడ్చి అవ్యాప్త్యతివ్యాప్తులు లేని సూత్ర నిర్మాణము చేసి చిన్నయ్య మనకు బాలవ్యాకరణ మిచ్చెను. సూత్ర వాఙ్మయమును బరిశీలించి చూడఁగా సూత్ర నిర్మాణదక్షతలో పాణినియు తెలుఁగులో ఒక్క చిన్నయ సూరియు ముఖ్యులుగాఁ గానవత్తురు. నన్నయ్య ప్రాసిన చింతామణికి శేషగ్రంథముగా అధర్వణకారికలు వచ్చినట్లే చిన్నయ్య ప్రాసిన బాలవ్యాకరణమునకు ప్రౌఢవ్యాకరణము శేషగ్రంథమై వెలసినది.

సూరి చేసిన రచనలలో వ్యాకరణభాగ మొకయెత్తు; వచనభాగ మొకయెత్తు. సూరి ప్రాసిన 'రాజ్ఞీమకుటాభిషేకము' - 'పచ్చయప్ప నృపయశోమండనము' వంటి మధురాతిమధురములైన పద్యరత్నములు నేఁడు ప్రచారములో లేకుండుట శోచనీయము. చిన్నయ్య ఎన్నెన్నో చాటుపద్యములను ప్రాసెనఁట. 'సంస్కృత బాలబోధ' మొదలు 'విశ్వనిఘంటువు' వఱకు ఎన్నో సూరి సృష్టించెను. 'అకారాది నిఘంటువు - ఆంధ్రధాతుమాల - ఆంధ్రకౌముది - అక్షరగుచ్ఛము - చింతామణివృత్తి - పద్యాంధ్రవ్యాకరణము, ఇత్యాదులు సూరిచేతిలో సృష్టింపఁబడ్డవని వినఁగా వానిని జదువను నోరూరని పండితుఁ డెవఁడుండును ? భట్టబాణుని

కాదంబరి సూరిచేతిలో వచనముగా వచ్చెననఁగా దాని రామణీయక మేమని చెప్పవలసియుండును ? ఆదిపర్వము వచనముగా వ్రాసి అచ్చువేయించెనుగాని దానిని జదివెడు భాగ్యము మన కిప్పుడు దక్కదు. 'లా' చట్టములు భాషాంతరీకరణము చేసెనఁట. 'యాదవాభ్యుదయ' మను మహాకావ్యము ఆతని చేతిలో పుట్టినదఁట. 'సుజనరంజని' యను మాసపత్రికను వెలువఱిచి, పరీక్షార్థులకే గాక పండితులకు సైతము కలిగెడి భాషాసందేహాములను ఆ పత్రికలో సూరి పరిష్కరించెడివాఁడఁట. ఆతని సంస్కృతాంధ్రకవితారీతికి ఇచ్చట రెండే రెండు పద్యములను లక్ష్యములుగా నిత్తును -

'గగనంబట్లు రసప్రపూర్ణవిలసత్కందంబుల న్నీతి య
భ్రగసాలంబుగతిన్ సితచ్ఛదములన్ భాసిల్లి మేరుక్రియన్
జగదామోదసువర్ణ భాస్వరముగా జానొంది పచ్చావనీ
శగుణంబుల్ గణుతించు కోశమిడి యిచ్చ న్మెచ్చుగావించెడిన్.

గుణస్య బాధికాం వృద్ధిం కృతవాన్ పాణినిః పురా
అబాధితగుణాం వృద్ధి మకరోత్ 'పచ్చపప్రభుః'

భారతమువంటి పద్యకావ్యము నీతిచంద్రికవంటి వచన గ్రంథము బాలవ్యాకరణమువంటి వ్యాకరణశాస్త్రము తెలుఁగులో ఇప్పటికి పుట్టలేదనుట అతిశయోక్తికాదు. నన్నయ్య చిన్నయ్య మాటలలో నున్న ఆ కూర్పునేర్పులు తీయఁదన

ముట్టిపడునట్లు జాలువాఱిన ఆ యక్షరరమ్యత లలితోక్తు
లతో ప్రసన్నమైన ఆ శైలి మనోహరమైన ఆ వాక్య
సరణి మఱియొకరి కబ్బవు. ఆ రచనలలో ఏదియుఁ జదు
వనివాఁడు ఏమియుఁ జదువనివాఁడే. ఆ రచనల నన్నింటిని
ఎందఱో పరిష్కరించుటయు ప్రకటించుటయు నిత్యము చూచు
చున్నాము. ఎన్నో ప్రతులు పుట్టినవి; పుట్టుచున్నవి. కవి
హృదయ మెఱుఁగనివారిచేతిలోఁ బడి ఎన్నెన్నో రూపాంత
రము లెత్తియున్నవి. పఠనపాఠనములలో తమకుఁ దోఁచిన
రీతిగా పాఠము లెన్నియో సవరించుచు సమర్థించుచు సరిపెట్టు
కొనవలసిన దుర్గతి నన్నయ్య చిన్నయ్య రచనలకే పట్టిన
దనఁగా సాహిత్యపరముగా ఇంకేమి చెప్పవలెను ?

సంస్కృతాంధ్రసారస్వతమహోదధిని నిశ్శేషముగా
చుళుకించిన చిన్నయసూరి రచనలకే ముద్రణాభాగ్య మబ్బక,
అవి మూఁచూఁచు భాగ్యమైన మనకు దక్కలేదనఁగా మన
యదృష్టమేమని చెప్పఁగలము ? పేరైన బయటికి రాక ద్రవిడ
దేశములో పుట్టి అందే అణఁగిపోయిన రచన లెన్నో చిన్న
య్యవి ఉన్నవని పెద్దలన్నమాట విన్నవారికి విచారము కలు
గదా ? జగదేకపండితుఁడైన చిన్నయ్యవంటి మహోన్నతి
స్వయము చేతితో వ్రాసిన గ్రంథములే ఇంకను ముద్రితములు
కాలేదన్నమాట తెలుఁగువారికి తలవంపు లొనర్చదా ? ఆతఁడు
కూర్చిన ప్రత్యక్షరము ఆణిముత్తమై ఆంధ్రసరస్వతికి

అమూల్యాభరణమై ఉండుననుట పొగడ్త కాదు. విశ్వవిద్యాలయములవంటి మహావిద్యాపీఠములుగాని ప్రభుత్వసంస్థలుగాని సూరిరచనలు సేకరించి కన్పించిన వన్నియు ముద్రింపించి సవరింపవలసిన వన్నియు సవరింపించి అక్కఱలైనచో టీకలు వ్యాఖ్యలు వృత్తులు భాష్యములు వ్రాయించి వాఙ్మయపరముగా ఇంతపున్నెము కట్టుకొనవలదా ? విశ్వకవి రవీంద్రుని కవితాప్రతిభను ఇటీవల విశ్వమయము చేసినట్లు, చెన్నపురి ప్రభుత్వము - ఆంధ్రప్రభుత్వము రెండును చిన్నయసూరి ప్రతిభాపాండిత్యములనుగూర్చి చేయవలసినది సర్వము చేసినచో మన కింకేమి కావలయును ?

ఈ దేశములో ఆంధ్రసాహిత్యము ఉండునందాఁక నన్నయ్య చిన్నయ్యలు సూర్యచంద్రులై తెలుఁగు వెలుఁగులు వెలయింతురుగదా !

[1962 - అగస్టు]

शम्

ది ఓరియన్ట్ పవర్ ప్రెస్, తెనాలి

ఏతద్గ్రంథకర్తృ - రచనలు

1. వైదిక వాఙ్మయ చరిత్ర 3=00
2. సతీసప్తతి (పద్య) 0=25
3. కథావింశతి 0=65
4. చంద్రాపీడ చరిత్ర 0=50
5. కామ శాస్త్రము 3=00
6. కావ్యమాల (1 భాగము) 1=50
7. కావ్యమాల (2 భాగము) 1=50
8. సుభాషితము 0=25
9. ధర్మశాస్త్రము 3=00
10. కవులకథలు 0=75
11. వరరుచి 0=75
12. ఈశ్వరసేవకులు 1=00
13. విక్రమ కథలు 0=65
14. (మొక్కుబడి పద్య) 1=00
15. నవనాథము 1=50
16. బృహత్కథలు 0=75
17. వత్సరాజు 1=25
18. విక్రమాదిత్యము 0=75
19. సాలభంజికలు 0=68
20. బాపూజి (పద్య) 1=00
21. చారుదత్తము 1=25
22. నీతిచంద్రిక (సవ్యాఖ్య) 3=00
23. చిన్నయ్య (సూరిచరిత్ర) 0=50
24. నైషధము 1=25
25. కలిపురాణము (పద్య) 3=00
26. ప్రతాపసింహము 2=00
27. వీరపూజ 1=25
28. చాణక్యము 1=25
29. దివ్యమూర్తులు 1=25
30. స్వరాజ్యకథలు 1=25
31. మాయాభిక్షువు (పద్య) 1=65
32. కలిపురాణము (2 భా.) 3=00
33. మా స్వామి (పద్య) 3=00
34. మంజరి (పద్య) 2=00
35. జాతక కథలు 0=75
36. సైరంధ్రి 2=50
37. 'పంచశతీ' పరీక్ష (విశ్వనాథవారి పంచశతికి విమర్శనము) 0=75
38. కవిరాజు (త్రిపురనేని) 3=00
39. పిట్టిక (పద్య) 0=60
40. సాహితి (సాహిత్యవ్యాసములు 3=00
41. వసంతసేన (రూపకము) 3=00
42. రామాయణసమీక్ష 3=00
43. కల్పవృక్ష-ఖండనము (విశ్వనాథవారి) 4=00
44 కులపతి (శ్రీవరదాచార్య చరిత్ర) 2 00
45. మేవాడ విజయము 2=50
46. కలిపురాణము (3భా.ప.) 3=00
47. కలిపురాణము (4భా.ప.) 3=00
48. కలిపురాణము (5భా ప.) 3=00
49. మహారథులు 1=25
50. అంజలి (పద్య) 1=25
51. లోకతంత్రము (పద్య 1=25
52. స్వరాజ్యము (పద్య) 1=25
53. సాహితీ సమీక్ష 1=25
54. త్యాగయ్య 1=25
55. రామరాజభూషణము 1=25
56. వాల్మీకము 1=25
57. మాలిక (పద్య) 1=25
58. కావ్యకథలు 0=75
59. తెలుఁగు వెలుఁగులు 0=75
60. చిత్రకథలు 0=75
61. వినోదకథలు 0=75
62. కవిత్రయము 1=25
63. పండితుఁడు (పద్య) 0=25
64. శకుంతల (పద్య) 0=25
65. తెనుఁగులక్షణము 1=25
66. శకుంతలా (సంస్కృతము) 1=00

ప్రతులకు: 'భాషాపోషక గ్రంథమండలి', వెంకటేశ్వరనగర్ -నిడుబ్రోలు

BCT

AOUA102 B103



కృతికర్త :—

పండిత - సత్యనారాయణ చౌదరి

జననము : 31—12—1907

తల్లిదండ్రులు : శ్రీ రాజరత్నమ్మ - బుచ్చయ్య

జన్మభూమి : అమృతలూరు - గుంటూరు మండలము

విద్యాభ్యాసము : అమృతలూరు-సంస్కృతపాఠశాల;
చిట్టిగూడూరు-'నారసింహసంస్కృతకళాశాల'
సంస్కృతాంధ్రములు - 'ఉభయభాషాప్రవీణ' A-1929

అభిమానకృషి : సాహిత్యవ్యాసంగము-గ్రంథరచన-కవిత్వదీక్ష

వృత్తి : ఆంగ్లకళాశాలాధ్యాపకత్వము

రచనలు : ఇప్పటికి ముద్రితములు-నలువది
అముద్రితములు-ముప్పది

స్థిరనివాసము : వెంకటేశ్వరనగర్-నిడుబ్రోలు-గుంటూరుజిల్లా

ముద్రణ ఫౌండేషన్ పుస్తకాల పరిశీలనాపట్టిక

పుస్తకం సంఖ్య	AOUA102B103
పుస్తకం పేరు	పాపాని
తారీఖు	31 December 2025
ముందు అట్ట	Yes
వెనుక అట్ట	Yes
మొత్తం పేజీలు	199
పెద్ద సైజు పేజీలు	NO
ఖాళీ పేజీలు	Ci, BE 1, 4
లేవి పేజీలు	1,2
తయారు చేసినది	M. Raji
పేజీలు విరుచినది	M Raji
స్కాన్ చేసినది	
పరీక్ష చేసినది	anusha
పేజీలు పరిచూసినది	
బైండింగు చేసినది	
ప్యాకింగు చేసినది	
పరిస్థితి	good